అనుదినం... జనస్వరం
నవతెలంగాణ
మంగళవారం 06-6-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
సంపుటి : 9 | సంచిక : 156 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు | వెల : 6.50



ప్రజాస్వామిక ప్రభుత్వాలకు పార్టీలే పునాదులు

భారత నిర్మాతలుగా యువతను తీర్చిదిద్దుతాం : సీఎం కేసీఆర్

- కోకాపేటలో భారత్ భవన్‌కు శంకుస్థాపన

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి, గండిపేట


ప్రజలతో ఎన్నికైన ప్రజాస్వామిక ప్రభుత్వాలకు రాజకీయ పార్టీలే పునాదులని బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. భావి భారత నిర్మాతలుగా యువతను తయారు చేసే దిశగా, దేశ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మరింత సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దాల్సిన అవసర మున్నదన్నారు. ఇందుకోసం రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, సైద్ధాంతిక రంగాల్లో భోధన, శిక్షణ అవసరం ఉందన్నారు. సోమవారం రంగారెడ్డి జిల్లా కోకాపేటలో భారత్ భవన్ (సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్)కు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధికి దోహదం చేసే దిశగా నాయకత్వాన్ని తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ దిశగా ప్రపంచ వ్యాప్తంగా ఆయా రంగాల్లో అనుభవజ్ఞులైన గొప్ప గొప్ప మేధావులను, వివిధ రంగాల్లో అనుభవం ఉన్నవారిని పిలిచి నాయకత్వ శిక్షణనిప్పిస్తామన్నారు. ప్రజలకు సుపరిపాలన అందించే నాయకత్వాన్ని తయారు చేస్తామన్నారు. అందులో భాగంగానే 'పొలిటికల్ ఎక్సలెన్స్ అండ్ హెచ్ ఆర్ డీ' కేంద్రాన్ని తీర్చిదిద్దాలనే నిర్ణయం తీసుకున్నామని సీఎం వివరించారు. దేశం నలుమూలలనుంచి వచ్చే సామాజిక కార్యకర్తలకు, రాజకీయ వేత్తలకు, నాయకులకు భారత్ భవన్‌లో సమగ్రమైన సమస్త సమాచారం లభ్యమౌతుందని చెప్పారు. శిక్షణకు అనుగుణంగా.. తరగతి గదులు, ప్రొజెక్టర్‌తో కూడిన మినీహాల్స్, విశాలమైన సమావేశ మందిరాలు, అత్యాధునిక సాంకేతికత కలిగిన డిజిటల్ లైబ్రరీలు, వసతికోసం లగ్జరీ గదులు నిర్మితమౌతాయని అన్నారు. మీడియా రంగంలో రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సాంకేతికను అందిపుచ్చుకునే దిశగా సీనియర్ టెక్నికల్ బృందాలు కూడా పనిచేస్తాయని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి రంగాల అధ్యయనం దిశగా, శిక్షణ సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ నిర్మాణ ...2లో

సిబ్బందే లేకుండా భద్రత ఎలా?

సిగ్నల్, ట్రాఫిక్ విభాగాల్లో భర్తీకాని 77 వేల పోస్టులు

- మొత్తంగా 3 లక్షల పోస్టులు ఖాళీ
- రైల్వేశాఖ ఉద్యోగ నియామకాల్లో కేంద్రం నిర్లక్ష్యం





ప్రభుత్వరంగ సంస్థల్ని ప్రయివేటుకు అప్పగిస్తూ.. జనం ప్రాణాల మీదకు వచ్చినపుడు మతరంగు పులిమి రాజకీయం చేయటానికి సైతం మోడీ ప్రభుత్వం వెనుకాడటంలేదు. ఆసియాలోనే అతిపెద్ద రైల్వేనెట్ వర్క్ ఉన్నా.. లక్షలకిలోమీటర్ల పట్టాలు, 8 వేలకుపైగా రైల్వేస్టేషన్లు ఉన్నా.. దాని బాగోగుల గురించి పట్టించుకోవటంలేదు. మోడీ హయాంలో జరిగిన రైలు ప్రమాదాల్లో మూడు లక్షలమందికి పైగా చనిపోయినట్టు అధికారవర్గాలే ధ్రువీకరిస్తున్నాయి. అయితే తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవటానికి కేంద్రంలోని బీజేపీ సర్కార్ వాస్తవాలను దాచిపెడుతోంది. సిగ్నల్స్ నిర్వహణకు సరైన సిబ్బందిలేని పట్టాలపై..ప్రయాణీకుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని, సమస్యల సుడిగుండంలో ఉన్న రైల్వేను చిన్న చూపు చూస్తున్నదని ప్రజలు, ప్రతిపక్షాలు, మేధావులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్‌లో కత్తిరింపులే ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు.

న్యూఢిల్లీ : భారతీయ రైల్వేల్లో భద్రతకు సంబంధించి వివిధ విభాగాల్లో సిబ్బందిని ఏండ్ల తరబడి భర్తీ చేయడం లేదు. ముఖ్యంగా రైల్వేలో కీలకమైన సిగ్నల్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాల్లో 77 వేలకు పైగా ఖాళీలు భర్తీ చేయలేదు. భారతీయ రైల్వేలో మూడు లక్షలకు పైగా ఖాళీలు ఉన్నాయి. ఈ వివరాలను సాక్షాత్తూ రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో వెల్లడించారు. 2022 డిసెంబరు 23న రాజ్యసభలో మంత్రి మాట్లాడుతూ 'దేశవ్యాప్తంగా రైల్వేల్లో 3.12 లక్షల నాన్ గెజిటెడ్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది' అని తెలిపారు. ఇందులో కీలకమైన సిగ్నల్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ విభాగాల్లో గణనీయమైన సంఖ్యలో ఖాళీలు ఉన్నాయని చెప్పారు. సిగ్నల్స్ అండ్ టెలికమ్యూనికేషన్స్‌లో 14,815 ఖాళీలు, ట్రాఫిక్ అండ్ ట్రాన్స్‌పోర్ట్‌లో 62,264 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అత్యధికంగా 87,654 పోస్టులు, మెకానికల్ విభాగంలో 64,346 ఖాళీలు, ఎలక్ట్రికల్ విభాగంలో 38,096 ఖాళీలు ఉన్నాయని మంత్రి తెలిపారు. కీలకమైన కార్యాచరణ విభాగాల్లో సిబ్బంది కొరత భారతీయ రైల్వేల ...2లో

బడ్జెట్ కేటాయించినా పైసా ఖర్చు చేయలే

- కవచ్ కోసం నిధులున్నా నిరుపయోగమే
- టెండర్ల జోలికే వెళ్లని రైల్వేశాఖ

వివరాలు 2లో



వందేభారత్ పైనే శ్రద్ధ

- రైలు భద్రతపై లేని పట్టింపు
- బడ్జెట్‌లో కోతలు.. వేలల్లో పోస్టుల ఖాళీలు
- చార్జీల పెంపుదల.. రైళ్ల ఆలస్యం
- సమస్యలతో ప్రయాణికుడు సతమతం
- పచ్చజెండాలు ఊపుతూ ప్రచారానికే మోడీ ప్రాధాన్యం
- కేంద్రం తీరుపై సామాన్య ప్రజలు, నెటిజన్ల నుంచి విమర్శలు

న్యూఢిల్లీ : ఒడిశాలోని బాలాసోర్ రైలు ప్రమాదం కేంద్రంలోని మోడీ సర్కారు బాధ్యతా రాహిత్యాన్ని గుర్తు చేస్తున్నది. కేంద్రం వందే భారత్ రైలు సర్వీసులపై శ్రద్ధ పెట్టి.. రైలు భద్రతను గాలికొదిలేసిందని సామాన్య ప్రజలు, నెటిజన్లు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలు రాష్ట్రాలకు వెళ్తూ.. వందే భారత్ రైళ్లకు పచ్చ జెండాలు ఊపి ప్రారంభిస్తూ కేవలం ప్రచారానికే మోడీ ప్రాధాన్యతనిచ్చారని విమర్శిస్తున్నారు. అసాధారణ రేట్లుండే ఈ రైళ్లతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఒరిగేదేముంటుందని ప్రశ్నిస్తున్నారు.

ఒడిశా రైలు ప్రమాదం ఘటనతో భద్రత గురించి మాత్రమే కాకుండా రైళ్లలో రద్దీ, జాప్యం, బడ్జెట్‌లో కోతలు, రైల్వేలో ఉద్యోగ ఖాళీలు, చార్జీల పెంపు వంటి ఇతర సమస్యలూ తెర మీదకు వస్తున్నాయి. ఎకనామిక్స్ టైమ్స్ ప్రకారం.. ప్రతి వందే భారత్ కోసం రైల్వే రూ. 115 కోట్లు వెచ్చిస్తున్న సమయంలోనే ఒడిశా రైలు ప్రమాదం చోటు చేసుకున్నది. వందే భారత్ విషయంలో అంతా తానే అన్నట్టుగా మోడీ ...2లో

ఐటీ రంగంలో నెం 1

దేశానికి బువ్వ పెట్టే రాష్ట్రం తెలంగాణ

- కేంద్రం నుంచి నయాపైసా సాయం లేదు
- ఐటీశాఖ వార్షిక ప్రగతి నివేదిక విడుదల చేసిన మంత్రి కేటీఆర్




నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్ళలో తెలంగాణను ఐటీ రంగంలో అగ్రస్థానంలో నిలబెడతామన్నప్పుడు అనేకమంది ఆశ్చర్యంగా చూశారు. అయినా దేశంలోనే ఐటీ రంగంలో హైదరాబాద్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు మా ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేసింది. పదేండ్లుగా కేంద్ర ప్రభుత్వం సహాయనిరాకరణ చేసినా, ఈ రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించాం. ఈ రంగానికి ఎంతగానో ఊతం ఇస్తుందనుకున్న ఐటీఐఆర్ ప్రాజెక్టుని కేంద్రం రద్దు చేసినా సాధించి చూపించాం. రెండేండ్ల పాటు కరోనా సంక్షోభం, ఆ తర్వాత మారిన పరిస్థితులను సైతం తట్టుకుని ఈ అభివృద్ధిని సాధించాం. ఈ దేశానికి బువ్వపెట్టే రాష్ట్రంగా తెలంగాణ మారింది. దేశాన్ని సాకుతోంది'అని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని టీ-హబ్‌లో ఐటీశాఖ వార్షిక ప్రగతి నివేదికను సోమవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటీ రంగ వద్ధిలో అన్ని సూచీల్లో జాతీయ సగటును దాటి వేగంగా ముందుకు పోతున్నదని అన్నారు.31.44శాతం వార్షిక వద్ధితో రూ.2,41,275 కోట్ల ఐటీ ఎగుమతులు చేసిన ఘనత తెలంగాణకే దక్కుతుందన్నారు. 2014లో 3,23,396 ఉద్యోగాలుంటే నేడు 16.2శాతం వార్షికవృద్ధితో ఆయా ఉద్యోగాల సంఖ్య 9,05,715 మందికి పెరిగిందని తెలిపారు. భారతదేశంలో వస్తున్న ప్రతి రెండు ఉద్యోగాల్లో ఒక ఉద్యోగం తెలంగాణ నుంచి వస్తున్నదని వివరించారు. 2014లో తెలంగాణ ఐటీ ఎగుమతులు రూ.57,258 కోట్ల మాత్రమే ఉంటే ఇప్పుడు నాలుగు రేట్లకుపైగా పెరిగి రూ.2,41,275 కోట్లకు పెరిగిందన్నారు. ఫిస్కర్ తన ప్రధాన కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని తెలిపారు. కాల్‌వే గోల్ఫ్ కంపెనీ, క్వాల్కమ్ అమెరికా, గూగుల్ తన కంపెనీని అమెరికా అవతల అతిపెద్ద కార్యాలయాన్ని హైదరాబాద్‌లో 33 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిందని వివరించారు. స్విస్‌రే, జడ్ఎఫ్, ఎక్స్‌పీరియన్ సర్వీసెస్, ఎల్‌టీఐమైండ్ ట్రీ, బోస్చ్ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఇన్నోవేషన్ ...2లో

11న గ్రూప్-1 ప్రిలిమ్స్ యథాతథం

- వాయిదాకు హైకోర్టు నిరాకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమినరీ రాత పరీక్షను వాయిదా వేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఈనెల 11న ...5లో

అగ్రస్థానంలో ఐఐటీ మద్రాస్

- వరుసగా ఐదోసారి టాప్
- 14వ ర్యాంకులో ఐఐటీ హైదరాబాద్
- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ విడుదల



వివరాలు 5లో..

ఉద్యమం ఆగదు..

- హోంమంత్రి అమిత్ షా నుంచి హామీ రాలేదు: రెజ్లర్ సాక్షి మాలిక్



వివరాలు 5లో..

కేంద్రం రూ.30 వేల కోట్లు ఆపినా.. బోర్లకు మీటర్లు పెట్టం

- మంత్రి హరీశ్ రావు
- జర్నలిస్టులకు ఇండ్ల పట్టాల పంపిణీ



వివరాలు 5లో..



డీకే...ఓకే..!

తెలంగాణపై ఫోకస్

- బీజేపీ, బీఆర్ఎస్ ఎత్తులకు పై ఎత్తులు
- అన్ని తానై వ్యవహరించాలంటూ అధిష్టానం ఆదేశం
- అధికారమే లక్ష్యంగా పక్కా ప్రణాళిక
- ప్రియాంకగాంధీ నేతృత్వంలో సభలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో గత రెండు ఎన్నికల్లో స్వయంకృతాపరాధంతో ఓటమిపాలైన కాంగ్రెస్ పార్టీ ఈసారి పక్కా ప్రణాళికతో ముందుకు పోవాలని నిర్ణయించింది. అందుకు అన్ని రకాలుగా సిద్ధం కావాలని భావిస్తున్నది. ఈసారి తెలంగాణ రాష్ట్రాన్ని ఎట్టి పరిస్థితుల్లో చేజారకుండా జాగ్రత్త పడాలని నిర్ణయిస్తున్నది. ఇందులో భాగంగా బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలకు చెక్ పెట్టేందుకు ద్విముఖ వ్యూహాన్ని రచిస్తున్నది. కర్నాటక ఎన్నికల్లో పార్టీ అనుసరించిన కీలకమైన అంశాలను ఇక్కడ అమలు చేసేందుకు సిద్ధమవుతున్నది. అధికారమే లక్ష్యంగా పక్కా ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. క్షేత్రస్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూనే...బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కదలికలను గమనిస్తూ...వాటికి చెక్ పెట్టడం వంటి పనులు ఏకకాలంలో చేయాలని భావిస్తున్నది. ఈ క్రమంలో కర్నాటక ఎన్నికల్లో ట్రబుల్ షూటర్‌గా పేరొందిన ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను తెలంగాణ ఎన్నికల రణరంగంలోకి దించాలని అధిష్టానం భావిస్తున్నది. అందుకు ఆయనే సరైన నేతగా అధిష్టానం గుర్తించినట్టు సమాచారం. బీజేపీ, బీఆర్ఎస్‌లకు సమాన దూరంగా ఉంటూనే, వాటిని మట్టి కరిపించేందుకు ధీటైన నేతగా ఆయన్ను ఎంపిక చేసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ముందుగా బీజేపీ అంతర్గత కలహాలను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ఇప్పటికే ఆయన రంగంలోకి దిగినట్టు వినికిడి. ఇతర పార్టీల నుంచి ఎవరైనా సరే బీజేపీలో చేరకుండా అడ్డుకట్టవేదయంతోపాటు విధిలేని పరిస్థితుల్లో కమలం కండువా కప్పుకున్న వారిని సైతం హస్తం గూటికి ...2లో





విద్యుత్ వినియోగంలో తెలంగాణ టాప్

- సీఎం కేసీఆర్ దార్శనికతకు 24 గంటల నిరంతర విద్యుత్ నిదర్శనం: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల సందర్భంగా విద్యుత్ ప్రగతి సభలో మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-చివ్వెంల

విద్యుత్ వినియోగంలో తెలంగాణ.. భారతదేశంలోనే మొదటిస్థానంలోనే నిలిచిందని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి వెల్లడించారు. జాతీయ తలసరి వినియోగంతో పోల్చి చూసినట్టు రాష్ట్రంలో 69.40 శాతం విద్యుత్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నట్టు తెలిపారు. స్వరాష్ట్రంలో ...5లో

బీజేపీ కుట్రలను తిప్పి కొట్టండి

ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తే అడ్డుకుంటాం ..

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్
- పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు



నవ తెలంగాణ- సిద్దిపేట అర్బన్/విలేకరులు

బీజేపీ అధికారంలోకి వచ్చిన రెండు దఫాల్లో దశల వారీగా ఉపాధి హామీ చట్టాన్ని నేరుగార్చే ప్రయత్నం చేస్తోందని, బీజేపీ కుట్రలను తిప్పి కొట్టాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని పరిరక్షించుకోవాలని డిమాండ్ చేస్తూ వ్యకాస, భారతీయ కిసాన్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో కలెక్టరేట్ల ఎదుట సోమవారం ధర్నాలు ...5లో

21 తర్వాత సమ్మెలోకి వెళ్తాం

- గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి : జీపీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డిప్యూటీ కమిషనర్ రామారావుకి సమ్మె నోటీసు

వివరాలు 2లో..

21 తర్వాత సమ్మెలోకి వెళ్తాం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మల్టీపర్పస్ విధానం రద్దు, కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్, జీవో నెంబర్ 60 అమలు, తదితర డిమాండ్లను నెరవేర్చాలనీ, లేదంటే ఈ నెల 21 తర్వాత ఎప్పుడైనా సమ్మెలోకి వెళ్తామని గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ రాష్ట్ర సర్కారుకు అల్టిమేటం జారీ చేసింది. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో డిప్యూటీ కమిషనర్ రామారావుకు జేఏసీ ఆధ్వర్యంలో 17 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మెన్ ఎస్.యజ్ఞనారాయణ, కోశాధికారి సీహెచ్ సదానందం, కన్వీనర్లు చాగంటి వెంకటయ్య, పి.అరుణ్‌కుమార్, పి.శివ బాబు, జయచంద్ర, కోకన్వీనర్లు వెంకటరాజ్యం, ఆర్.మధు సూదన్‌రెడ్డి, పాలడుగు సుధాకర్, ఆర్కే.నాయుడు, జేఏసీ సభ్యులు సామల శ్రీకాంత్, వెంకట్రాములు, డి.యాదయ్య, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలనీ, రాష్ట్ర ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా వేతనాలివ్వాలని కోరారు. పీర్సీలో కనీస వేతనంగా నిర్ణయించిన రూ.19 వేలను వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారోబార్, బిల్‌కలెక్టర్లకు స్పెషల్ స్టేషస్ కల్పించాలనీ, వారిని సహాయ కార్యదర్శులుగా నియమించాలనీ, అర్హులందరికీ ప్రమోషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎస్కే.డే ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలనీ, అవసరమున్న చోట కొత్త సిబ్బందిని నియమించాలని కోరారు. పంచాయతీ కార్మికులు, ఉద్యోగులకు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాదబీమా, యూనిఫారాలు, అలవెన్స్‌లు, తదితర సౌకర్యాలను వర్తింపజేయాలని విన్నవించారు. ప్రమాదాల్లో మరణించిన కుటుంబాలను ఆదుకోవాలనీ, దహనసంస్కారాలకు ప్రత్యేకంగా డబ్బులు ఇవ్వాలని కోరారు.

డీకే...ఓకే..!

(మొదటిపేజీ తరువాయి)

రప్పించేందుకు ఆయన ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్ ప్రధాన శత్రువుగా ఎంచుకుంది. ఆ పార్టీ ఎత్తుగడలకు పైఎత్తులు వేయడం ద్వారా కారుకు బ్రేకులు వేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ఎన్నికలకు డీకేను సమన్వయకర్తగా నియమించనున్నట్టు ఆ పార్టీ నేతలు తెలిపారు. ఎన్నికల్లో వ్యూహాత్మకంగా ఉండమేగాక అన్ని తానై వ్యవహరించాలంటూ ఆయనకు ఇప్పటికే ఏఐసీసీ ఆదేశించినట్టు గాంధీభవన్ వర్గాలు అంటున్నాయి. అందులో భాగంగానే డీకే వైఎస్‌ఆర్ టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిలతో చర్చలు జరిపారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్టు వార్తలొస్తున్నాయి. ఈ పరిణామాల వెనుక డీకే చక్రం తిప్పినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ కాంగ్రెస్ తీసుకునే ప్రతీ నిర్ణయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లాలని అధిష్టానం ఆదేశించినట్టు తెలిసింది. డీకేను రంగంలోకి దించడం వెనుక కర్నాటక ఎన్నికల ఫలితాలు ఒక కారణమైతే, సామాజిక తరగతులవారీగా ఓటింగ్‌ను కాంగ్రెస్ వైపు తిప్పడంతో ఆయన అక్కడ కీలక పాత్ర పోషించడం మరో కారణం. తెలంగాణ కాంగ్రెస్‌లో బలమైన గ్రూపులు, అంతర్గత కుమ్ములాటలు, తగాదాలు ఎక్కువే. వాటన్నింటిని ఓ దారికి తీసుకొచ్చేందుకు డీకేను ప్రయోగించాలని కాంగ్రెస్ భావిస్తున్నది. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా అభ్యర్థుల బలబలాలు బేరీజు వేయడం, గెలిచే అవకాశాలున్న నేతలకు టికెట్లు ఇవ్వడంతోపాటు అన్ని రకాల సహయ, సహకారాలు అందించేందుకు ఆయనకు పూర్తి అధికారాలు కట్టబెట్టేలా ఏఐసీసీ కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. మరోవైపు తెలంగాణ రాష్ట్రంపై రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ సైతం దృష్టి సారించారు. అమెరికా న్యూజెర్సీలో నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ గాంధీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వస్తామంటూ ధీమా వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లో యూత్ డిక్లరేషన్ విడుదల చేసిన ప్రియాంకగాంధీ...జూన్ చివరి వారంలో మరోసారి ఖమ్మం సభకు రానున్నారు. తద్వారా బీఆర్‌ఎస్ హామీలకు దీటుగా కాంగ్రెస్ హామీలు ఇచ్చేందుకు కరసత్తు చేస్తున్నది. ఇప్పటికే యూత్ డిక్లరేషన్ కొంతమేరకు ప్రభావాన్ని చూపిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వరంగల్ సభలో రైతు డిక్లరేషన్ విడుదల చేసింది. ఆ తర్వాత మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ డిక్లరేషన్లు విడుదల చేయనుంది. రానున్న ఎన్నికల్లో వాటినే ఎన్నికల హామీలుగా ప్రచారం చేయాలని భావిస్తున్నది.

ఐటీ రంగంలో నెం.1

(మొదటిపేజీ తరువాయి)

రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, మైక్రోసాఫ్ట్ మూడు కొత్త డేటా సెంటర్లను సైతం ఏర్పాటు చేయనుందన్నారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ మూడు డేటా సెంటర్లు, సైబర్ ఆర్క్ కొత్త రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్, డాజ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్, వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ సంస్థ. జ్యాప్ కామ్ గ్రూప్, టెక్నిక్‌ఎఫ్‌ఎంసీ గ్లోబల్ సాఫ్ట్‌వేర్ డెలివరి సెంటర్, అల్లియాంట్ గ్రూప్ విస్తరణ, వీఎక్స్ఐ గ్లోబల్ సొల్యూషన్స్, మన్‌డీ హెూల్డింగ్స్ వంటి కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయని తెలిపారు. ద్వితీయ శ్రేణి పట్టణాల్లోనూ ఐటీ కంపెనీలు తమ కార్యకలాపాలను ప్రారంభించనున్నాయని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో రూ.38వేల కోట్ల పెట్టుబడులను తెలంగాణ ఆకర్షించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్‌రంజన్, సీఆర్‌ఓ అమరనాథ్‌రెడ్డి, నాస్కామ్ డైరెక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్, సెజ్ ప్రతినిధి కె.శ్రీనివాస్, ఎస్‌టీపీఐ ప్రతినిధి భరత్‌కుమార్, ఐటీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక ప్రభుత్వాలకు పార్టీలే పునాదులు

(మొదటిపేజీ తరువాయి)

స్థలమంతా కలియ తిరిగారు. భవన నిర్మాణ సమయంలో తీసుకోవాల్సిన చర్యల గురించి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి, ప్రభుత్వ నిర్మాణ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజకు, అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. అంతకుముందు వేద పండితులు భూ వరాహ హెూమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్, రాజ్యసభ సభ్యుడు కె.కేశవరావు, నామా నాగేశ్వర్ రావు, ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, బిబి పాటిల్, రంజిత్ రెడ్డి, దామోదర్ రావు, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, మధుసూదనాచారి, కవిత, శేరి సుభాష్ రెడ్డి, శంభీపూర్ రాజు, వెంకట్రామిరెడ్డి, మహేందర్ రెడ్డి, గోరెటి వెంకన్న, ఎగ్గె మల్లేశం,ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, దానం నాగేందర్, కాలె యాదయ్య, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, రవీందర్ సింగ్, రాజీవ్ సాగర్, సతీష్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుద్దాల సుధాకర్ తేజ, కార్తీక్‌రెడ్డి, సాయిచంద్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, అనిల్ కూర్మాచలం, సోమ భరత్, జడ్పీ చైర్మన్ తీగల అనితారెడ్డి, గ్యాదరి బాలమల్లు, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, రావుల శ్రవణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందే లేకుండా భద్రత ఎలా?

(మొదటిపేజీ తరువాయి)

సమర్థవంతమైన పనితీరుకు సవాల్‌గా నిలుస్తున్నది. ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది.

ప్రమాదం జరిగిన సౌత్ ఈస్టర్న్‌లో 17,811 ఖాళీలు

శుక్రవారం ఘోర రైలు ప్రమాదం జరిగిన ఒడిషాలోని బాలాసోర్ జిల్లా బహనగ బజార్ సౌత్ ఈస్టర్న్ రైల్వే పరిధిలోకి వస్తుంది. మంత్రి ఇచ్చిన సమాధానం ప్రకారం ఈ సౌత్ ఈస్టర్న్‌లో 17,811 నాన్ గెజిటెడ్ పోస్టులు, 150 గెజిటెడ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉద్యోగాల ఖాళీల విషయంలో ఉత్తర రైల్వే జోన్‌లో అత్యధికం గా 39,226 ఖాళీలు ఉన్నాయి. పశ్చిమ రైల్వే జోన్‌లో 30,785 ఖాళీలు ఉన్నాయి. తూర్పు రైల్వే జోన్‌లో 30,735, సెంట్రల్ రైల్వే జోన్‌లో 28,876 ఖాళీలు ఉన్నాయి. నైరుతి రైల్వే జోన్‌లో 6,638 ఖాళీలు ఉన్నాయి. భారతీయ రైల్వేలో మొత్తంగా ఏ, బీ, సీ గ్రూపుల్లో 3,15,780 ఉద్యోగా లు ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లి ఖార్జున ఖర్గే వేసిన వరస ప్రశ్నలకు స్వయంగా మంత్రి ఇచ్చిన సమాధానాలివి. అలాగే, 2021- 22లో గ్రూప్ ఏ, సీలలో కేవలం 4,625 ఉద్యోగా లను భర్తీ చేసినట్టు మంత్రి చెప్పారు. ఇదే సమయం లో 44,847 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చేశారు. ఈ ఏడాదిలో సుమారు 1,35,000 ఉద్యోగాలు భర్తీ చేస్తామని రైల్వే శాఖ హమీ ఇచ్చింది. 2020 నుంచి 2022 మధ్యకాలంలో సుమారు 3.5 కోట్ల మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్నట్టు మంత్రి తెలిపారు. ఒక్క సెంట్రల్ రైల్వే జోన్‌లోనే నాన్ గెజిటెడ్ గ్రూప్ సీ పోస్టులు 28,650 ఖాళీగా ఉన్నాయి. ఇందులో భద్రతా విభాగం పోస్టులే 14,203 ఉన్నాయి. ఖాళీలను భర్తీ చేయకపోవడంతో మొత్తంగా భారతీయ రైల్వేల్లో ఉద్యోగుల సంఖ్య తగ్గుముఖం పడుతూ వస్తున్నది. ఇలా అయితే భద్రత ఎలా సాధ్యమని నిపుణులు, విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.

స్వరాష్ట్రంలో పరిశ్రమలకు స్వర్ణయుగం

పెట్టుబడులకు స్నేహపూర్వక హస్తం

- ప్రపంచానికి ఆదర్శంగా టీఎస్ఐపాస్... 15 రోజుల్లోనే అనుమతులు
- 23 వేల పరిశ్రమలు... రూ.2.64 కోట్ల పెట్టుబడులు
- 17.77 లక్షల మందికి ఉపాధి
- దశాబ్ది ఉత్సవాల్లో నేడు పారిశ్రామిక, ఐటీ రంగాలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వేలల్లో పరిశ్రమలు.. లక్షల కోట్ల పెట్టుబడులు.. లక్షల సంఖ్యలో ఉపాధి అవకాశాలు..సులభ వాణిజ్యంలో నెం.1.. ఇదీ తెలంగాణ పారిశ్రామికం.. ప్రపంచం దారిపట్టిన ఎర్రతివాచీ వనం. 'పరిశ్రమలు వర్ధిల్లాలి. ఉపాధి పెరగాలి. తెలంగాణ పచ్చబడాలి' అనే ధ్యేయంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు పెద్దపీటవేసింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ సంబంధిత వివరాలతో కూడిన ప్రకటన సోమవారం విడుదల చేశారు. ప్రపంచంలోనే నెంబర్‌వన్ పారిశ్రామిక విధానాన్ని అమలు చేస్తూ తెలంగాణను 23 వేల పరిశ్రమలకు అడ్డాగా మార్చింది. ఈ పరిశ్రమల ద్వారా 17 లక్షలకు పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వచ్చాయి. ముఖ్యంగా ఐటీ, ఔషధాలు, ఆహార శుద్ధి, విమానయానం తదితర రంగాల్లో తెలంగాణ దూసుకుపోతున్నది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో అనేక దేశీయ, విదేశి కంపెనీలు రాష్ట్రానికి క్యూ కడుతున్నాయి.

టీఎస్ఐపాస్‌తో....

రాష్ట్ర ప్రభుత్వం 2015లో టీఎస్ఐపాస్ చట్టాన్ని తీసుకురావటంతో ప్రపంచస్థాయి కంపెనీలు తెలంగాణ వైపు చూడటం మొదలుపెట్టాయి. పెట్టుబడులకు ఉన్న అడ్డంకులు తొలిగి, సులభతర అనుమతులు లభించటంతో పారిశ్రామిక రంగ ముఖ చిత్రం పూర్తిగా మారిపోయింది. పరిశ్రమలకు కావాల్సిన భూమిని సిద్ధం చేయటం, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించటం, స్నేహపూర్వక విధానాలు, మెరుగైన ప్రోత్సాహకాలతో తెలంగాణకు ఎదురులేకుండా పోయింది. ముంబై, చెన్నై, బెంగళూరు, నోయిడా వంటి నగరాలను కాదని రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తుతున్నాయి. 24 గంటలు విద్యుత్తు, మెరుగైన శాంతిభద్రతలు, స్థిరమైన, సమర్థవంతమైన పరిపాలన పరిశ్రమలకు వరంగా మారాయి. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు ఎన్నింటికో ఇప్పుడు తెలంగాణ ఆకర్షణీయ గమ్యస్థానమైందని కమిషనర్ ఆ ప్రకటనలో తెలిపారు.

ఇండస్ట్రియల్ పార్కులు

రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో ప్రఖ్యాత ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద సమీకృత ఔషధ క్లస్టర్‌గా దీన్ని 14,029 ఎకరాల్లో అభివద్ధి చేయనున్నారు. రూ.64వేల కోట్ల పెట్టబడులు వస్తాయని, 4.20లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నది. జహీరాబాద్‌లో మల్టీ ప్రొడక్ట్ తయారీ జోన్‌ను ప్రతిపాదించారు. 12,635 ఎకరాల్లో నిమ్జ్ పథకం కింద మొదటి దశలో 3,909 ఎకరాలను కేటాయించారు. దీని ద్వారా 2.77 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా. హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా దీన్ని అభివద్ధి చేయాలని నిర్ణయించారు. మహేశ్వరంలో రెండు ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లను అభివద్ధి చేశారు. ఇందులో రావిర్యాల క్లస్టర్ 603 ఎకరాల్లో, మహేశ్వరం క్లస్టర్ 310 ఎకరాల్లో అభివద్ధి చేస్తున్నారు. ఇబ్రహీంపట్నంలోని ఖాల్సా గ్రామంలో 123 ఎకరాల్లో ఏర్పాటుకు ఫైబర్ గ్లాస్ కాంపోజిట్ క్లస్టర్‌ను ప్రతిపాదించారు.సంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో చందన్‌వల్లిలో ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివద్ధి చేశారు. ఇది మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రియల్ పార్క్. 20వేల ఎకరాల్లో ప్రతిపాదించారు అత్యుత్తమ కార్పెట్ టైల్స్ తయారీ సంస్థ వెల్ స్పన్ ఫ్లోరింగ్, గ్రీన్ కార్పెట్స్, ఇప్పటికే ఇక్కడ ఉత్పత్తులు ప్రారంభించాయి. దండుమల్కాపూర్‌లో తెలంగాణ ఇండస్ట్రియల్ ఫెడరేషన్ (టీఐఎఫ్) భాగస్వామ్యంతో ఎంఎస్‌ఎంఈల అభివృద్ధి కోసం 523 ఎకరాల్లో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను అభివృద్ధి చేశారు. ఇందులో 621 కంపెనీలకు ఇప్పటికే భూములను కేటాయించారు. సుల్తాపూర్‌లో ఎఫ్‌టీసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్‌కు 50 ఎకరాలు కేటాయించారు. ఎంఎస్‌ఎంఈల గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటునకు 26 కంపెనీలకు భూముల కేటాయించారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు మండలం సుల్తాన్ పూర్ లో 250 ఎకరాల్లో మెడికల్ డివైజెస్ పార్క్‌ను అభివద్ధి చేశారు. 1,190 ఎకరాల్లో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేశారు.

ఐటీ రంగంలోనూ..

ఐటీ రంగంలోనూ తెలంగాణ రాష్ట్రం మేటిగా నిలిచింది. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి ఐటీ వార్షిక ఎగుమతుల విలువ రూ.57వేల కోట్ల నుంచి రూ.1.83 లక్షల కోట్లకు పెరిగింది. 220 శాతం వద్ధిరేటు నమోదయింది. ఐటీ ఉద్యోగాల నియామకాలలో కూడా 156 శాతం వద్ధి ఉండటం విశేషం. 2014 నాటికి తెలంగాణలో కేవలం 3.24 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉంటే, ఇప్పుడు వారి సంఖ్య 9.27లక్షల పెరిగింది. ఐటీ రంగాన్ని హైదరాబాద్ నగరానికే పరిమితం చేయకుండా రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి నగరాలకు కూడా విస్తరించారు. ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, సిద్ధిపేటలలో కూడా ఐటీ టవర్లను నిర్మించారు. ఇటీవల దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో తెలంగాణకు వేల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. అనేక అంతర్జాతీయ సదస్సులకు ఆహ్వానాలు అందుతున్నాయి.

గతంలో వచ్చిన దిగ్గజ సంస్థలతోపాటు ఇంగ్లాండు, అమెరికాల నుంచి కూడా అనేక ప్రఖ్యాతి గాంచిన సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముం దుకు వచ్చాయి. కొన్ని సంస్థలు అక్కడికక్కడే ఒప్పందాలు కూడా చేసుకున్నాయి. వినూత్న ఆవిష్కరణలతో ముందుకు వచ్చే యువ పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించేందుకు టీ-హబ్, వీ-హబ్, టీ-వర్క్స్, రీచ్ సంస్థలు దోహద పడుతున్నాయి. వినూత్న స్టార్టప్‌లకు సంబంధించిన ఆవిష్కరణలతో టీ-హబ్ దేశంలోనే రికార్డు సష్టించింది. అందుకే టీహబ్-2ను కూడా ప్రభుత్వం ప్రారంభించింది. 2022లో భారత ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ స్టార్టప్ అవార్డులల్లో టీ-హబ్ ఉత్తమ ఇంక్యుబేటర్‌గా నిలిచిందని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ వివరించారు.

బడ్జెట్ కేటాయించినా పైసా ఖర్చు చేయలే

న్యూఢిల్లీ : ఒడిశాలోని బాలాసోర్‌లో జరిగిన ఘోర ప్రమాదం తర్వాత రైల్వే భద్రత, రైలు ప్రమాదాల నివారణ వ్యవస్థ(కవచ్)పై నిరంతరం ప్రశ్నలు తలెత్తుతున్నాయి. గత కొన్నేండ్లుగా భద్రతా పనులపై రైల్వేల వ్యయం తగ్గుదల గురించి తీవ్ర చర్చకు దారి తీసింది. బాలాసోర్‌లో రైలు పట్టాలు తప్పిన ఘటన సౌత్ ఈస్ట్ జోనల్ రైల్వే(ఎస్ఈఆర్) కిందకు వస్తుంది. అయితే యాంటీ కొలిజన్ సిస్టమ్ (కవచ్) కోసం కేటాయించిన బడ్జెట్ నుంచి ఎస్ఈఆర్ ఒక్క పైసా కూడా ఖర్చు చేయకపోవటం చర్చనీయాంశంగా మారింది.



ఎస్ఈఆర్ కోసం మూలధన వ్యయం కింద రూ.468.90 కోట్లు ఆమోదించబడ్డాయి. ఇందులో లో ట్రాఫిక్ రైల్వే నెట్‌వర్క్ (1563 ఆర్‌కేఎం)పై స్వదేశీ కవచ్ (ఇది 2020-21లో పూర్తి చేయాల్సిన పని) కు సంబంధించిన పని ఉన్నది. కానీ ఇందుకోసం బడ్జెట్ నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవటం గమనార్హం. అదే జోన్‌లోని మరో సెక్టార్‌లో (2020-21లో జరగాల్సిన పని) తక్కువ ట్రాఫిక్ ఉన్న రైల్వే నెట్‌వర్క్‌లో దీర్ఘకాలిక అభివద్ధి వ్యవస్థ కోసం సుమారు రూ. 312 కోట్లు మంజూరు చేయబడ్డాయి. అయితే గతేడాది మార్చి వరకూ ఇందులో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకపోవటం గమనార్హం.

అలాగే సిగ్నలింగ్ టెలీ కమ్యూనికేషన్ కింద సౌత్ ఈస్టర్న్ రైల్వే కోసం రూ. 162.29 కోట్లు ఆమోదించబడింది. ఈ డబ్బును అత్యధికంగా ట్రాఫిక్ ఉన్న రైల్వే మార్గంలో ఆటో మేటిక్ బ్లాక్ సిగ్నలింగ్, సెంట్రలైజ్డ్ ట్రాఫిక్ కంట్రోల్, కవచ్ కోసం ఖర్చు చేయాల్సి ఉన్నది. కానీ ఇప్పటి వరకూ ఎలాంటి ఖర్చూ చేయకపోవటం గమనార్హం.

ఈ ప్రాంతంలో భద్రతా పనులకు సంబంధించి ఇంత వరకు టెండర్లు తీసుకోనందున బడ్జెట్‌ను ఖర్చు చేయలేదని రైల్వే మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. 2023-24కి సంబంధించిన ప్రభుత్వ బడ్జెట్ సమాచార విశ్లేషణ ప్రకారం.. ఇలాంటి నిష్క్రియ నిధుల స్థితితో కవచ్‌ను అమలు చేయటానికి చాలా సమయం పడుతుంది.

కవచ్ అమలుపై ప్రధానంగా దృష్టి సారించినట్టు చెప్తున్నది. ముఖ్యంగా అత్యంత రద్దీగా ఉండే రైల్వే మార్గాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని రైల్వే వర్గాలు తెలిపాయి. సౌత్ ఈస్టర్న్ రైల్వే జోన్ వంటి నెట్‌వర్క్‌లు రెండో, మూడో అధిక ప్రయాణీకుల రద్దీని కలిగి ఉన్న మార్గాలు.

రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ (ఆర్డీఎస్ఓ) భారతదేశంలో కవచ్ పరికరాలను అందించడానికి మేధా సర్వో డ్రైవ్స్, హెచ్‌బీఎల్, కెర్నెక్స్ అనే మూడు సంస్థలను ఆమోదించింది. దీనికి సంబంధించి మరో రెండు కంపెనీలు పనిచేస్తున్నాయని సమాచారం.

వందేభారత్ పైనే శ్రద్ధ

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరించారు. రైల్వే మంత్రికి కనీస ప్రాధాన్యతను ఇవ్వకపోవటం గమనార్హం.

పెరిగిన ప్రమాదాలు.. మరణాలు

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్‌బీ) సమాచారం ప్రకారం.. గత కొన్నేండ్లుగా రైల్వే ప్రమాదాలు పెరిగాయి. 2022-23లో ఈ ప్రమాదాలు 37 శాతం ఎగబాకాయి. రైలు ప్రమాద మృతుల సంఖ్య 2018లో 24,545, 2019లో 24,619గా ఉన్నది. కేంద్రంలో మోడీ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత చోటు చేసుకున్న రైలు ప్రమాదాలు సుమారు 2.6 లక్షల మరణాలకు దారి తీశాయి. కోవిడ్ సమయంలో మినహా గత ఐదేండ్లలోనూ రైలు ప్రమాదాలు పెరిగాయి. భారత్‌లోని రైలు ప్రమాదాల్లో చోటు చేసుకున్న మరణాలు ఏటికేడు పెరుగుతున్నాయి.

నిధుల కోతలు.. కాగ్ హెచ్చరికలు

రైల్వేలకు కేటాయించే నిధులలోనూ మోడీ సర్కారు కోత విధిస్తున్నది. దీంతో ఈ నిధుల కత్తిరింపు రైల్వే భద్రతను దెబ్బతీస్తున్నాయి. 2017 నుంచి 2021 మధ్య రైలు ప్రమాదాలలో గణనీయమైన భాగం ట్రాక్ లోపాల వంటి మెకానికల్ వైఫల్యాల కారణంగానే జరిగాయి. అయితే, గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2022-23 బడ్జెట్‌లో ట్రాక్ పునరుద్ధరణకు జరిపిన కేటాయింపులు రూ. 3,222.4 కోట్లు తగ్గటం గమనార్హం. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) కూడా రైలు పట్టాలు తప్పినవాటిపై గతేడాది ఆడిట్(కాగ్ రిపోర్టు-2022) లో కొన్ని కీలక విషయాలను వెల్లడించింది. 2017-18 నుంచి 2019-20 మధ్య కాలంలో కొన్ని రైల్వే జోన్‌లు కేటాయించిన నిధులలో కొంత భాగాన్ని తిరిగి ఇచ్చాయని కాగ్ హైలెట్ చేసింది. నిధుల కేటాయింపులో క్షీణత, కేటాయించిన నిధులను ఉపయోగించకపోవటం కారణంగా పునరుద్ధరణ పనులను సకాలంలో పూర్తి చేయటంపై ప్రభావం ఉంటుందని కాగ్ హెచ్చరించింది. 2017-18 నుంచి 2020-21 వరకు 1129 పట్టాలు తప్పిన ఘటనల్లో 26 శాతం ట్రాక్ పునరుద్ధరణలతో ముడిపడి ఉన్నాయని వివరించింది. రైల్వే మంత్రిత్వ శాఖ నివేదిక- 2019-20 ప్రకారం రైలు ప్రమాదాలలో 70 శాతం పట్టాలు తప్పినవే. దీంతో ట్రాక్ పునరుద్ధరణ నిధులలో ఈ కోత ప్రస్తుతం చర్చకు దారి తీస్తున్నది. కోచ్‌లు పట్టాలు తప్పటం కారణంగానే శుక్రవారం నాటి ప్రమాదం చోటు చేసుకున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

నియామకాల్లేవ్.. చార్జీల పెంపు.. రైళ్ల ఆలస్యం

నిధుల కోతతో పాటు నియామకాలు లేకపోవటం కూడా భద్రతను దెబ్బతీసింది. సెంట్రల్ జోన్‌లో ఖాళీగా ఉన్న 28,650 ఖాళీ స్థానాల్లో దాదాపు సగం భద్రతా కేటగిరికి చెందినవే. ఇటు చార్జీల పెంపు కూడా దారుణంగా ఉన్నది. ఇటీవల మరో 130 రైళ్లకు 'సూపర్ ఫాస్ట్' హోదా ఇవ్వటం వల్ల వాటి చార్జీలు పెరిగాయని ప్రయాణికులు ఫిర్యాదు చేశారు.

ఎక్కువ చార్జీలున్నప్పటికీ.. స్లీపర్ కోచ్‌లూ కిక్కిరిసిపోతున్నాయని సోషల్ మీడియా వేదికగా రైల్వే శాఖ మంత్రిని ట్యాగ్ చేస్తు పలువురు ప్రయాణికులు కంప్లైంట్‌లు చేశారు. ఒడిశాలో ప్రమాదానికి గురైన రైళ్లలో ఒకటైన కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గురించి కూడా ఇలాంటివి చాలా ఫిర్యాదులు ఉన్నాయి. ఇక రైలు ఆలస్యం ఇంకో సమస్య. మోడీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైల్వే స్వరూపం మారిపోయిందని రైల్వే మంత్రులు (ఎన్డీయే-1, ఎన్డీయే-2) పలు సందర్భాల్లో చెప్పుకుంటూ వచ్చారు. అయితే, రైళ్లు మాత్రం చాలా ఆలస్యంగా నడుస్తున్నాయంటూ ప్రయాణీకుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావటం గమనార్హం.

పర్యావరణాన్ని విస్మరిస్తే..ఈ దశాబ్దమే చివరిది..

- ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం : ఐప్సో రౌండ్ టేబుల్ సమావేశంలో శాస్త్రవేత్త బాబూరావు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణాన్ని విస్మరిస్తే ఈ దశాబ్దమే మనకు చివరిదవుతుందని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త కె బాబూరావు హెచ్చరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిలభారత శాంతి సంఘీభావ సంఘం(ఐప్సో) హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం-2023'పై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. సంఘం నగర అధ్యక్షులు జి నాగేశ్వర్‌రావు అధ్యక్షత వహించారు. అంతకు ముందు సుందరయ్య పార్కులో ఐప్సో జాతీయ కౌన్సిల్ అడ్వైజరీ కమిటీ నాయకులు యాదవరెడ్డి, పలువురు నాయకులు మొక్కలు నాటారు. అనంతరం రౌండ్‌టేబుల్‌లో బాబూరావు మాట్లాడుతూ పర్యావరణం లేకుండా మనం లేమని చెప్పారు. దాన్ని విస్మరిస్తే వినాశనమేనని ప్రపంచంలో పలు దేశాల అనుభవాలు చెబుతున్నాయని వివరించారు. పెట్టుబడిదారీ విధానంలో వచ్చిన మార్పుల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే..మన ఉనికే భోగోళంతో ముడిపడి ఉందని తెలిపారు.' ఈ దశాబ్దమే చివరి దశాబ్దం కాకూడదు. మనం మారాలి. లేదంటే మానవ జీవితమే కష్టం' అని ప్రముఖ శాస్త్ర వేత్తలు హెచ్చరిస్తున్నారని వివరించారు. అయితే..శాస్త్ర వేత్తల మాటలు పరిగణలోకి తీసుకునే వారే లేక పోవటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అన్యాయమని చెప్పిన శాస్త్రవేత్తలను సైతం అరెస్టులు చేస్తున్నారనీ, వారిని జైళ్లలో కూడా కుక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ మనుగడకు సంబంధించిన అత్యంత కీలకమైన ఈ అంశంపై రాజకీయ పార్టీలు ఎందుకు నోరు విప్పటం లేదని ప్రశ్నించారు. చమురు, బొగ్గుని ఎంత ఎక్కువగా వాడితే.. జీవ రాశికి అంత ఎక్కువ ప్రమాదం పొంచి ఉన్నట్టేనని చెప్పారు. యూరప్ దేశాల్లో దీనిపై ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకరమని తెలిపారు. పర్యావరణమనేది సామాజిక, రాజకీయ, ఆర్థిక కోణాల్లోనూ ఉంటుందని వివరించారు. మూసీ నదిని నాశనం చేయటం కోసమే 111జీవో రద్దు చేశారని చెప్పారు. ప్రముఖ పర్యావరణ వేత్త సరస్వతి కవుల మాట్లాడుతూ మార్కెట్ ఆర్థిక వ్యవస్థ జీవన గతిని దారిమళ్లిస్తున్నదని గుర్తుచేశారు. దాని మాయలో అందరరమూ పడ్డామన్నారు. సోషల్ ఆలోచన విధానమే నాశనమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యకారకమైన పరిశ్రమలు మనకు అవసరమా? అని ప్రశ్నించారు. సంస్కారం కోసం చదువు కావాలి కానీ..డిగ్రీల కోసమైతే.. సమాజానికి ఏ మాత్రమూ ఉపయోగం ఉండబోదన్నారు. వ్యసాయ ఆధారిత అభివృద్దే సమాజానికి అవసర మని చెప్పారు. యాదవరెడ్డి మాట్లాడుతూ హరిత హారం పేర చెట్లు నాటుతున్నారు కానీ..వాటి సం రక్షణను మాత్రం మరిచిపోతున్నారని గుర్తుచేశారు. ఈ విషయంలో పంచాయతీలపై బాధ్యత పెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుంటున్నదని విమర్శిం చారు. పర్యావరణ పరిరక్షణ అనేది పాలకుల ముందు, ప్రజల ముందు తక్షణమే పరిష్కరించవలసిన సమస్యగా ఉందని చెప్పారు. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా మానవజాతి మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదముందని హెచ్చరించారు. ఐప్సో నగర అధ్యక్షులు జి నాగేశ్వరరావు పర్యావరణ పరిరక్షణపై రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. కార్యక్రమంలో ఐప్సో నాయకులు జి రఘుపాల్, తిప్పర్తి యాదయ్య, కేవీఎల్, మోతుకూరి నరహరి, జేకే శ్రీనివాస్, ఎ రామరాజ్ మాట్లాడారు.

ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలి

- సర్వీసు పర్సన్లను నియమించాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పిల్లలుంటేనే బడి ఉంటుంది. ప్రభుత్వ బడులను కాపాడుకుందాం'అని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విజ్ఞప్తి చేశారు. 2023-24 విద్యా సంవత్సరం సందర్భంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల మూడో తేదీ నుంచి బడిబాట ప్రారంభమైందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పేందుకు ఇతోధిక కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ, మండల, జిల్లా పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలల్లో నమోదు తగ్గుతున్నదని పేర్కొన్నారు. 21వ శతాబ్ద ప్రారంభం నుంచి తల్లిదండ్రుల్లో వారి పిల్లలను ఇంగ్లీష్ మాధ్యమంలో చదివించాలనే కోరిక పెరుగుతూ వస్తున్నదని తెలిపారు. దీంతో తెలుగు మాధ్యమంలో విద్యార్థుల నమోదు తగ్గుతున్నదని వివరించారు. గత విద్యాసంవత్సరం లో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రారంభించిందని గుర్తు చేశారు. అయినా విద్యార్థులు ఇబ్బడిముబ్బడిగా చేరుతారని భావించలేమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలు పరిష్కారం కావాల్సి ఉందని తెలిపారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని కోరారు. ప్రతి బడికి పాఠశాల విద్యాశాఖ నుంచే సర్వీసు పర్సన్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేస్తే బడుల్లో విద్యార్థుల సంఖ్య కొంత మేరకు పెంచొచ్చని పేర్కొ న్నారు. గత రెండేండ్లలో విద్యార్థుల సంఖ్య పెరిగిన పాఠశాలలున్నాయని వివరించారు. పాఠశాల ఉన్న ఆవాసం, గ్రామంలో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రయివేటు బడులకు వెళ్తే ఉపాధ్యాయుల ప్రత్యేక కృషితో ప్రభుత్వ స్కూళ్లలో చేరతారని సూచించారు. ఉపాధ్యాయ బృందం తల్లిదండ్రులకు భరోసానిచ్చే కృషి చేయాలని కోరారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాలల మనుగడ కొనసాగుతుందని తెలిపారు.

1,290 ప్రాథమిక పాఠశాలల్లో సున్నా ప్రవేశాలు

18,235 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 1,290 బడుల్లో ఒక్క విద్యార్థి లేరని నర్సిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 1,686 బడుల్లోనే తరగతికో టీచర్ ఉన్నారని వివరించారు. కానీ ప్రయివేటు పాఠశాలల్లో తరగతికొక గది, టీచర్ తప్పనిసరిగా ఉంటారని తెలిపారు. విద్యార్థుల సంఖ్య 41 నుంచి 60 వరకు ముగ్గురు, 61 నుంచి 90 వరకు నలుగురు, 90కిపైగా ఉంటే ఐదుగురు ఉపాధ్యాయులుండేలా ఏర్పాటు చేయాలని సూచిం చారు. ఇందుకోసం ఆరు వేల మంది ఎస్జీటీలు అవ సరమౌతారని పేర్కొన్నారు. 2015లో రేషనలైజేషన్ లో ఏడు వేల ఎస్జీటీ పోస్టులు డీఈవో పూల్‌లో ఉంచారని, అవి సరిపోతారని వివరించారు. గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 1,467 ప్రాథమిక పాఠశాల లున్నాయని తెలిపారు. పదిలోపు, 20లోపు విద్యార్థు లున్న పాఠశాలలే ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నా రు. 60 మంది విద్యార్థులుండేలా పాఠశాలలను ఐక్యం చేసి ఐదుగురు టీచర్లుండేలా ఏర్పాటు చేయా లని సూచించారు. 3,152 ప్రాథమికోన్నత పాఠశాల ల్లో 2,236 బడుల్లో వందలోపు విద్యార్థులున్నారని తెలిపారు. మూడు కిలోమీటర్ల పరిధిలో ఉన్నత పాఠశాల లేని చోట ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. మిగిలిన వాటిని ప్రాథమిక పాఠశాలలుగా డీగ్రేడ్ చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. 4,691 ఉన్నత పాఠశా లల్లో 125 మందిలోపు విద్యార్థులున్నవి 2,150 ఉన్నాయని, వాటిపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారిం చాలని కోరారు. 200లోపు విద్యార్థులున్న 122 ఆశ్రమ పాఠశాలలపై గిరిజన సంక్షేమ శాఖ, ఐటీడీఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె

రేషన్ డీలర్ల జేఏసీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ సమస్యలు పరిష్కరించే వరకు నిరవధికంగా సమ్మె చేస్తామని హైదరాబాద్ రేషన్ డీలర్స్ అసోసియేషన్, రాష్ట్ర డీలర్ల జేఏసీ నాయకులు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఆర్‌ఓ కార్యాలయం ముందు ప్రదర్శన నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ రవీందర్, కో కన్వీనర్ మల్లికార్జున గౌడ్ తదితరులు మాట్లాడుతూ, గౌరవ వేతనం, కమిషన్ పెంపుపై స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన మంత్రి గంగుల కమలాకర్ మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు.

పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ పాడిరైతుల సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్

- ఇన్‌సెంటివ్స్ చెల్లించాలని విజయ డైరీ కార్యాలయం ఎదుట పాడి రైతుల ధర్నా



నవతెలంగాణ-ఓయూ

పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలని, వారికి ఇన్‌సెంటివ్స్ చెల్లించాలని తెలంగాణ పాడిరైతుల సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్ డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్ లాలాపేట్‌లోని విజయ డైరీ కార్యాలయం ఎదుట తెలంగాణ పాల రైతుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాల ఉత్పత్తిదారులు కొందరికి 2021 జనవరి నుంచి ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వకపోవడం వల్ల గ్రామాల్లో రైతులు ప్రయివేటు డెయిరీలను ఆశ్రయిస్తున్నారని తెలిపారు. దాంతో విజయ డెయిరీకి వేలాది లీటర్ల పాలు ఇటీవల తగ్గాయని చెప్పారు. పాడి రైతులకు రూ.4 ప్రోత్సాహంను రూ.7కు పెంచి.. పాల బిల్లుతో చెల్లించాలన్నారు. కర్నాటక, కేరళ తరహాలో సాంకేతిక సేవలు అందించాలని, పాడి పశువుల బీమా ఉచితంగా చేపట్టాలని, పాడి రైతుల ప్రమాదబీమా రూ.10 లక్షలు కల్పించాలని కోరారు. రైతులకు బ్యాంకు రుణ సదుపాయం కల్పించాలని, పాడి రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర నాయకులు మూడ్ .శోభన్ మాట్లాడుతూ.. డెయిరీ నుంచి వచ్చే లాభాలను ప్రభుత్వం రైతులకు పంచాలని, డెయిరీకి పర్మినెంట్ ఎండీని నియమించాలని, ఒకే ప్రదేశంలో ఎక్కువ సంవత్సరాల నుంచి పని చేస్తున్న సిబ్బందిని ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరారు. ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రం ఇవ్వాలని కోరగా కొద్ది మందిని మాత్రమే అనుమతించారు. దాంతో రైతులు ఎర్రటి ఎండలో నేలపై కూర్చొని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం జీఎం మల్లయ్య ఆందోళన చేస్తున్న రైతుల వద్దకు వచ్చి వినతిపత్రాన్ని స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఇన్‌సెంటివ్ ప్రాసెస్‌లో ఉందని చెప్పారు. కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన పాడి రైతులు పాల్గొన్నారు.

సమాజ మార్పే లక్ష్యంగా మోరె జీవితం

మహద్ పోరాటంలో ఆయన పాత్ర కీలకం

- అంబేద్కర్, మోరె జీవితాలకు దగ్గరి పోలిక
- ఓ దళిత కమ్యూనిస్టు జ్ఞాపకాలు పుస్తకావిష్కరణలో మల్లేపల్లి లక్ష్మయ్య
- పుస్తకాన్ని ఆవిష్కరించిన రచయిత్రి బి.విజయ భారతి
- సామాజిక పోరాటాల ఆవశ్యకతను మోరె నొక్కిచెప్పారు : జి.రాములు



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

సమాజ మార్పే లక్ష్యంగా జీవితాంతం పనిచేసిన రామచంద్ర బాబాజీ మోరె ఆదర్శ కమ్యూనిస్టు అని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మెన్ మల్లేపల్లి లక్ష్మయ్య అన్నారు. అనేక అంశాల్లో అంబేద్కర్, మోరెకు అభిప్రాయభేదాలున్నప్పటికీ సమాజ మార్పు కోసం వారిద్దరూ కలిసి పనిచేశారనీ, అనేక అంశాల్లో వారిద్దరి మధ్య పోలికలున్నాయని వివరించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఓ దళిత కమ్యూనిస్టు జ్ఞాపకాలు' పుస్తకాన్ని ప్రముఖ రచయిత్రి బి.విజయభారతి ఆవిష్కరించారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌజ్ ఎడిటర్ కె.ఆనందాచారి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ జనరల్ మేనేజర్ ఆర్.వాసు అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. పుస్తకావిష్కరణ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ..దళితులు అనివార్యంగా కమ్యూనిస్టులుగా మారాల్సిందేననీ, వారి జీవన విధానం కమ్యూనిస్టులకు దగ్గరగా ఉంటుందని చెప్పారు. సమస్య ఎత్తిచూపటం, బలమైన ఉద్యమాలు చేయడమే కాదు..పరిష్కారం చూపే ఆలోచనావిధానం కూడా కలిగి ఉంటే బాగుంటుందన్నారు. మోరెలో ఆ లక్షణం ఉందన్నారు. మహద్‌లో రామచంద్ర బాబాజీ మోరె దళితులకు తాగునీటిని అందించేందుకు ఓ టీ కొట్టు ఏర్పాటు చేశారనీ, మార్కెట్‌లో దళితులకు జరుగుతున్న మోసాలు, మోసపోయిన రైతులకు న్యాయం చేసేందుకు అందరూ కదిలేలా ఉత్తేజం నింపేందుకు ఆ టీకొట్టు ఒక అడ్డాగా మారిందని వివరించారు. కాలక్రమంలో అంబేద్కర్, మోరె నేతృత్వంలో మహద్ సామాజిక పోరాటానికి దారితీసిందని చెప్పారు. మోరె జీవిత చరిత్రను మహద్ చెరువు పోరాటం, బహిష్కృత భారత్ పత్రికలో పనిచేయటం, కమ్యూనిస్టు నేతగా ఎదగటం అనే మూడు దశలుగా చూడాలన్నారు. ఒక లక్ష్యం కోసం ఓ పార్టీలో పనిచేస్తూనే కలిసి వచ్చే శక్తులను కలుపుకుపోయే తత్వం అంబేద్కర్, మోరెలో కనిపించిందన్నారు. దోపిడీ, తారతమ్యాలు లేని సమాజాన్ని చూడాలనే లక్ష్యంతో అంబేద్కర్, మోరె పనిచేశారని తెలిపారు. 1920 దశకంలో కమ్యూనిస్టుల వల్లనే సమాజ విముక్తి సాధ్యమని యువత పెద్ద ఎత్తున ఆ పార్టీలో చేరారని చెప్పారు.

విజయ భారతి మాట్లాడుతూ..మోరె జీవిత చరిత్ర ప్రతిఒక్కరూ చదవాల్సిన పుస్తకమని నొక్కి చెప్పారు. ఆ పుస్తకం రీసెర్చ్ సోర్స్ మెటీరియల్ అన్నారు. కులవివక్షకు, దోపిడీ లేని సమాజం కోసం మోరె జీవితాంతం పనిచేశారని కొనియాడారు. టెక్నాలజీ పెరిగే కొద్దీ భావ సంపద కుచించుకుపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. స్వయం శక్తి తగ్గుతుందన్నారు. అన్నీ దేవుడే చూసుకుంటాడులే భావన పెరిగిపోవడం ప్రమాదకరమన్నారు.

ఎస్వీకే ట్రస్టు కార్యదర్శి, పుస్తక అనువాదకులు ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ..బహిష్కృత భారత్‌లో సబ్ ఎడిటర్‌గా మోరె పనిచేశారని తెలిపారు. ఇప్టాలో మోరె చాలా కీలక పాత్ర పోషించారనీ, సినీరంగానికి శైలేంద్ర, శ్రీరామచంద్ర, బాలరాజు తదితరులను అందించిన ఘనత మోరెకే దక్కుతుందన్నారు. ప్రజామద్దతుంటేనే వివక్ష పోతుందనీ, అది కమ్యూనిస్టులతో సాధ్యమనే భావనతోనే మోరె పార్టీలో చేరారని తెలిపారు. అంబేద్కర్, మోరెల మధ్య సత్సంబంధాలు ఉండేవని చెప్పారు. టీపీఎస్‌కే నాయకులు జి.రాములు మాట్లాడుతూ..లాల్–నీల్ ఐక్యతకు ప్రతీకగా ఈ పుస్తకం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంబేద్కర్, మోరె ఆనాడే కలిసి పనిచేశారనీ, లాల్–నీల్ ఐక్యతకు మహద్ పోరాటం గుర్తు అని చెప్పారు. దేశంలో కమ్యూనిస్టులు ఆర్థిక పోరాటాలకే పరిమితం కాకుండా సామాజిక పోరాటాలనూ చేయాలని మోరె నొక్కిచెప్పారనీ, సీపీఐ(ఎం) మహాసభలో ఆ అంశంపై ఆయన డాక్యుమెంటరీ సమర్పించారని గుర్తుచేశారు. దేశంలో ఎమర్జెన్సీ కాలంలో రాజకీయరంగంలోనే అణచివేతన కనిపిస్తే...నేడు బీజేపీ పాలనలో ఆర్థిక, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలపై ముప్పేట దాడి జరుగుతున్నదని ఆందోళన వెలిబుచ్చారు. యువత అప్రమత్తమై సమాజ మార్పు కోసం జరిగే పోరాటంలో పాలు పంచుకోవాలని కోరారు.

ఆశాలు.. సెకెండ్ ఏఎన్ఎంలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు

- అమలుపై సమగ్ర రిపోర్టు ఇవ్వాలి : మంత్రి హరీశ్ రావు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలోని ఆశా కార్యకర్తలకు, సెకండ్ ఏఎన్ఎంలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని వైద్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. దీనిపై సమగ్ర అధ్యయనం చేసి రిపోర్టు అందించాలని ఉన్నతాధికారులకు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి టెలి కాన్ఫరెన్స్ ద్వారా ఆశాలు, ఏఎన్ఎంలతో మంత్రి నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఆశాలకు దేశంలోనే అత్యధిక పారితోషకం ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ అని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత మూడు సార్లు వేతనాలు పెంచామనీ, ప్రస్తుతం రూ.9,750 ఇస్తున్నామని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 14న నిర్వహించనున్న వైద్యారోగ్య దినోత్సవంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ప్రసవాల్లో ప్రభుత్వాసుపత్రులు టాప్

ప్రసవాల్లో ప్రభుత్వాస్పత్రులు ముందు నిలవడమే కాకుండా దేశ చరిత్రలో 69 శాతం ప్రసవాలతో అవి రికార్డు సృష్టించాయని హరీశ్‌రావు తెలిపారు. ఎక్కువ ప్రసవాలు నమోదు చేసిన జిల్లాల సిబ్బందికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. ఇమ్యూనైజేషన్ తక్కువగా నమోదవుతున్న సూర్యాపేట జిల్లాలో క్షేత్రస్థాయి పరిశీలనకు సిబ్బందిని పంపి తగిన చర్యలు తీసుకోవాలని అక్కడి జేడీని ఆయన ఆదేశించారు. మాతృత్వ ఆరోగ్య సంరక్షణ పనితీరులో చివరి స్థానంలో ఉన్న వనపర్తి, మహబూబాబాద్, మహబూబ్ నగర్, వరంగల్, సూర్యాపేట జిల్లాల్లో పురోగతి కనిపించాలని ఆదేశించారు. కనిష్ఠ స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నట్టు గుర్తించిన 53 సబ్ సెంటర్ల పనితీరు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ కు సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'ఈ– ఔషధీ'. ద్వారానే మందులు పంపిణీ చేస్తూ, మూడు నెలల కనీస నిల్వలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. టెలి కాన్ఫరెన్స్‌లో వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ, కుటుంబ సంక్షేమం విభాగం కమిషనర్ శ్వేతా మహంతి, రాష్ట్ర వైద్యారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి

- రెజ్లర్లపై లైంగికవేధింపులకు నిరసనగా 7న మండల కేంద్రాల్లో నిరసనలు
- 13న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

భారత దేశానికి బంగారు పతకాలను తీసుకొచ్చి, దేశ ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పిన మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆలిండియా ఫెడరేషన్ అధ్యక్షులు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. రెజ్లర్లపై పోరాటంపై నిర్బంధాన్ని ఖండిస్తూ ఈ నెల ఏడో తేదీన మండల కేంద్రాల్లో నిరసనలకు, 13న జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలకు పిలుపునిచ్చింది. ఈమేరకు సోమవారం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రెజ్లర్లు 40 రోజులకుపైగా ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద పోరాటం చేసినా కేంద్రం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు.

సంపాదకీయం


ముందుచూపు

విద్య అనేది సమాజంలో అత్యంత ముఖ్యమైనభాగం. అలాంటి విద్య విషయంలో పాలకులకు సరైన కార్యాచరణ ఉందా? అంటే ఇప్పటికీ ఒకడుగు ముందుకు నాలుగడులు వెనక్కి అన్నట్టు సాగుతోంది. ఈ విషయం ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే విద్యాశాఖలో నెలకొన్న సమస్యలు యేటేటా

> ప్రభుత్వ ప్రాథమిక స్కూళల్లో ఒక్కరు లేదా ఇద్దరే ఉపాధ్యాయులున్న ఉదంతాలు అనేకం. ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఏడు తరగతులకు కలిపి ఐదుగురే ఉంటున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్ది ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థులను ఆకర్షించడానికి వెంటనే టీచర్ల రిక్రూట్‌మెంటు చేయాల్సి ఉంది. స్కూల్స్‌ను శుభ్రం చేసేందుకు రెగ్యులర్ పారిశుధ్య కార్మికులను నియమించడం వల్ల అన్నిరకాలుగా ఉపయుక్తంగా ఉంటుందన్నది విద్యావేత్తల అభిప్రాయం. అదేవిధంగా బడి పిల్లలకు మధ్యాహ్నభోజనం అందించడాన్ని వ్యయంగా చూడొద్దనేది సుప్రీంకోర్టు సూచన.

పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. రానున్న విద్యాసంవత్సరం కూడా పరిష్కారం చేయాల్సినవి చాలా ఉన్నాయి. మూసుకున్న పాఠశాలలు మరికొద్దిరోజుల్లో తెరచుకోనున్నాయి. ఈ వేసవి సెలవులలో ప్రభుత్వపాఠశాలల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎంతవరకు పరిష్కారం చేశారన్నదే ప్రశ్న. పాఠశాలలపై ఎక్కువ అవగాహన ఉండేది అధికారులకే. స్కూళ్లలో కేటాయించాల్సిన బల్లలు, కుర్చీలు, చాక్‌పీసులు, పుస్తకాలు, మంచినీరు, విద్యుత్, బాత్‌రూమ్స్ మరమ్మతు వంటి సమస్యలు ప్రతీ ఏడాది ఉంటాయి. వీటితోపాటు టీచర్లు లేకపోతే రెగ్యులర్ నియామకాలు జరిగే వరకు తాత్కాలిక పద్ధతినైనా టీచర్లను భర్తీ జరిగితేనే విద్యార్థులు ఎటువంటి అసౌకర్యాలకు లోనుగాకుండా చదువులపై మనసు లగ్నం చేయడానికి వీలుంటుంది. ఈ విద్యాసంవత్సరం నుంచి నోట్ పుస్తకాలు కూడా అందిస్తామని, అవి కూడా ప్రారంభం రోజే అందజేస్తామని విద్యాశాఖ మంత్రి ప్రకటించి ఉన్నారు. యూనిఫామ్‌లతో పాటు బెల్టు, టై ఇవ్వబోతున్నట్టు ప్రకటించారు. ఇందులో ఏ పనిని ఎంతవరకు పూర్తి చేశారన్నది తెలియదు. లోటు పాట్లుంటే మిగిలిన వారం రోజుల సమయాన్ని సద్వినియో గం చేసుకుని కనీస సౌకర్యాలపై అధికారులు దృష్టి పెట్టాలి.

'ప్రతీ తల్లి తండ్రి ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పితే విలువలతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందన్న నమ్మకం కలిగే పరిస్థితులు నెలకొల్పినప్పుడే ప్రభుత్వ పాఠశాలల మనుగడకు సార్థకత ఉంటుంది' అని రాష్ట్రపతిగా ఉన్నప్పుడు అబ్దుల్‌కలామ్ చెప్పారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో నాణ్యమైన విద్యను అందిస్తామని మన పాలకులు వల్లె వేస్తుంటారు. అది మాటల్లో తప్ప చేతల్లో కనిపించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో 60లక్షల



మంది విద్యార్థులుంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారు 30లక్షల మంది దాకా ఉంటారని అంచనా. స్కూల్స్‌లో అన్ని తరగతులకు టీచర్లుంటేనే విద్యార్థులు వస్తుంటారు. తల్లిదండ్రులకు ధైర్యం కలుగుతుంది. అయితే, గురుకులాల్లో టీచర్లను భర్తీ చేస్తున్న ప్రభుత్వం... జిల్లా, మండల ప్రజా పరిషత్ పాఠశాలల్లో ఖాళీల భర్తీపై దృష్టి పెట్టడం లేదు. దీని వెనుక కారణాలేంటన్నది ప్రశ్న! విద్యాసంవత్సరం ప్రారంభంలో మాత్రం ఖాళీలను భర్తీ చేయబోతున్నట్లు ప్రభుత్వ ప్రకటనలు ఊరిస్తుంటాయి. ఆ తర్వాత ఏవేవో కారణాలతో ఆగిపోతుంటాయి. 2017లో టీఆర్‌టి ద్వారా సుమారు 8వేల 500పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది. ఇంకా 22వేల టీచర్ పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. విద్యావాలంటీర్ల నియామకాలూ మధ్యలోనే జరుగుతున్నాయి.

"మన ఊరు మన బడి" ద్వారా రూ.7 వేల కోట్లతో స్కూళ్ళను బాగుచేయబోతున్నట్టు గత సంవత్సరం జనవరిలో ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు మూడోవంతు స్కూల్స్ కూడా బాగుపడలేదు. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల బాగుకు 12రకాల వసతులు కల్పిస్తామని అంటున్న ప్రభుత్వం చిత్తశుద్ధితో ఆచరణకు పూనుకోవాలి. ఎన్ని చేసినా టీచర్లను నియమించకుంటే ఉపయోగం ఉండదని ప్రభుత్వం గుర్తించాలి.

ప్రభుత్వ ప్రాథమిక స్కూళల్లో ఒక్కరు లేదా ఇద్దరే ఉపాధ్యాయులున్న ఉదంతాలు అనేకం. ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ ఏడు తరగతులకు కలిపి ఐదుగురే ఉంటున్నారు. ఈ పరిస్థితిని చక్కదిద్ది ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థులను ఆకర్షించడానికి వెంటనే టీచర్ల రిక్రూట్‌మెంటు చేయాల్సి ఉంది. స్కూల్స్‌ను శుభ్రం చేసేందుకు రెగ్యులర్ పారిశుధ్య కార్మికులను నియమించడం వల్ల అన్నిరకాలుగా ఉపయుక్తంగా ఉంటుందన్నది విద్యావేత్తల అభిప్రాయం. అదేవిధంగా బడి పిల్లలకు మధ్యాహ్నభోజనం అందించడాన్ని వ్యయంగా చూడొద్దనేది సుప్రీంకోర్టు సూచన. కానీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం నిధులు కేటాయించకుండా... రాష్ట్రాలపై భారం మోపడం వల్ల సకాలంలో వంటకార్మికులకు నిధులు అందడం లేదు. మంచి భోజనం పెట్టడంలేదని వారిపైనే మళ్లీ ఆరోపణలు. వివాదాలు ఎలా ఉన్నా పిల్లల ఆరోగ్యం విషయంలో కేంద్ర, రాష్ట్ర పాలకులు నిర్లక్ష్యంగా ఉండటం ఎంతమాత్రం సరికాదు. 90శాతం టాయ్‌లెట్స్ సౌకర్యం కల్పించినా నీరు లేకపోవడం ప్రధాన సమస్య. ఈ విషయంలో బాలికల బాధ వర్ణనాతీతం. భరించలేక చివరికి చదువే మానేస్తున్న పరిస్థితి. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు కంప్యూటర్ విద్య ను ప్రవేశపెట్టినా చాలా స్కూళ్లలో విద్యుత్ సౌకర్యం లేదు. వాటన్నటినీ స్కూళు తెరిచేనాటికి ఏర్పాటు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

ప్రపంచీకరణ క్రమం తిరుగుముఖం పడుతోందా?

> శ్రామిక ప్రజల జీవితాలను మెరుగుపరచుకోడానికి ఆ దేశంలో ఏర్పడే ప్రభుత్వ స్వభావం మారితే చాలదు. అంటే, ప్రస్తుత అధికార వర్గాల స్థానంలో కార్మిక, కర్షక ప్రజల మద్దతు మీద ఆధారపడిన ప్రభుత్వం ఏర్పడితే సరిపోదు. పెట్టుబడులు స్వేచ్ఛగా ఎక్కడికైనా రాకపోకలు సాగించే విధానంతో ఆ ప్రభుత్వం విడగొట్టుకోగలగాలి. కార్మిక, కర్షక తరగతుల మద్దతు మాత్రమే చాలదు. పెట్టుబడుల రాక, పోకలను నియంత్రించగల అధికారం కూడా ఉండాలి. అటువంటి నియంత్రణకు పూనుకుంటే అప్పుడు సామ్రాజ్యవాదం విధించే ఆంక్షలను ఎదుర్కోవలసివస్తుంది.

చాలామంది ఆర్థికవేత్తలు ఈ మధ్య ప్రపంచీకరణ క్రమం రివర్స్ అవుతున్న క్రమం గురించి (డి-గ్లోబలైజేషన్) చర్చిస్తున్నారు. నిన్నటి కాలపు నయా ఉదారవాద వ్యవస్థ ఇప్పుడిక ఎంతమాత్రమూ కొనసాగడం లేదని మరికొందరు అంటున్నారు. "ఒకే నదిలో రెండుసార్లు అడుగుపెట్టలేం" అని గ్రీకు తత్వవేత్త హెరాక్లిటస్ ఎప్పుడో అన్నట్టు ప్రపంచంలో ప్రతీదీ ఎల్లకాలమూ ఒకేవిధంగా కొనసాగలేదు. అదేమాదిరిగా నయా ఉదారవాద విధానంలో కూడా కాలం గడుస్తున్నకొద్దీ మార్పులు జరగడం అనివార్యం. అయితే వర్తమాన ప్రపంచంలోని ఆర్థిక వాస్తవికతను గ్రహించి దానిని మార్చడానికి ప్రయత్నించడం ఇప్పుడిక అవసరం లేదా? నయా ఉదారవాద వ్యవస్థను మనం ప్రత్యేకంగా పూనుకుని మార్చనవసరం లేదా? - ఇదీ అసలు ప్రశ్న.

ప్రపంచీకరణ అంటే ఏమిటి? ప్రంచంలోని వివిధ దేశాలు కలిసికట్టుగా ముందుకు వచ్చి అన్ని దేశాలకూ ప్రయోజనకరంగా ఉండేటట్లు ఒక ఆర్థిక వ్యవస్థను రూపొందించుకోవడమే ప్రపంచీకరణ అని అని మనం ఎన్నడూ భావించలేదు. ప్రస్తుతం దాదాపు 50దేశాలు రకరకాల "ఆంక్షలను" చవిచూస్తున్నాయి. ఆ ఆంక్షల వలన ఆ యా దేశాలకు అవసరమైన సరుకులను ప్రపంచమార్కెట్‌లో అవి పొందడానికి అవకాశం లేకుండా పోయింది. ప్రాణాలను కాపాడే ఔషధాలను సైతం ఆ దేశాలు పొందడానికి ఇప్పుడు సాధ్యం కావడం లేదు. ప్రపంచీకరణ క్రమం పూర్తిస్థాయిలో "మంచి ఊపు మీద ఉన్న కాలంలో" అంటే ఒక దశాబ్దం క్రితం కూడా ఈ విధమైన ఆంక్షలను ఎదుర్కొనే దేశాల సంఖ్య ఇప్పుడున్న మోతాదులోనే ఉండింది.



ప్రభాత్ పట్నాయక్

"ప్రపంచీకరణ" గురించి సాధారణంగా చెప్పుకునే అర్థం వేరు, దాని వాస్తవ స్వభావం వేరు. ప్రపంచీకరణ అంటే ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలలోకి పెట్టుబడి, ముఖ్యంగా ద్రవ్య పెట్టుబడి యధేచ్ఛగా సంచరించగలిగే పరిస్థితిని కల్పించే దశ. ఇది పెట్టుబడిదారీ వ్యవస్థలో ఒకానొక దశ. అది ఆ యా దేశాలు (జాతి రాజ్యాలు) తమకు నచ్చిన విధంగా తమ ఆర్థిక వ్యవస్థను నడిపించడానికి జోక్యం చేసుకునే శక్తిని ప్రపంచీకరణ బాగా కుదించివేసింది. తన ఆమోదం లేని విధానాలను ఆయా దేశాలు అనుసరించే వీలు లేకుండా ప్రపంచీకరణ చేసింది. అన్నింటికీ మించి ఈ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా చేసే పెత్తనానికి సంపన్న పెట్టుబడిదారీ దేశాలు పూర్తి మద్దత్తునిస్తున్నాయి. మరీ ముఖ్యంగా అమెరికా ప్రపంచీకరణ క్రమానికి లోబడని దేశాల మీద ఆంక్షలు విధించడం ద్వారా తక్కిన అన్ని దేశాలు తమ దారిలోకి వచ్చేలా చేస్తున్నది.

అందుచేత ప్రపంచీకరణ అంటే పశ్చిమ దేశాల సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని మళ్ళీ ఈ ప్రపంచంమీద రుద్దే క్రమం అని అర్థం చేసుకోవాలి. అయితే, సోషలిస్టు దేశాల మీద ఆవిధంగా రుద్దడం సాధ్యం కావడం లేదు. కాని, సామ్రాజ్యవాదుల వలస పాలననుండి 20వ శతాబ్దపు నడిమి కాలంలో విముక్తి పొందిన దేశాలమీద ప్రపంచీకరణను రుద్దగలిగారు. ఆ దేశాలలో పెట్టుబడిదారీ విధానాన్ని బలపరిచే ఆర్థిక విధానాలనే చేపట్టినప్పటికీ, ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుని ప్రజా సంక్షేమ విధానాలను అమలు చేస్తూ కొంతమేరకు పెట్టుబడిని నియంత్రిస్తూవుండే విధానాలను అనుసరిస్తూవుండేవి. ఇప్పుడు అక్కడ ఆ విధానాలను కొనసాగించడానికి ప్రపంచీకరణ ఒప్పుకోవడం లేదు. మూడవ ప్రపంచపు సోషలిస్టేతర దేశాలలో సామ్రాజ్య వాదానికి పూర్తిగా లోబడిపోకుండా కొంతమేరకైనా స్వయం ప్రతిపత్తితో వ్యవహరించగల అవకాశాలను ప్రపంచీకరణ పూర్తిగా తొలగించింది. పెట్టుబడి ఎటువంటి ఆంక్షలూ లేకుండా యధేచ్ఛగా ప్రపంచం మొత్తం మీద సంచరిం చడం అంటే దాంతోబాటు సరుకులు, సేవలు కూడా దేశాల ఎల్లలతో నిమిత్తం లేకుండా యధేచ్ఛగా సంచరించడం. (ఆంక్షలకు గురైన దేశాలు తప్ప)


అయితే ఈ ప్రపంచీకరణ కాలంలో కొన్ని దేశాలు కొత్తగా ఆర్థిక శక్తులుగా బలపడ్డాయి. వాటివలన తమ ఆధిపత్యం దెబ్బ తింటుందన్న భయం పశ్చిమ సామ్రాజ్యవాద దేశాలకు పట్టుకుంది. ఈ కొత్తగా బలపడిన దేశాలలో రష్యా ఒకటి. సోవియట్ యూనియన్‌గా ఉండిన కాలంలో నిర్మితమైన ఉత్పత్తి పునాది బ్రహ్మాండమైన స్థాయిలో ఉండేది. అది రష్యాకు వారసత్వంగా సంక్రమించింది. బోరిస్ ఎల్సిన్ అధికారంలో ఉన్న కాలంలో రష్యాను తాము లొంగదీసుకోగలిగామని సామ్రాజ్యవాదదేశాలు భావించాయి. కాని బోరిస్ ఎల్సిన్ దిగిపోయాక రష్యా నూతన నాయకత్వం తమ దేశపు సత్తా ఏమిటో చూపడం మొదలుపెట్టింది. మరోవైపున చైనా ప్రపంచీకరణ క్రమాన్ని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలను బట్టి గాక తనకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా అమలుచేయడంతో చాలా వేగంగా అభివృద్ధిని సాధించింది. ముఖ్యంగా సంపన్న పాశ్చాత్య దేశాల మార్కెట్ తనకు అందుబాటులో ఉండటం దీనికి తోడ్పడింది.

ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యాపై ఆంక్షలు విధించారు. పశ్చిమదేశాలు చైనాతో జరిపే వాణిజ్యం తగ్గిపోయింది. చైనా పట్ల పశ్చిమ దేశాలు రాజకీయంగా అనుసరించిన వైఖరి దీనికి ఒక ముఖ్య కారణం. ఆ విధమైన వైఖరిని, పశ్చిమ దేశాలు, ముఖ్యంగా అమెరికా అనుసరించడానికి అనేక కారణాలు ఉన్నాయి. తన దేశంలో ఉపాధి అవకాశాలను కాపాడుకోవడం, (నిజానికి చైనా నుండి అమెరికా దిగుమతి చేసుకునే సరుకులలో అత్యధికభాగం అమెరికా అక్కడ పెట్టిన ప్రత్యక్ష పెట్టుబడులతో ఉత్పత్తి అయేవే ఉంటాయి) చైనామీద ఎక్కువగా ఆధారపడవలసిన పరిస్థితిని నివారించడం వంటి కారణాలు ఉన్నాయి. ఇక తక్కిన పశ్చిమ దేశాలకు అదనంగా తోడయిన కారణం వాటిపై అమెరికా చేస్తున్న ఒత్తిడి... వీటన్నింటిలోకీ, చైనామీద మరీ అతిగా ఆధారపడకూడదు అన్నదే ప్రధాన కారణం.

జార్జిబుష్ (జూ) దేశాధ్యక్షుడుగా ఉన్న నాటినుంచీ ఈ ఆందోళన అమెరికాకు మొదలైంది. చైనా నుండి దిగుమతులు పెరిగిపోతూండడంతో జార్జిబుష్ యువాన్-డాలర్ మారకం రేటును పెంచాలని ఒత్తిడి చేయడానికి ప్రయత్నించాడు. ఒబామా హయాంలో కూడా ఈ వైఖరి కొనసాగింది. విదేశాలకు తమ పరిశ్రమలను తరలించాలని ప్రయత్నించిన అమెరికన్ కంపెనీలపై ఒబామా అపరాధరుసుం విధించాడు. ఇక డొనాల్డ్ ట్రంప్ కాలంలో దిగుమతులమీద అదనపు సుంకాలను విధించి తద్వారా దేశీయ ఉత్పత్తులను కాపాడడానికి ప్రయత్నించాడు. ఈ అదనపు సుంకాల తాకిడి తక్కిన దేశాలకన్నా చైనాకే ఎక్కువగా తాకింది.

చైనాతో తమ వ్యాపారాన్ని తగ్గించుకోడానికి పశ్చిమ దేశాలు చేసే ప్రయత్నాల వెనుక ఉన్న రాజకీయ కారణాలు అర్థం కావడానికి రెండు ఉదాహరణలు ప్రస్తావిస్తాను. యూరప్‌లో కర్బన ఉద్గారాలను తగ్గించుకోడానికి చేసే ప్రయత్నాలలో భాగంగా సౌర విద్యుత్తు ఉత్పత్తిని పెంచడానికి నిర్ణయించుకున్నారు. అందుకు అవసరమైన సోలార్ పానెల్స్‌ను దిగుమతి చేసుకోవలసిన అవసరం వచ్చింది. అప్పుడు యూరపియన్ యూనియన్ ఒక నిబంధనను రూపొందించింది. ప్రపంచ మార్కెట్‌లో 65శాతానికి మించి వాటా ఉన్న ఏ దేశం నుండీ సోలార్ పానెల్స్‌ను యూరపియన్ దేశాలు దిగుమతి చేసుకోరాదు అన్నదే ఆ నిబంధన. ఈ నిబంధన కేవలం చైనాను దృష్టిలో పెట్టుకునే రూపొందింది. అప్పటికి చైనా అంతర్జాతీయ మార్కెట్‌లో సోలార్ పానెల్స్ ఉత్పత్తిలో 85శాతం వాటా కలిగివుంది. దానికి కారణం వాటిని చైనా చాలా చౌకగా సరఫరా చేయడమే. చైనా నుండి వాటి దిగుమతిని నిషేధించడం కోసం యూరపియన్ దేశాలు ఎక్కువ ఖరీదుకి ఆ పానెల్స్‌ను ఇతర దేశాలనుండి కొనుగోలు చేయడానికి సైతం సిద్ధపడ్డాయి. ఇది కేవలం ప్రపంచ రాజకీయాల బలాబలాలను దృష్టిలో ఉంచుకుని చేసిన రాజకీయ నిర్ణయం అని స్పష్టంగా కనిపిస్తోంది.

అదే మాదిరిగా బైడెన్ ప్రభుత్వం చైనాకు సెమి కండక్టర్ల ఎగుమతిని నిషేధించింది. ఈ నిషేధాన్ని అమెరికన్ కార్పొరేట్లు సైతం వ్యతిరేకించారు. చైనాలో నడుస్తున్న నిర్మాణంలో ఉన్న హైటెక్ పరిశ్రమలకు, మిలిటరీ టెక్నాలజీకి, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ టెక్నాలజీకి ఈ సెమి కండక్టర్లు కీలకం. అమెరికన్ కార్పొరేట్లకు ఆ సెమి కండక్టర్ల ఎగుమతులు బాగా లాభాలను



ఆర్జిస్తాయి. అయినా సరే, బైడెన్ ప్రభుత్వం చైనాకు వాటిని ఎగుమతి చేయకుండా నిషేధించింది. దీనివెనుక కేవలం అమెరికా అనుసరించే ప్రపంచాధిపత్య రాజకీయాలే ప్రధాన కారణం. చైనాను ఆర్థికంగా, సాంకేతికపరంగా నిస్సహాయ స్థితికి నెట్టాలన్నదే అమెరికా వ్యూహం. చైనామీద ప్రస్తుతం ఎటువంటి ఆంక్షలనూ అధికారికంగా ప్రకటించలేదు. కాని ప్రస్తుతం మనం ఆ దేశంమీద అమెరికా అప్రకటిత ఆంక్షలను అమలు చేయడాన్ని చూస్తున్నాం. రాబోయే కాలంలో అధికారికంగా ఆంక్షలను ప్రకటించినా ప్రకటించవచ్చు. ఆ ఉద్దేశ్యం అయినా ఉండాలి. లేదా కనీసం చైనాను బలహీనపరచాలన్న ఉద్దేశ్యం అయినా ఉండివుండాలి

చైనాపట్ల పశ్చిమదేశాలు ప్రదర్శిస్తున్న వివక్షత ఎటువంటి ప్రభావం చూపనుంది అన్న అంశం ప్రపంచీకరణ క్రమం తిరుగుముఖం పట్టిందన్న ప్రస్తుత చర్చకు దారి తీసింది. చైనామీద అతిగా ఆధారపడకూడదు అన్న పశ్చిమదేశాల ప్రయత్నాలు తమ వ్యాపారాలను ఇతరదేశాలవైపు ఎక్కువగా మళ్ళించడానికి దారి తీస్తున్నాయి. ఆ విధంగా చేయడం వలన ఎక్కువ ధరలను చెల్లించవలసివస్తుంది. అయినా పశ్చిమ దేశాలు ఆ వైఖరినే తీసుకున్నాయి. అమెరికా చైనాతో చేసే వ్యాపారం ప్రసస్తుతం తగ్గిపోడానికి ఇదే కారణం. పశ్చిమదేశాలు ఆంక్షలను విధించిన దేశాల జాబితాలో చైనా కూడా చేరిపోయినట్టే కనిపిస్తోంది. ప్రపంచీకరణ క్రమం ఏ మోతాదులో కొనసాగుతోంది అన్నది అంచనా వేయడానికి ఆర్థికవేత్తలు కొన్ని స్థూల ప్రాతిపదికలను పరిశీలిస్తారు. మొత్తం ప్రపంచ జీడీపీకి, ప్రపంచం మొత్తం మీద జరిగే దిగుమతులకు మధ్య ఉండే నిష్పత్తి అటువంటి ఒక ప్రాతిపదిక. ఆ నిష్పత్తి ఏమీ తగ్గుముఖం పట్టలేదు. మహా అయితే ప్రపంచీకరణ వేగం తగ్గింది అని చెప్పగలమేమో కాని ప్రపంచీకరణ ఏకంగా తిరుగుముఖం పట్టిందని మాత్రం చెప్పలేం.

ప్రపంచీకరణ అంటే ప్రపంచదేశాలు అంతకంతకూ ఒకదానిమీద ఇంకొకటి మరింత ఎక్కువగా ఆధారపడే క్రమం అన్న అభిప్రాయానికి మన దృష్టిలో అంత ప్రాధాన్యత లేదు. ఇది ప్రధానంగా అధికారానికి సంబంధించిన సంబంధం. ఆ అధికారాన్ని ఉపయోగించి, అవసరమైతే ఆంక్షలను ప్రయోగించి అన్ని దేశాలనూ ప్రపంచీకరణ చట్రంలోకి లాగడం. ఈ విధంగా అధికారాన్ని ఉపయోగించడం సామ్రాజ్యవాదపు స్వభావానికి నిదర్శనం. ప్రపంచీకరణ అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యాన్ని స్థిరపరిస్తే, ఆంక్షలు సామ్రాజ్యవాదపు కర్కశత్వాన్ని సూచిస్తున్నాయి... ప్రస్తుతం తిరుగుముఖం పడుతోందని చెపుతున్న ప్రక్రియ వాస్తవానికి ప్రపంచీకరణకు వ్యతిరేకం కాదు. అది నిజానికి ఆ ప్రపంచీకరణకు తోడుగా సాగుతున్న ఒక క్రమం.

అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ప్రధానంగా సంపన్న పశ్చిమదేశాలనుండే వస్తుంది. ఆ దేశాల కార్యకలాపాలతో ముడిపడిపోయివుంటుంది. అందుచేత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం అంటే సంపన్న పశ్చిమదేశాల ఆధిపత్యమే తప్ప మరొకటి కాదు. ఈ ఆధిపత్యం ప్రపంచ ప్రజలందరిమీదా చెలాయించడం జరుగుతుంది. మరీ ముఖ్యంగా మూడవ ప్రపంచదేశాల ప్రజలమీద చెలాయిస్తున్నారు. ప్రపంచీకరణకు మూడవ ప్రపంచదేశాలలోని బడా బూర్జువా వర్గం మద్దత్తు పలకవచ్చు. ఉన్నత ఆదాయ వర్గాల వారు, డాక్టర్లు, లాయర్లు తదితర ప్రొఫెషనల్స్ కూడా మద్దతు పలకవచ్చు. కాని మూడో ప్రపంచదేశాలలోని కార్మికులమీద, రైతాంగం మీద, చిన్న ఉత్పత్తిదారులమీద ప్రపంచీకరణ క్రమం తన అణచివేతను సాగిస్తుంది.

మరో విధంగా చెప్పాలంటే, శ్రామిక ప్రజల జీవితాలను మెరుగుపరచుకోడానికి ఆ దేశంలో ఏర్పడే ప్రభుత్వ స్వభావం మారితే చాలదు. అంటే, ప్రస్తుత అధికార వర్గాల స్థానంలో కార్మిక, కర్షక ప్రజల మద్దతు మీద ఆధారపడిన ప్రభుత్వం ఏర్పడితే సరిపోదు. పెట్టుబడులు స్వేచ్ఛగా ఎక్కడికైనా రాకపోకలు సాగించే విధానంతో ఆ ప్రభుత్వం విడగొట్టుకోగలగాలి. కార్మిక, కర్షక తరగతుల మద్దతు మాత్రమే చాలదు. పెట్టుబడుల రాక, పోకలను నియంత్రించగల అధికారం కూడా ఉండాలి. అటువంటి నియంత్రణకు పూనుకుంటే అప్పుడు సామ్రాజ్యవాదం విధించే ఆంక్షలను ఎదుర్కోవలసివస్తుంది. ఒక దశాబ్దం వెనుక కూడా ఇదే పరిస్థితి. ఇప్పుడూ అదే కొనసాగుతోంది. ప్రపంచీకరణ క్రమం తిరుగుముఖం పడుతోందని కొందరు ఆర్థికవేత్తలు అంటున్నదానికి, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి పెత్తనాన్ని ఎదుర్కొనే పోరాటానికి, దాని వెనుక దన్నుగా ఉన్న సంపన్న పశ్చిమదేశాల ఆధిపత్యాన్ని ఎదుర్కొనే పోరాటానికి ఏ మాత్రమూ సంబంధం లేదు గాక లేదు.

(స్వేచ్ఛానుసరణ)



హెచ్చరిక

పీఠమెక్కినంత మాత్రాన
రాజు కాలేడెవడు
బూజుపట్టిన కొన్ని చరిత్రలే వాటికి సాక్ష్యం
గాజులు తగిలించుకున్నామని
చిన్నచూపేమో
ఉడుంపట్టు పట్టి
ఉతికి ఆరేయగల నేర్పరులం

కుక్క గతుకుల సొల్లు బుద్ధి
పళ్ళు రాలగొట్టుకునే వెకిలి బుద్ధి
ఆటల కొమ్మకు పూసిన
విషపు పువ్వువు నీవు
కొవ్వుగా పేరుకుపోయిన
మాయాలీలల గాలానివి
కంటిచెమ్మలకు
మింట చుక్కలకు తేడా తెలుసుకోకనే
మనిషికీ, మగానికి మధ్యలో
కొట్టుమిట్టాడుతున్నావు

అలుసుగా
అలవోకగా
ఈడ్చిపారేయచ్చనుకుంటున్నావేమో
ఏడ్చి ఏడ్చి రక్తాన్ని స్రవిస్తున్న నా కళ్ళు
దీనత్వాన్ని చుట్టుకొని
బేలగా మారాయనుకుంటున్నావేమో

ఎన్నో విజయాలను రుచిచూసిన చేతులివి
అహంకారపు ముళ్ళపొదలను
తొలగించడమెలాగో
అవే పొదల మధ్యలోంచి పొంచి చూసే
కీటకాల కంటకాలను విరవడమెలాగో
దేశదేశాల్లో మన కీర్తిపతాకాన్ని
ఎగిరేసినంత గొప్పగా తెలుసు

ఆర్తనాదాలు కావివి
వర్షం రాకడను తెలిపే కారుమబ్బులు
ఇదిగో
సునామి హెచ్చరికలు జారీ చేస్తున్నా
కుర్చీ ఖాళీ అవ్వటానికి
ఇంకెంతో సమయం పట్టదు

- తండ హరీష్ గౌడ్
సెల్: 8978439551

న్యాయం కోసం మల్లయోధుల మహాకుస్తీ


> లైంగికదాడి సంస్కృతిలో భాగమని బీజేపీ కేంద్ర మంత్రులే అంటుంటే ఇక మహిళలకు రక్షణ ఎక్కడుంది. మహిళలను ఏమైనా చెయ్యవచ్చని పురుషాధిక్య భావ జాలాన్ని పెంచి పోషిస్తున్నది బీజేపీ కేంద్ర ప్రభుత్వం. ఎందుకంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానంలోనే మహిళలంటే తక్కువ, చిన్నచూపు, రెండవ పౌరురాలు, వంటింటికే పరిమితం కావాలి, పిల్లల్ని కనే యంత్రంలా ఉండాలని వాళ్ళ మనువాద సిద్ధాంతం చెబుతున్నది. అందుకే బీజేపీ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం స్థానంలో మను ధర్మశాస్త్రాన్ని తేవాలని, రాజ్యాంగం ద్వారా మహిళలకున్న హక్కుల్ని తొలగించాలని ప్రయత్నం చేస్తున్నది. ఇందులో భాగమే రెజ్లర్ల పోరాటాన్ని అణిచివేయడం. ఈ దుర్మార్గ విధానాలను ప్రజలందరూ తిప్పికొట్టాలి. న్యాయం కోసం, వారి హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తున్న రెజ్లర్లకు సమాజమంతా అండగా నిలబడాల్సిన అవసరం ఉంది.

రక్షించాల్సిన వాడే భక్షిస్తే పరిస్థితులు ఎంత దారుణంగా ఉంటాయో ఢిల్లీలో జరుగుతున్న రెజ్లర్ల పోరాటంపైన కేంద్ర ప్రభుత్వం నిర్బంధకాండను చూస్తుంటే స్పష్టంగా అర్థమవుతుంది. తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆల్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను అరెస్టు చేసి తగిన చర్యలు తీసుకోవాలని భారత మల్లయోధులైన మహిళా రెజ్లర్లు వినేష్ ఫోగట్, సాక్షిమాలిక్ గత 40రోజులకు పైగా ఢిల్లీ నడిబొడ్డున జంతర్‌మంతర్ వద్ద నిరవధిక పోరాటం చేస్తున్నారు. రెజ్లర్లు పథకాలు సాధించినప్పుడు అభినందించిన ప్రధానమంత్రి ఇప్పుడు రెజ్లర్లు న్యాయం అడిగితే మాత్రం స్పందించటం లేదు. ఇంతకాలం గడిచినప్పటికి కనీసం ఈ అంశంపైన ప్రధాన మంత్రి రెండు నెలలుగా నోరుమెదపటం లేదు. 'ఆడపిల్లలు మేము లైంగిక వేధింపులకు గురయ్యాం అని చెప్పగానే ఆ నేరస్తుడిపై వెంటనే ఎటువంటి ఆలోచన చేయకుండా చర్యలు తీసు కోవాలి.' ఈ మాట అన్నది ఎవరో కాదు బీజేపీ ఎంపీ ప్రీతమ్ ముండే. మరి నెలన్నర గడుస్తున్నప్పటికీ కేంద్రం బ్రిజ్‌భూషణ్‌ను ఎందుకు అరెస్టు చేయడం లేదు. పైగా న్యాయం అడిగిన రెజ్లర్లను కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఇబ్బంది పెడుతున్నది. వారి పోరాటంపైన నిర్బంధకాండను ప్రయోగిస్తున్నది.



పి.జయలక్ష్మి

రెజ్లర్లు ఒకేసారి పోరాటంలోకి రాలేదు. పోరాటానికి ముందు వారి సమస్యల పరిష్కారం కోసం అనేక ప్రయత్నాలు చేశారు. మొదట సంబంధిత కమిటీకి తెలియజేశారు. రెండు సంవత్సరాల క్రితం స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రెజ్లర్లు ఈ అంశాలను చెప్పారు. అయినా వారి సమస్యలు పరిష్కారం కాలేదు. కనీసం సంబంధిత బాధ్యునిపైన ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. దీంతో అలసిపోయిన రెజ్లర్లు మరో గత్యంతరం లేని స్థితిలో ఢిల్లీ నడిబొడ్డున జంతర్‌మంతర్ వద్ద నిరవధిక ఆందోళనను ప్రారంభించారు. ఆందోళన అనంతరం సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని మొట్టికాయలేస్తే తప్ప బ్రిజ్ భూషణ్ పై కేసు నమోదు చేయలేదు పోలీసులు. ఏప్రిల్ 28న ఢిల్లీ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. నాలుగు రాష్ట్రాల్లో 125మంది సాక్షుల వాంగ్మూలం పోలీసులు సేకరిస్తున్నారు. ఈ సందర్భంగా సాక్షులు బ్రిజ్‌భూషణ్ లైంగికంగా వేధించడం వాస్తవమేనని నలుగురు సాక్షులు ఇప్పటికే ధృవీకరించారు. ఆ సాక్షుల్లో ఇద్దరు రెజ్లర్లు. ఒక టాప్ రిఫరీ, ఒక రాష్ట్ర కోచ్ ఉన్నారు. సంఘటన జరిగిన ఆరు గంటల తర్వాత తనను పిలిచారని కోచ్ చెప్పారు. ఆరోపణల గురించి తెలుసునని రిఫరీ తెలిపారు. వృత్తిపరమైన సహాయానికి బదులుగా లైంగిక ప్రయోజనాలను కోరిన కనీసం రెండు సందర్భాలున్నాయని, దాదాపు 15లైంగిక వేధింపుల ఘటనలు. ఇందులో పది ఎపిసోడ్‌లు అనుచితంగా తాకడం, వేధింపులు, చాతిపై చేతులు వేయడం, నాభిని తాకడం, వెంబడించటంతో సహా బెదిరింపులకు సంబంధించిన అనేక సందర్భాలున్నాయని సాక్షులను విచారించినప్పుడు ఈ అంశాలు చెప్పారని పోలీసులు తెలియజేశారు. ఇంకా అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయి. శ్వాస ప్రక్రియ పేరుతో బ్రిజ్‌భూషణ్ తాకరాని చోట్ల తాకారని, బలవంతంగా కౌగిలించుకున్నాడని, రెస్టారెంట్‌కు పిలిచి ఇబ్బందిపెట్టాడని, తాను ఒక ఆహార పదార్థాన్ని తీసుకువచ్చి తినాలని బలవంతం చేశాడని, ఒక క్రీడాకారిని ప్రపంచ స్థాయి పోటీల్లో గాయపడితే తనతో స్వయంగా బ్రిజ్ భూషణ్ మాట్లాడుతూ 'నాతో సన్నిహితంగా ఉంటే నీ వైద్య ఖర్చులు ఫెడరేషన్ భరిస్తుంది' అన్నట్లు



తెలియజేసింది. ఇంతటి దుర్మార్గుడిని అరెస్టు చేయకుండా కేంద్ర ప్రభుత్వం చోద్యం చూస్తున్నదంటే మహిళల పట్ల ఎంత వ్యతిరేకమైన భావంతో ఉందో అర్థమవుతుంది.

మహిళా రెజ్లర్లు తమ బాధని, ఆగ్రహాన్ని లోకానికి ఎలుగెత్తి చాటుతుంటే ప్రపంచమంతా అర్థమవుతున్న, కేంద్ర పాలకులకు మాత్రం వినిపించడం లేదు. పైగా బాధితులని అణచివేస్తూ, నిందితులను కాపాడడానికి ఎంతకైనా తెగిస్తున్నారు. నిరసన తెలియజేస్తున్న రెజ్లర్లను అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారు. మొదట జంతర్‌మంతర్ వద్ద కరెంట్, నీళ్ళు ఎలాంటి సౌకర్యాలు లేకుండా చేయాలని చూశారు. రెజ్లర్లకు అన్నం, మంచినీళ్ళు ఇవ్వడానికి వచ్చిన ప్రజలను వెనక్కి తిప్పి పంపించారు. అర్థరాత్రి అరెస్టులు చేసి రెజ్లర్లను బెదిరించాలని ప్రయత్నం చేశారు. అయినా రెజ్లర్లు భయపడలేదు. వాళ్ళ పోరాటాన్ని ఇంకా ముందుకే కొనసాగిస్తున్నారు. మే 28వ తేదీన ఢిల్లీలో నూతన పార్లమెంట్ భవనం ముందు మహా పంచాయతీ నిర్వహించాలని రెజ్లర్లు నిర్ణయించారు. నిరసన స్థలానికి చేరుకుంటున్న వారిని ఎక్కడికక్కడ బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. మహిళా రెజ్లర్లను పోలీసులు అత్యంత దారుణంగా ఈడ్చుకుంటూ బలవంతంగా అరెస్టులు చేసి కేసులు బనాయించారు. జంతర్‌మంతర్ వద్ద ధర్నా శిబిరాలను తొలగించారు. ఇండియా గేట్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామంటే అనుమతి ఇవ్వకుండా రెజ్లర్ల పోరాటంపైన కేంద్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన నిర్బంధకాండను ప్రయోగించింది. కేంద్రాన్ని నిరసిస్తూ తాము సాధించిన పథకాలను గంగానదిలో విసిరివేస్తామని రెజ్లర్లు ప్రకటించారు. తొందరపడొద్దని రైతు సంఘాల నాయకులు ఓదార్చటంతో పథకాలను గంగానదిలో విసరకుండా వెనక్కి తగ్గారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులు పెట్టినా వెనక్కి తగ్గేదిలేదని మళ్ళీ అదే జంతర్‌మంతర్ వద్ద తమ పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. రెజ్లర్ల పోరాటానికి దేశంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా మద్దతు రోజు, రోజుకు పెరుగుతున్నది. కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, స్వతంత్ర సంఘాలు, పౌరహక్కుల నేతలు, మేధావులు ఇంకా అనేక సంస్థలు, ప్రజలు రెజ్లర్లకు అండగా నిలబడుతూ అనేక నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా కేంద్ర ప్రభుత్వం వినబడనట్లు, చూడనట్లు వ్యవహరిస్తున్నది.

ఇక నిందితుడు బ్రిజ్‌భూషణ్ విషయానికి వస్తే తాను ప్రారంభం నుండి నేను చేయలేదు అనట్లేదు. సాక్షాలుంటే చూపెట్టాలని సవాలు విసురు తున్నాడు. లైంగిక వేధింపులు ఎవడైనా నలుగురున్నప్పుడు చేస్తాడా సాక్షాలుండటానికి? ఇంత దుర్మార్గంగా బ్రిజ్‌భూషణ్ వ్యాఖ్యానిస్తున్నాడు. ఇప్పుడు విచారణలో అనేక అంశాలు వెలుగులోకి వచ్చేసరికి ఇప్పుడు పోక్స్ చట్టాన్ని మార్చాలని అంటున్నాడు. పోక్స్ చట్టంలో లైంగిక వేధింపులు చేశాడని రుజువైతే వెంటనే అరెస్టు చేయాలని ఉంది. రుజువైనా అరెస్టు చేయకుండా ఉండే విధంగా చట్టాన్ని మార్చాలని చెపుతున్నాడు. నిందితుడు ఇంత తలబిరుసుగా మాట్లాడటానికి బీజేపీ కేంద్ర ప్రభుత్వం అండగా ఉండటమే కారణం. కేంద్ర ప్రభుత్వమే మహిళల పట్ల హింసను, హత్యలను, లైంగికదాడులను పెంచి పోషిస్తున్నది. మహిళలను మీకు నచ్చినట్లు చేసుకోండని సమాజానికి సందేశం ఇస్తున్నది. తప్పు చేసిన వాళ్ళను వదిలేసి అత్యాచారాలు జరగడానికి మహిళల వేషధారణే కారణమని మహిళలపైన దాడిని పెంచుతున్నది. లైంగికదాడి సంస్కృతిలో భాగమని బీజేపీ కేంద్ర మంత్రులే అంటుంటే ఇక మహిళలకు రక్షణ ఎక్కడుంది. మహిళలను ఏమైనా చెయ్యవచ్చని పురుషాధిక్య భావ జాలాన్ని పెంచి పోషిస్తున్నది బీజేపీ కేంద్ర ప్రభుత్వం. ఎందుకంటే బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానంలోనే మహిళలంటే తక్కువ, చిన్నచూపు, రెండవ పౌరురాలు, వంటింటికే పరిమితం కావాలి, పిల్లల్ని కనే యంత్రంలా ఉండాలని వాళ్ళ మనువాద సిద్ధాంతం చెబుతున్నది. అందుకే బీజేపీ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం స్థానంలో మను ధర్మశాస్త్రాన్ని తేవాలని, రాజ్యాంగం ద్వారా మహిళలకున్న హక్కుల్ని తొలగించాలని ప్రయత్నం చేస్తున్నది. ఇందులో భాగమే రెజ్లర్ల పోరాటాన్ని అణిచివేయడం. ఈ దుర్మార్గ విధానా లను ప్రజలందరూ తిప్పికొట్టాలి. న్యాయం కోసం, వారి హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తున్న రెజ్లర్లకు సమాజమంతా అండగా నిలబడాల్సిన అవసరం ఉంది.

సెల్:9490098605

మీ కోసం కాస్త సమయం



గృహిణికి ఇల్లు చక్కబెట్టడం, పిల్లల బాధ్యతలతో సరిపోతుంది. ఇక ఉద్యోగినైతే? ఆఫీసు పని అదనం. వీటన్నింటిలో పడి మీ గురించి పట్టించుకోవడం మర్చిపోవద్దు అంటున్నారు నిపుణులు.

- ఎంతసేపూ పిల్లలకు, ఆయనకు అన్నీ సమకూర్చాలి.. సమయానికి వాళ్లను స్కూలు, ఆఫీసుకు పంపాలన్న తొందరేనా? దీనివల్ల మీ మనసు, శరీరం రెండూ అలసిపోతాయి. ఉద్యోగం చేస్తున్నా ఇంట్లోవాళ్లకి సరిగా అమర్చడం లేదని భావించే మహిళలే మనలో ఎక్కువ. ముందా భావన పక్కనపెట్టండి. రెండు రకాలుగా శరీరాన్ని కష్టపెడుతున్నారని గ్రహించి.. రోజూ కొంత 'నా సమయం' అని కేటాయించుకోండి. ధ్యానం, నింపాదిగా తాగే కాఫీ, చిన్నపాటి వ్యాయామం.. ఆ వేళల్లో ఏదైనా చేయొచ్చు.
- 'బుజ్జిదానికి ఇది నచ్చదు', 'పెద్దాడికి ఫలానాది ఇష్టం' అని ఎంచి ఎంచి చేస్తుంటాం. మరి మీ సంగతేంటి? ఏదో ఒకటి నోట్లో వేసుకొని బస్సు కోసం పరుగు తీయడమేనా? ఇంట్లో వాళ్లందరి గురించీ ఆలోచించేప్పుడే 'మరి నాకు?' అన్న ప్రశ్న వేసుకోండి. ఎంత హడావుడిలో ఉన్నా పోషకాలున్న ఆహారం తీసుకోవాల్సిందే. ఒక్కసారిగా కుదరకపోతే ఇంట్లో కొంచెం, బస్సులో పండ్లు, ఆఫీసులో స్నాక్స్‌గా నట్స్.. ఇలా ప్లాన్ చేసుకున్నా మంచిదే.
- ఇంట్లో ఎలా ఉన్నా ఆఫీసులో నీరసంగా ఉంటే ఉద్యోగినులకు కుదరదు. ఎప్పుడూ పనంటూ తిరుగుతోంటే శరీరానికి మాత్రం ఉత్సాహం ఎక్కడ్నుంచి వస్తుంది? అందుకే యోగా, నడక, డ్యాన్స్.. ఇలా నచ్చిన వాటి కోసం 30 నిమిషాలు వీలు చేసుకోండి. ఒత్తిడి తగ్గడమే కాదు.. శరీరానికీ ఉత్సాహం.
- ఉదయాన్నే పనులన్నీ చకచకా పూర్తవ్వాలని ముందుగానే ప్లాన్ చేసుకోవడం మంచిదే కానీ.. అలాగని నిద్రని మాత్రం త్యాగం చేయొద్దు. కనీసం 7గంటల నిద్ర ఉండేలా చూసుకోవడం తప్పనిసరి. వీటన్నింటినీ చక్కగా ప్లాన్ చేసుకుంటేనే శరీరం, మనసు తేలికపడి మీ బాధ్యతలు ఇంకా మెరుగ్గా చేస్తారు.

చూసిందల్లా కొంటున్నారా..?



మనలో చాలామందికి చూసిందల్లా కొనేయటం అలవాటు. నగలు, చీరలు, మేకప్ సామాన్లు ఇలా ప్రతీది కొనాలనిపిస్తుంది. డబ్బు పొదుపు చేయటం అంటే సంపాదించినట్టే అంటారు కదా! అందుకే ఖర్చు విషయంలో జాగ్రత్త వహించాలి అంటున్నారు ఆర్థిక నిపుణులు.

- మంచి అనుభవాలతో.. వస్తువులు పోగుచేసుకోవటం కన్నా జ్ఞాపకాలు, అనుభవాలను పోగుచేసుకోవటం ఉత్తమం. కంటికి కనిపించినవన్నీ కొనేస్తుంటే డబ్బు వృథాతోపాటు చెత్తలా పేరుకుపోతాయి. కొన్ని వస్తువులు తాత్కాలికంగా ఆనందం ఇవ్వొచ్చు. కానీ దీర్ఘకాలంలో ఉపయోగం లేదు.
- మనకు నిజంగా ఏది అవసరం, ఏది కాదు అనే పూర్తి అవగాహన ఉన్నప్పుడే జీవితంలో విజయవంతమవుతామట. చెప్పులు, దుస్తులు ఇలా ఏ వస్తువైనా సరే అవసరం ఉన్న మేర, అన్ని కాలాలకు నప్పేవి కొనుక్కుంటే ఉపయోగం ఉంటుంది.
- ముందుగా మనకు అవసరం లేవనుకున్న వాటిని తొలగించండి. ఇల్లు ఎంత శుభ్రంగా, ఎంత తక్కువ సామానుతో ఉంటే అంత అందం. మనకు అవసరం లేని వాటిని అవసరమైన వాళ్లకు ఇవ్వాలి. ఎక్కడ ఖర్చు పెడుతున్నామనే అంచనా మనకు పూర్తిగా ఉండాలి. పెట్టుబడులపై దృష్టి పెట్టాలి.

కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రత్యేకించి వేసవిలో వార్డ్‌రోబ్‌లో దుస్తులు అమర్చే విషయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే వివిధ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో– వార్డ్‌రోబ్ తాజాగా.. పరిమళభరితంగా.. ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం..

- వార్డ్‌రోబ్ ఎప్పుడూ తాజాగా, పరిమళభరితంగా ఉండాలంటే లావెండర్, జెరానియం.. వంటి అత్యవసర నూనెల్ని అప్పుడప్పుడూ అందులోని ఖాళీ అరల్లో స్ప్రే చేయచ్చు.



- లావెండర్, జెరానియం, తులసి.. వంటి నూనెలు కలిపి తయారుచేసిన మిశ్రమాన్ని వార్డ్‌రోబ్‌లో ఓ మూలకు ఉంచడం వల్ల కూడా క్లోజెట్ సువాసనతో నిండిపోతుంది.
- ఓ చిన్న గంధపు చెక్కను వార్డ్‌రోబ్ మూలలో ఉంచడం వల్ల కూడా అది పరిమళభరితంగా మారుతుంది.
- సహజసిద్ధ పదార్థాలతో తయారుచేసిన సబ్బుల్ని ఒక సన్నటి కాటన్ క్లాత్‌లో చుట్టి వార్డ్‌రోబ్ కార్నర్‌లో అమర్చాలి. తద్వారా ఈ సబ్బుల నుంచి వెదజల్లే పరిమళాలు అల్మరా అంతా పరచుకుంటాయి.
- చిన్న చిన్న రంధ్రాలున్న ఒక జార్‌లో కొన్ని కాఫీ గింజల్ని పోసి.. ఆ జార్‌ని వార్డ్‌రోబ్‌లో అమర్చినా అందులోని దుర్వాసనలు తొలగిపోయి.. క్లోజెట్ పరిమళభరితంగా మారుతుంది.

తెలంగాణా రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంతటా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడాలోని కోట్ల విజయభాస్కర రెడ్డి స్టేడియంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఫైన్ అర్ట్స్ స్కూల్ అమ్మాయిలు తమ చిత్రకళలను మొదటిసారి ఇక్కడ ప్రదర్శించారు. ఈ సందర్భంగా కొందరు విద్యార్థుల అభిప్రాయం మానవి పాఠకుల కోసం...

అలరించిన చిత్ర ప్రదర్శన



తమలోని కళను ప్రదర్శించేందుకు చాలా మంది తపన పడుతుంటారు. అవకాశాల కోసం ఎదురుచూస్తుంటారు. అందునా అమ్మాయిలు కళల్లో రాణించడం అంత సులభం కాదు. వేలు ఖర్చుపెట్టి శిక్షణ తీసుకోవడం ఆర్థికంతో ముడిపడి ఉంటుంది. అందుకే ఆర్ట్స్ వైపు వచ్చే వారు కొంత మంది మాత్రమే ఉంటారు. అయితే తెలంగాణ ప్రభుత్వం సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఫైన్స్ ఆర్ట్స్ కోర్సులు ప్రారంభించింది. దాంతో అట్టడుగు స్థాయి అమ్మాయిలకు కూడా కళలు దగ్గరయ్యాయి. తమలోని నైపుణ్యాలకు మెరుగులు దిద్దుకుంటున్నారు.

ఆకట్టుకుంటున్నాయి


ఎంతో మంది ఆర్ట్స్ కాలేజీ విద్యార్థులు గీసిన చిత్రాలు ఈ ప్రదర్శనలో ఉన్నాయి. ప్రదర్శనకు వచ్చిన వారందరి ఎంతో ఆకట్టుకుంటున్నాయి. అంతేకాదు వీరు గీసిన చిత్రాలు నచ్చి కొంతమంది కొనుగోలు కూడా చేస్తున్నారు. ఈ ప్రదర్శన ఏర్పాటు చేసిన పాఠశాల ప్రిన్సిపల్, ఆర్ట్ గురువులు రమేష్, విక్రమ్, కిరణ్మయిలకు విద్యార్థులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సవిత అనే మరో విద్యార్థిని గీసిన 'వనిత' చిత్రం పెన్సిల్ స్కెచ్ ఎంతో అద్భుతంగా ఉంది. ఇంకా ఎన్నో చిత్రాలు కొన్నవారి ఇంటి అందాలు పెంచుతున్నాయి.





పెయింటింగ్ బాగా నేర్పిస్తున్నారు

ఉమా మహేశ్వరి... తను గీసిన ఈ చిత్రానికి పెట్టిన పేరు. Image (spell bound landscape). ఈ చిత్రం చూసిన వారు మంత్రముగ్ధులు కావాల్సిందే. ప్రకృతి అందాల నడుమ సరంగు నావ. దీన్ని అక్రిలిక్ పైంటింగ్ అంటారు. ఈ చిత్రం గీయటానికి ఆమెకు వారం రోజులు పట్టింది. "మాది వరంగల్. నేను ఇంటర్ సెకండ్ ఇయర్ పూర్తి చేశాను. ఏడవ తరగతి నుంచి ఇదే గురుకుల పాఠశాలలో చదువుకున్నాను. ఉదయం పూట మాకు రెగ్యులర్ పాఠాలు ఉంటాయి. మధ్యాహ్నం సమయంలో ఆర్ట్స్‌లో శిక్షణ ఇస్తారు. ఇంటర్ తర్వాత ఇక్కడే బాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చదువుతున్నాను. ఈ ఆర్ట్స్ స్కూల్ల్ మాకు పెయింటింగ్ చాలా బాగా నేర్పిస్తున్నారు. భవిష్యత్‌లో మంచి చిత్రాలు వేసి పెద్ద పెద్ద ప్రదర్శనల్లో పాల్గొంటాను.





ఆర్ట్స్ అంటే చాలా ఇష్టం

రజిత... గీసిన చిత్రం (వడ్రంగి పిట్ట) చెట్టు బెరడును చీల్చడంలో ఎంతో బిజీ. దీని టైటిల్ బిజీ ఎట్ పొకింగ్ (Woodpecker). ఏడోతరగతి నుంచి నేను ఇక్కడే చదువుతున్నాను. ఇక్కడే ఇంటర్ పూర్తి చేశాను. మేము ఈసీఐఎల్‌లో వుంటాము. చిన్నప్పటి నుండి ఫైన్ ఆర్ట్స్ అంటే చాలా ఇష్టం. ఈ ప్రదర్శనలో నేను గీసిన వడ్రంగి పిట్ట చిత్రానికి అక్రిలిక్ కలర్స్ వాడాను. మా ఫైన్ ఆర్ట్స్ స్కూల్ నాకు బాగా నచ్చింది. చిత్రకళలో ఎన్నో మెళుకువలు నేర్చుకుంటున్నాను.



వినాయకుడు, మిరాబాయి చిత్రాలు ఒక్కరోజులోనే అమ్ముడుపోయాయంటే వెల్ఫేర్ కాలేజీ అమ్మాయిలు వేసిన చిత్రకళ ఎంతటి చూడముచ్చటగా వుందో అర్థం చేసుకోవచ్చు. 'కళ కొందరికి మాత్రమే పరిమితం. కాదు అవకాశాలు ఇస్తే మేము సైతం మాలోని నైపుణ్యాలను ప్రపంచానికి చాటిచెబుతాం' అంటూ ఈ గురుకుల కాలేజీ అమ్మాయిలు రుజువు చేశారు.

– మణినాథ్ కోపల్లె

కేంద్రం రూ.30 వేల కోట్లు ఆపినా..

బోర్లకు మీటర్లు పెట్టం

నవతెలంగాణ –పాపన్నపేట/కొల్చారం

కేంద్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్లు ఆపినా.. రైతుల బోర్లకు మీటర్లు పెట్టమని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు స్పష్టంచేశారు. సోమవారం మెదక్ జిల్లా పాపన్నపేట మండలం రామతీర్థం గ్రామంలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను మంత్రి ప్రారంభించి లబ్దిదారులకు అందజేశారు. అంతకుముందు పాపన్నపేటలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ, పశు వైద్యశాల, లింగయ్యపల్లిలో పంచాయతీ భవనం, ఏడుపాయలలో నూతనంగా నిర్మించిన యాగశాలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 14 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నూతన కార్యక్రమైన న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుడుతుందని వెల్లడించారు. అన్ని సౌకర్యాలతో ఇల్లు కట్టి ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వమేనని తెలిపారు. ఈ నెలాఖరిలోగా ఇంటి జాగా ఉన్న వారికి గృహలక్ష్మి పథకం ద్వారా ఇల్లు కట్టుకొనేందుకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. డబ్బులు కూడా నేరుగా వారి బ్యాంకు ఖాతాలోనే జమ అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇండ్ల పట్టాల పంపిణీ

మెదక్ జిల్లా కొల్చారం మండలంలో అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల పట్టాల పంపిణీ చేశారు. ఏడుపాయల హరిత హొటల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి హరీశ్ రావు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్ రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి హాజరయ్యారు. జర్నలిస్టుల సంఘం కొల్చారం మండల అధ్యక్షులు కాశం శ్రీనివాస్, జర్నలిస్టులు పట్లోరి వెంకటేశం, నీలకంఠి రమేష్, మిద్దె లక్ష్మీనారాయణ, అఫ్సర్, అశోక్, అనిల్, జీఎల్ కుమార్, సంతోష్ కుమార్, యాదగిరి, లక్ష్మీనారాయణ గౌడ్, మల్లేశం, నాగరాజు గౌడ్, పెంటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

11న గ్రూప్-1 ప్రిలిమ్స్ యథాతథం

(మొదటిపేజి తరువాయి)

యథాతథంగా జరుగుతుందని స్పష్టం చేసింది. గ్రూప్–1 ప్రిలిమ్స్ వాయిదా వేయాలన్న పిటిషన్లను కోర్టు సోమవారం కొట్టేసింది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాలు లీకైన నేపథ్యంలో గతేడాది అక్టోబర్ 16వ తేదీన నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షను రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అభ్యర్థులకు మరోసారి ఈనెల 11న ప్రిలిమ్స్ నిర్వహించేందుకు టీఎస్‌పీఎస్సీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ హాల్ టికెట్లు కూడా విడుదల చేసింది. ఈనెల 11న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుంది. 503 గ్రూప్–1 పోస్టులకు మొత్తం 3,80,202 దరఖాస్తులొచ్చాయి. అయితే ప్రశ్నాపత్రాల లీకేజీ జరిగినా టీఎస్‌పీఎస్సీ పాలకమండలి, సిబ్బందిలో మార్పులు చేయకుండా మళ్లీ వారితోనే పరీక్షను నిర్వహించడం సరైంది కాదంటూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ పూర్తయ్యేంత వరకు గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను వాయిదా వేయాలంటూ కోరారు. యూపీఎస్సీ వంటి సంస్థకు పరీక్ష నిర్వహణ బాధ్యతలను అప్పగించాలని పిటిషన్ దాఖలు చేశారు. వాటిపై హైకోర్టు న్యాయమూర్తి ఎం సుధీర్‌కుమార్ విచారణ జరిపారు. అన్ని జాగ్రత్తలతో పారదర్శకంగా గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు ఏర్పాటు చేసినట్టు అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 3,80,202 మంది పరీక్ష రాయనున్నారని, ఇప్పటికే లక్షన్నర మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 995 పరీక్షా కేంద్రాలను కూడా టీఎస్‌పీఎస్సీ సిద్ధం చేసిందని పేర్కొన్నారు. ఇంకోవైపు ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో సిట్ దర్యాప్తు చురుగ్గా కొనసాగుతున్నదని వివరించారు. త్వరలోనే చార్జీషీట్‌ను దాఖలు చేయనున్నట్టు తెలిపారు. కొంత మంది అభ్యంతరాల కోసం లక్షలాది మంది అభ్యర్థుల్లో గందరగోళం సృష్టించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు గ్రూప్–1 పరీక్షను వాయిదా వేసేందుకు నిరాకరిస్తూ పిటిషన్లను కొట్టేసింది.

అగ్రస్థానంలో ఐఐటీ మద్రాస్

నవతెలంగాణ–న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో అత్యుత్తమ ఉన్నత విద్యాసంస్థల జాబితాలో ఐఐటీ మద్రాస్ అగ్రస్థానంలో నిలిచింది. వరుసగా ఐదో సంవత్సరం ఐఐటీ మద్రాస్ మొదటి స్థానంలో నిలిచింది. రెండు, మూడు స్థానాల్లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సీ) బెంగళూరు, ఐఐటీ–ఢిల్లీ నిలిచాయి. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) కింద కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ రూపొందించిన ఇండియన్ ర్యాంకింగ్స్ రిపోర్టు–2023ను సోమవారం కేంద్ర విద్యా శాఖ సహాయ మంత్రి రాజ్‌కుమార్ రంజన్ సింగ్ విడుదల చేశారు.

టాప్ 10 విద్యా సంస్థలు (ఒవరల్)

ఐఐటీ మద్రాస్,ఐఐఎస్సీ బెంగళూరు,ఐఐటీ ఢిల్లీ,ఐఐటీ ముంబయి,

ఐఐటీ కాన్పూర్,ఎయిమ్స్ ఢిల్లీ, ఐఐటీ ఖరగ్‌పూర్, ఐఐటీ రూర్కీ

ఐఐటీ గౌహతి,జేఎన్‌యూ (ఢిల్లీ)

తెలంగాణలో నాలుగు, ఏపీలో రెండు

14 వ ర్యాంక్‌లో ఐఐటీ హైదరాబాద్, 20 వ ర్యాంక్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, 53 వ ర్యాంక్‌లో ఎన్ఐటీ వరంగల్, 64వ ర్యాంక్‌లో ఉస్మానియా యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ కి చెందిన కెఎల్ యూనివర్సిటీకి 50, ఆంధ్రా యూనివర్సిటీకి 74 వ ర్యాంక్‌లో నిలిచాయి.

టాప్ యూనివర్సిటీలు

బెంగుళూరులోని ఐఐఎస్సీ ఉత్తమ యూనివర్సిటీగా నిలిచింది. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. జాదవ్‌పూర్ యూనివర్సిటీ, బనారస్ హిందూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ) పదో స్థానంతో సరిపెట్టుకుంది.

ఆంధ్రప్రదేశ్ కి చెందిన కెఎల్ యూనివర్సిటీకి 28వ ర్యాంకు, ఆంధ్రా యూనివర్సిటీకి 43, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీకి 60, విజ్ఞాన యూనివర్సిటీకి 75 ర్యాంక్ వచ్చింది. తెలంగాణలో ఉస్మానియా యూనివర్సిటీకి 36, ట్రిపుల్ ఐటీ హైదారాబాద్ కి 84వ ర్యాంక్ వచ్చాయి.

టాప్ ఇంజనీరింగ్ సంస్థలు

ఇంజనీరింగ్ విభాగంలో మొదటి స్థానాన్ని ఐఐటీ (మద్రాస్) కైవసం చేసుకుంది. ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ ముంబయి రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. ఎనిమిదో స్థానంలో ఐఐటీ (హైదరాబాద్), 21వ స్థానంలో ఎన్ఐటీ (వరంగల్), 55వ ర్యాంక్‌లో ట్రిపుల్ ఐటీ (హైదరాబాద్), 71వ ర్యాంక్‌లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, 83వ ర్యాంక్‌లో జేఎన్‌టీయూ హైదరాబాద్, 98వ ర్యాంక్‌లో ఎస్ఆర్ యూనివర్సిటీ (వరంగల్) నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌లో కెఎల్ యూనివర్సిటీ 44, ఐఐటీ తిరుపతి 59, విజ్ఞాన్ యూనివర్సిటీ కి85, ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ 94వ ర్యాంక్‌లో నిలిచాయి.

టాప్ మేనేజ్‌మెంట్ సంస్థలు

మేనేజ్‌మెంట్ విభాగంలో ఐఐఎం అహ్మదాబాద్ తొలి స్థానంలో నిలిచింది. ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోజీకోడ్ రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. మెడికల్ విభాగంలో ఎయిమ్స్ ఢిల్లీ, మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (చండీగఢ్), క్రిస్టియన్ మెడికల్ కాలేజ్ (వెల్లూర్) మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఫార్మసీ విభాగంతో హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ మొదటి స్థానంలో నిలిచింది.

జామియా హమ్‌దర్ద్, బిట్స్ పిలానీ రెండో, మూడో స్థానాలు సాధించాయి. 22వ ర్యాంక్‌లో ఏయూ కాలేజీ ఆఫ్ ఫార్మసీ (విశాఖపట్నం) వచ్చింది.

న్యాయ విద్యలో బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ, ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని 'నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా' తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. కాగా ర్యాంకింగ్ కోసం గతేడాది 7,254 దరఖాస్తులు రాగా.. ఈ ఏడాది 8,686 దరఖాస్తులు వచ్చాయి.

బీజేపీ కుట్రలను తిప్పి కొట్టండి

(మొదటిపేజి తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టానికి రూ.73 వేల కోట్లు ఉన్న బడ్జెట్‌ను రూ.63 వేల కోట్లకు కోత విధించారని తెలిపారు. పని ప్రదేశంలో ఉదయం ఏడు గంటలకు ఒకసారి, సాయంత్రం ఐదు గంటలకు మరోసారి ఫొటో దించి.. వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తేనే చేసిన పనికి వేతనాలు ఇస్తామని చెప్పటం దుర్మార్గమైన చర్య అన్నారు. జాబ్ కార్డులు, బ్యాంక్ అకౌంట్లను ఆధార్ కార్డుకు లింక్ చేయాలనే నిర్ణయం సరైంది కాదన్నారు. చేసిన పనికి వారం రోజుల లోపల వేతనాలు చెల్లించాలని చట్టంలో ఉన్నా ఎక్కడా అమలు చేయడం లేదని ఆరోపించారు. చేసిన పనికి మూడు నెలలు, నాలుగు నెలలు వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. సిద్దిపేట జిల్లా కార్యదర్శి రాళ్ళబండి శశిధర్ మాట్లాడుతూ.. జిల్లాలో వేతనాలు వెంటనే చెల్లించాలని, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించి పనిముట్లు ఇవ్వాలన్నారు. 200 రోజుల పని దినాలు పెంచి, పని అడిగిన వెంటనే పని చూపించాలని, స్థానికంగా పేరుకుపోయిన సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించి ఉపాధి హామీని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొంగరి వెంకట్ మావో, నాయకులు వెంకట చారి, ఉల్లంపల్లి నరసవ్వ, చంద్రం ప్రమీల, రవి, శ్రీనివాస్ రెడ్డి,బ్రహ్మం, పెంటయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కార్మికుల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, భారతీయ కిసాన్ మజ్దూర్ యూనియన్ జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ.. వ్యవసాయం లేని వేసవిలో పేద కూలీలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ చట్టం రద్దు కోసం బీజేపీ ప్రయత్నిస్తుందని అన్నారు. ఇప్పటికే బెంగాల్, ఉత్తర భారత దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో రద్దు చేసిందని చెప్పారు. అనంతరం కలెక్టరేట్‌లో సూపరెంటెండెంట్ బి.వెంకటేశ్వరం ~వుకి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో జిల్లా కార్యదర్శి కడియాల మోహన్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాన్ని ఎత్తివేత కుట్రను అపకపోతే బీజేపీని గద్దె దించుతామని హెచ్చరించారు.

నిజామాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన అనంతనం అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు ఏశాల గంగాధర్, పెద్ది వెంకట్రాములు, నాయకులు పాల్గొన్నారు. వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటయ్య మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీల పెండింగ్ బకాయిలు చెల్లించాలని, పని ప్రదేశంలో తాగేనీరు, టెంట్, మెడికల్ కిట్ వంటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సాయిలు, సత్తయ్య, రఘురామ్, శేఖర్, లాలయ్య, లక్ష్మణ్, విజయ్, వెంకటయ్య, గోపాల్, ప్రభు, బాబు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగంలో తెలంగాణ టాప్

(మొదటిపేజి తరువాయి)

ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్‌రంగంలో అద్భుతాలు సృష్టించారని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యాపేట నియోజకవర్గ పరిధిలోని వట్టి ఖమ్మం పహాడ్ 400/220/132 సబ్ స్టేషన్ ప్రాంగణంలో విద్యుత్ విజయాలపై నిర్వహించిన విద్యుత్ ప్రగతి సభను టీఎస్ఎస్‌పీడీసీఎల్‌డీఈ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సబ్‌స్టేషన్ ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని మంత్రి ఆవిష్కరించి జ్యోతిప్రజ్వలన గావించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పాటుతో చీకట్లు మాయమయ్యాయన్నారు. ఉద్యమ సమయంలో నిండు సభలో.. రాష్ట్రం ఏర్పడితే చీకట్లో మగ్గుతారంటూ తెలంగాణ ప్రజల్లో గుబులు పుట్టించిన నాటి పాలకులే.. చీకట్లోకి పోయారన్నారు. రాష్ట్రం ఏర్పడిన రోజున కేవలం 7,778 మేగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండేదని, ఇప్పుడు ఆ ఉత్పత్తి 18,567 మేగావాట్లకు చేరుకోవడమే రాష్ట్ర ప్రభుత్వం సాధించిన అభివృద్ధికి నిదర్శనమన్నారు.ఇందులో గ్రామీణ ప్రాంతంలో పనిచేసే సిబ్బంది మొదలు యాజమాన్యాల వరకు అందరి శ్రమ ఉందని ప్రశంసించారు. యావత్ భారతదేశం నుంచి తెలంగాణకు విద్యుత్ ట్రాన్స్‌మిషన్‌కు తగిన వెసులుబాటు ఉందని తెలిపారు. 2014కు పూర్వం ఎందుకు 24 గంటల ఇవ్వలేక పోయారని, అది ఇప్పుడు ఎలా సాధ్యమైందన్న విషయంపై ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. 2014కు ముందు విద్యుత్ సంక్షోభంతో ఎండిపోయిన పంటపొలాలను చూసి తట్టుకోలేక రైతుల ఆత్మహత్యలు చేసుకున్నారని, క్రాప్ హాలిడేస్‌తో పారిశ్రామిక వేత్తలు రోడెక్కి ఆందోళనలతో అట్టుడికి పోయారని, ఇప్పుడు 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరాతో రాష్ట్రం ఎంతో ప్రగతి సాధించిందని తెలిపారు. సీఎం కేసీఆర్ తొమ్మిందేండ్లలో సాధించిన అభివృద్ధి ఏంటో అని విమర్శలు చేసే వారికి విద్యుత్‌రంగంలో సాధించిన విజయాలు చెంపపెట్టు లాంటిదన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీ వైస్‌చైర్మెన్ వెంకట్‌నారాయణగౌడ్, ఎంపీపీలు ధరావత్‌కుమారి, బాబునాయక్, రవీందర్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ జూలకంటి జీవన్‌రెడ్డి, ఎస్‌పీడీసీఎల్‌సీఈ పాల్‌రాజు, తహసీల్దార్ రంగారావు, ఎంపీడీఓ లక్ష్మీ,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు జూలకంటి సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ కలకొండ కరుణ, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం ఆగదు..

నవతెలంగాణ..న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ చీఫ్ బ్రిజ్ భూషణ్‌సింగ్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న భారత రెజ్లర్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిశారు. రాత్రి 11 గంటలకు ఢిల్లీలోని ఆయన నివాసంలో హోం మంత్రిని కలిసిన రెజ్లర్లు దాదాపు గంటపాటు సమావేశమయ్యారు. హోం మంత్రిని కలిసిన వారిలో రెజ్లర్లు భజరంగ్ పునియా, సాక్షి మాలిక్, సంగీతా ఫోగట్, సత్యవర్త్ కడియన్ ఉన్నారు. మైనర్‌తో సహా ఏడుగురు మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై నిష్పక్షిక విచారణ జరిపి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు డిమాండ్ చేశారు.

అయితే హోం మంత్రి అమిత్ షా వారికి సానుకూలంగా హామీ ఇవ్వలేదని రెజ్లర్లు తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని చెప్పినట్లు రెజ్లర్లు తెలిపారు. "ఉద్యమం ఆపేశామనే వార్త పూర్తిగా తప్పు. న్యాయం కోసం చేస్తున్న పోరాటంలో మేమేమీ వెనక్కు తగ్గలేదు. ఆందోళనతో పాటు రైల్వేలో నా బాధ్యతను నిర్వర్తిస్తున్నాను. న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది. దయచేసి ఎలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేయవద్దు" అని సాక్షి మాలిక్ అన్నారు. సత్యవర్త్ కడియన్ మాట్లాడుతూ తమకు హోంశాఖ మంత్రి నుంచి ఆశించిన ప్రతిస్పందన రాలేదని నిరాశ వ్యక్తం చేశారు. తాము కేంద్రమంత్రితో శనివారం రాత్రి భేటీ అయినట్లు బజంగ్ పునియా మీడియా వద్ద ధ్రువీకరించారు. అయితే, ప్రస్తుతానికి అంతకంటే తానేమీ చెప్పలేనని పేర్కొన్నారు. ఒలింపిక్ పతక విజేతలు సాక్షి మాలిక్, బజరంగ్ పునియా, వినేశ్ ఫోగాట్ రైల్వేలో తిరిగి విధుల్లో చేరారు.

ఉత్తమ ఆశాలను సన్మానించిన ఎంపీపీ



నవతెలంగాణ-ఘట్కేసర్ :
ఘట్కేసర్ మండల పరిషత్ ఆవరణలో మేడ్చల్ జిల్లాలో ఉత్తమ ఆశావర్కర్‌గా ఎదులాబాద్ గ్రామా నికి చెందిన మహాలక్ష్మిని ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి సన్మానించి అభినందనలు తెలియ జేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో డాక్టర్లు చేసే పని ఆశా వర్కర్లు చేస్తున్న సేవలను మరువ లేమన్నా రు. ప్రభుత్వ వారికి ఎటువంటి భద్రత లేకుండా కనీస వేతనం కూ డా ఇవ్వకుండా అన్ని రకాలుగా పనులను చేయించుకుంటూ ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్నదని ఆయన అన్నారు. ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించే వరకు తమ మద్దతు ఉంటుందని తెలియజేశారు.

ఆశా వర్కర్లకు ఎగ్జామ్ రద్దు చేయాలి



నవతెలంగాణ-కాప్రా
ఆశా వర్కర్లకు ఎగ్జామ్ రద్దు చేయాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ కోశాధికారి ఉన్ని కష్ణ డిమాండ్ చేశారు. జమ్మిగడ పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్ల ధర్నా సోమవారం నిర్వహించారు. ఈ ధర్నాకు యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి అధ్యక్షత వహించారు. ఆశాల ఎగ్జామ్స్ రద్దు చేయాలని, వారిని కార్మికులుగా గుర్తించాలని, రూ.18000 వేతనం చెల్లించాలని, వారిపై చేస్తున్న వేధింపులు అరికట్టాలన్నారు. వారికి ఇన్సూరెన్స్ కల్పించాలని, వారిపై అధికారుల వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. వారికి ఇచ్చే వేతనం మొత్తం ఇవ్వకుండా మాన్యువల్‌లో లేని పనులు కూడా చేపిస్తున్నారని ఇది వెంటనే మానుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తావని హెచ్చరించారు. ఈ ధర్నాలు ఉద్దేశిం చి సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశాలకు ఇన్సూరెన్స్ కల్పించాలని, ఈ .ఎస్. ఐ .పి ఎఫ్., ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపూర్ణ అభివృద్ధే లక్ష్యం : మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- చైతన్యపురి
ఆర్కేపురం డివిజన్ సంపూర్ణ అభివృద్ధే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొ న్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలో ఎన్టీఆర్‌నగర్, విష్ణుమూర్తి లైన్‌లో రూ.30 లక్షల నిధులతో నిర్మించే స్ట్రామ్‌వాటర్ డ్రైనేజీ పను లు, జనప్రియ గార్డెన్ కమ్యూనిటీ హాల్లో రూ.22.65లక్షలతో చేప ట్టిన పనులు ప్రారంభోత్సవం, సరోజినీనగర్ పార్కులో సీసీ కెమె రాలను, మంత్రి ప్రారంభించారు. అనంతరం క్రైస్తవ సంఘాల ఆధ్వ ర్యంలో నిర్వహించిన ఐక్య సభకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నూతనంగా మంజూరైన ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లు, లింకురోడ్లతో కనీవిని ఎరుగని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. నూతనంగా సూపర్ స్పెషాలిటీ ఆస్ప త్రితో ఈ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, కార్పొరేటర్ రాధ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేశ్, నియోజకవర్గ ప్రధాన కార్య దర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ చైర్మన్ గొడుగు శ్రీనివాస్, నియో జకవర్గ వర్కింగ్ మహిళా అధ్యక్షురాలు పటేల్ సునీ తారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్, రామాచారి, లింగ స్వామి గౌడ్,సాజీద్, పెంబర్తి శ్రీనివాస్, శ్యామ్ గుప్తా, వెంకటేష్ గౌడ్, శ్రీమన్నారాయణ, సరోజినీనగర్ కాలని అధ్యక్షుడు బి. భూపాల్ రెడ్డి, దినేశ్‌రెడ్డి, భిక్షపతి,మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొల్లంపల్లి మోహన్‌రావుకు నివాళులు

కార్యక్రమంలో పాల్గొన్న కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ-వనస్థలిపురం
భారతజాగృతి రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షులు సందీప్‌కుమార్ తండ్రి కీ.శే.బొల్లంపల్లి మోహన్ రావు (68) గత ఏప్రిల్ నెల 29వ తేదీన స్వర్గస్థులయ్యారు. విషయం తెలుసుకున్న శాసనమండలి సభ్యు రాలు, భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సోమవారం ఎల్బీనగర్ నియోజకవర్గం బిఎన్‌రెడ్డి నగర్ ఎన్‌జిఓస్ కాలనీలోని వారి నివాసానికి మోహన్‌రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థించారు. అనంతరం సందీప్ కుమార్ కుటుంభ సభ్యులను పరామర్శించి ప్రఘాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంలో ఎల్బీనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జీ ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, తెలంగాణ ఫుడ్ కార్పొరేషన్ చైర్మెన్ రాజీవ్ సాగర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్,హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సు జాతా నాయక్, మాజీ కార్పొరేటర్లు ముద్దగౌని లక్ష్మీ ప్రసన్న రామ్మోహన్ గౌడ్, జిట్టా రాజశేఖర్ రెడ్డి, సామ రమణారెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సోమ వారం మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 15వ డివిజన్‌లోని అంజి రెడ్డి కాలనీలో కంటి వెలుగు కా ర్యక్రమాన్ని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సి పల్ కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్ తో కలిసి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రఘునందన చారి, వైద్యాధికారులు నర్సింగ్ రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో హత్య



నవతెలంగాణ-హయత్ నగర్
మద్యం మత్తులో ఒకరిని హత్య చేసిన ఘటన పో చారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసు కుంది. యల్‌బి నగర్‌లో సీపీ క్యాంప్ కార్యాలయంలో రాచ కొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహాన్ సోమవారం వివరాలను మీడియా కు వెల్లడించారు. హత్య జరిగిన 8 గంటల్లో కేసుని ఛేదించినట్లు తెలిపారు. ధీరజ్ మండల్, శుషీల్ గోస్వామి ఇద్దరు బీహార్‌కు చెందిన వ్యక్తులు. బతుకు దెరువు కోసం పోచారం పరిధిలో ఉన్న చౌదరిగూడ గ్రామ పం చా యతీ పరిధిలోని సిమెంట్ బ్రిక్స్ తయారీ లో పనిచేస్తు న్నారు. ఈనెల 4న పోచారం ఐటి కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జోడిమెట్ల గండిమైస మ్మ గుడి దగ్గరలో ఇద్దరు మద్యం సేవించారు. మ ద్యం మత్తులో పాతకక్షలు మనసులో పెట్టు కొని సుశీల్ గోస్వామిని సిమెంట్ బ్రిక్స్‌తో ధీరాజ్ మండల్ తలపై మోదీ హత్య చేశాడు. స్థాని కు లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ద ర్యా ప్తు సమయంలో సోమవారం శుషీల్ హ త్య అనంతరం బీహార్‌కి పారిపోతుండగా ఘట్కే సర్ రైల్వేస్టేషన్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. నిం ది తున్ని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఆయన మల్కాజిగిరి డీసీపీ జానకీ, పోచారం ఇన్స్‌పెక్టర్ అశోక్‌రెడ్డిలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సరఫరా చేస్తున్న ముఠా అరెస్టు

- సీలేరు నుంచి షోలాపూర్ మహారాష్ట్రకు గంజాయి సరఫరా
- మాదక ద్రవ్యాలపై నిరంతరం నిఘా

దేవేందర్ సింగ్ చౌహాన్



నవతెలంగాణ-హయత్‌నగర్
సీలేరు నుండి,షోలాపూర్ మహారాష్ట్రకు గంజాయి సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర డ్రగ్స్, గంజాయి స్మగ్లింగ్ చేస్తు న్న ముఠాను చౌటుప్పల్, యాచారం పోలీసులతో మల్కా జిగిరి ఎస్ఓటీ పోలీసులుఅరెస్ట్ చేశారు. సోమవారం ఎల్‌బీ నగర్‌లో ఉన్న సీపీ క్యాంప్ కార్యాలయంలో నింది తుల వివ రాలను రాచకొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్ చౌహా న్ మీడియాకుతెలిపారు. రెండు కేసుల్లో కలిపి రూ. ఒకకోటి 15 లక్షల విలువజేసే 380కిలోల గంజాయిని స్వా ధీనం చేసుకున్నట్లు తెలిపారు.సీలేరు, కొత్తగూడెం,భద్రా చలం మీదుగా షోలపూర్ నుంచి మహారాష్ట్రకు సప్లయి చేస్తున్న ముఠా,సీలేరు నుంచి హైదరాబాద్ మీదుగా బు ల్డనా మహా రాష్ట్రకు చేరవేస్తున్న ముఠా వ్యక్తులను పోలీ సు లు అరెస్టు చేశారు.వారు హెూండా సిటీ కారులో ఫీరో జ్, దినేష్ సిం గ్, ఖాదర్‌లు ముందు ఉన్న కారును ఆపరేట్ చే స్తారు. ఆర్గ నైజర్లు ముందుడి ఫోన్‌ల ద్వారా వారు చేరవేసే గమ్యస్థా నా లను సైతం తెలియజేయకుండా వెళ్తుంటారు. ఆ సమ యంలో తమ సిబ్బంది చాలా పకడ్బందీగా పక్కా సమా చా రంతోవారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 4కార్లు, 9ఫోన్లు,3120నగదు స్వాధీనం చేసుకున్నా మన్నారు. మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం మోపు తాని హెచ్చరిం చా రు. యువత గంజాయి పట్ల జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట మ ల్కాజిగిరి డీసీపీ జానకి, ఎస్ ఓ టీ డీసీపీ గిరిధర్,యాచారం ఇన్స్పెక్టర్ లింగయ్య, మల్కా జిగిరి ఎస్ ఓ టీ ఇన్స్పెక్టర్ రాములు, చౌటుప్పల్ ఎస్ఐ సైదు లు,యాచారం ఎస్ఐ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారం కోసమే వృద్ధురాలి హత్య : డీసీపీ



నవతెలంగాణ-హయత్ నగర్
ఓ వృద్ధురాలిని హత్య చేసి ఆమె వద్ద ఉన్న బం గారు ఆభరణాలు అపహరణ చేసిన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం అబ్దు ల్లాపూర్ మెట్ మండలం లోని తోరుర్ గ్రామానికి చెం దిన కొంరెల్లి సతెమ్మ(82) ఒంటరిగా ఆమె తన ఇంట్లో నివాసం ఉం టున్నారు. ఆమెకు నలుగురు పిల్లలు. వారు వేరే వేరే ప్రాంతంలో స్థిరపడి నివాసం ఉంటున్నారు. 3న తన బంధువుల పెండ్లి ఉండడంతో వెళ్లి అక్కడి నుంచి వనస్థలి పురంలో తన కుమా రుడి ఇంట్లో ఉండి మరుసటి రోజు 4న తన స్వగ్రామం అయిన తోరుర్‌కు వచ్చింది. రాత్రి 11 గం టల సమ యంలో కొందరు గుర్తు తెలియని దుం డగులు ఆమెను హత్య చేసి ఆమె వద్ద ఉన్న సుమారు21 తులాల బంగారు ఆభరం ణాలు అపహరించి పారిపో యారు. సమా చారం అందుకుని ఘటన స్థలానికి రాచ కొండ పోలీస్ కమిషనర్ దేవేందర్ సింగ్‌చౌహాన్ చేరుకుని అక్కడ ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి నింది తులను పట్టుకున్నారు. ఏండ్ల రాకేష్ ఇతని స్వస్థలం నారాయణపేట్ జిల్లా, దామ రగిడ్డ గ్రామం, మహబూబబాద్ జిల్లాకు చెందిన గుండ పాటిలలితా గత కొంతకాలంగా తోరూర్‌లో సహజీవనం సాగిస్తూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మృతురాలి సతెమ్మ ఇంట్లో అద్దెకు వుంటుం డడంతో ఆమె ఒంటికి ఉన్న బంగా రంపై కన్ను పడింది. 4న ఆమె నిద్రి స్తున్న సమయంలో రాకేష్ దిండును వృద్ధురాలి మొహంపై పెట్టి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. అనంతరం ఆమె మెడలో ఉన్న 23 తులాల బంగారం తీసుకుని అక్కడి నుంచి పరార య్యాడు. ఫిర్యాదు అందినా 4గంటల్లో నింది తులను అదుపు లోకి తీసుకుని వారి వద్ద నుండి 23తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకుని వారి రిమాండ్‌కు తరలిం చారు. వెంట ఎస్‌ఓటీ డీసీపీ మురళీధర్, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డి,ఎస్ ఓ టీ ఏసీపీ వెంకన్న,హయత్ నగర్ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, క్రైమ్ ఇన్స్‌పెక్టర్ నిరంజన్, ఎస్ఐ శ్రీనివాస్‌రావు, సిబ్బంది కరుణాకర్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులు విద్యార్థులకు మేలు

డైరెక్టర్ చక్రిజాక్సన్



నవతెలంగాణ-చైతన్యపురి
సమ్మర్ క్యాంపులతో విద్యార్థులకు ఎంతో మేలని కొత్తపెట్‌లో గల మూన్‌వాకర్ డాన్స్ స్టూడియో డైరెక్టర్ చక్రి జాక్సన్ అన్నారు. సోమవారం స మ్మర్ క్యాంప్ క్లోజింగ్ సెర్మనీ ఈవెం ట్‌ను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూన్ వాకర్ డాన్స్ స్టూడియో ప్రారం భించి 10 సంవత్స రాలు గడిచిందని, ప్రతి సంవత్సరం సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించి విద్యార్థులకు వివిధ రకాల డ్యాన్సులను నేర్పిస్తున్నట్లు తెలిపారు. వేసవికాలంలో విద్యార్థులకు వాళ్ల టాలెంట్ అని గుర్తించి తగిన శిక్షణ ఇస్తే వారు ఏదో ఒక రంగంలో రాణిస్తారనిన్నారు. ప్రతినిత్యం పుస్తకాలతో కుస్తీ పడే విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం



నవతెలంగాణ-బడంగ్‌పేట్
మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ గ్రామానికి చెందిన కొమ్ము అర్జున్ ఇటీవలే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పీసీసీ సెక్రెటరీ ఎల్మేటి అమరేం దర్ రెడ్డి మానవతా హృదయంతో కొమ్ము అర్జున్ భార్య యాదమ్మ కుటుంబాన్ని పరామర్శించి వారికి రూ. రూ.20, 000వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా బాలాపూర్ లోని నల్లపూ సల లక్ష్మణ్ కొద్ది రోజుల క్రితం మృతిచెందారు. లక్ష్మణ్ భార్య సంధ్యకు రూ.15000వేల ఆర్థిక సాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో వంగేటి మధు సూదన్ రెడ్డి, తిమ్మని సుధాకర్, అశోక్, క్యారగారి సంజీవ,అంజయ్య, గిరి, లక్ష్మయ్య, బిక్షపతి, నల్లపూసల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు తప్పనిసరి

కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్
అర్హత కలిగిన, 18సంత్సరాలు నిండిన యువతి, యువకులు ప్రతి ఒక్కరు కొత్త ఓటరు గుర్తింపు కార్డును నమోదు చేసుకోవాలని కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి అన్నారు. సోమ వారం మహేశ్వరం నియో జకవర్గం బడంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 24డివిజన్‌లో కార్పొరేటర్ ఏనుగు రామిరెడ్డి చేతు ల మీదుగా ఓటర్ కార్డు కొత్త ఓటర్ కార్డులను 150 మందికి పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రజాస్వామిక వ్యవస్థలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వాన్ని మార్పు చేసే అవకాశం నేటి యువత చేతిలోనే ఉందన్నారు. 18సంత్సరాలు నిం డిన యువతి యువకులు ప్రతి ఒక్కరు విధిగా ఓటరు గుర్తింపు కార్డును నమోదు చేసుకోవాలని కోరా రు.ఈ కార్యక్రమంలో పలు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ యానం మధుసూదన్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో
విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని, విద్యార్థులతో క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖ రాలను అధి రోహించాలని కృష్ణవేణి జూని యర్ కళాశాల కరెస్పాండెంట్ అండ్ ప్రిన్సి పాల్ యానం మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం ఎల్బీనగర్ నియోజకవర్గం బి.యన్.రెడ్డి శ్రీపురం కాలనీ సాగర్ కాంప్లెక్స్ కృష్ణవేణి జూనియర్ కళాశాల ఐఐటి అండ్ మెడికల్ అకాడమిక్ కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ యానం మధు సూదన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా ఉత్తమ ప్రతిభ కనబరచాలని తెలియజేశారు. విద్యా ర్థులందరికీ తనవంతు సహాయం ఎప్పటికి ఉంటుందని తెలిపారు. చదువులు నాణ్యత సమాజ అభివృద్ధి కోసం రాబోయే తరాలకు విద్యార్థులు అభివృద్ధి చెందాలంటే ఉత్తమ విద్యను అందించినప్పుడే విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు అన్నారు. ఎక్కడ లేని విధంగా ఐఐటి అండ్ మెడికల్ అకాడమిక్ ఏ కార్పొరేటర్ కళాశా లలో లేని విధంగా చదువు పిల్లలకు అందిస్తు న్నామన్నారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు ఇంటర్మీ డియట్‌లో రాబోయే తరాలకు గుర్తింపు ఉండాలంటే కష్టపడి తత్వం ఉండి నాణ్యత మైన విద్యను అందించినప్పుడే బేసికల్గా విద్యార్థులు అర్థమయ్యేలా ఉండాలన్నారు. పలువురు విద్యార్థులందరూ కృష్ణవేణి జూనియర్ కళాశాలలో అడ్మిషన్ కావాలని విద్యార్థు లకు కరస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ యానం మధు సూదన్‌రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-ఘట్కేసర్
ఘట్కేసర్ మున్సిపల్‌కు చెందిన టి.సునీతకి అనారోగ్య సమస్య వల్ల ఆస్పత్రిలో చికిత్స అయ్యే ఖర్చు నిమిత్తం సీఎం రిలీఫ్‌కి దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం ఆమెకు మంజూరైన రూ.60.000/- చెక్కును ఘట్కేసర్ మున్సి పాలిటీ వైస్ చైర్మెన్ పలుగుల మాధవ్ రెడ్డిలి సోమవారం లబ్దిదారునికి అందజ శారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రిలీఫ్ ఫండ్ ఎంతోమంది పేదలు ఈ పథకాన్ని సద్విని యోగపరుచుకుంటున్నారని ఆయన తెలిపారు ఈ కార్యక్ర మంలో కౌన్సిలర్ బండారి ఆంజనేయులు గౌడ్, బేతాళ నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

కన్న తల్లిని రోడ్డుపై వదిలేసిన కసాయి కొడుకు

- వృద్ధాశ్రమంలో చేర్చిన మేడిపల్లి పోలీసులు



నవతెలంగాణ-బోడుప్పల్:
నవమాసాల మోసి, కని,పెంచిన కన్నతల్లికి వృద్ధా ప్యం లో అండగా నిలవాల్సిన కొడుకు తల్లిని రోడ్డు పై వది లేశా డు. ఆ తల్లి దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటు ఐదు రో జులుగా రోడ్డుపై ఉంటూ పలువురు చుట్టు పక్కల వారు అందించే ఆహారంతో కడుపు నింపుకుంటుంది ఓ అభాగ్యు రాలు. ఐదురోజులుగా అనాథగా ఉన్నా ఆ తల్లిని స్థాని కులు మేడిపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అవృద్ధురాలి వివ రాలు సేకరించిన పోలిసులు అమెను ఓ వృద్ధాశ్రమానికి తరలించారు.సదరు వృద్ధురాలిని పలకరించగా తనది చార్మి నార్ దారులుషిఫా ప్రాంతమని, ఆమె పేరు బంగారి బూధ మ్మ,భర్త దుర్గయ్య అని వివరాలు తెలిపింది. గతం లో బల్ది యాలో పేయింటర్‌గా పనిచేసిన ఒక కుమారుడు ఉన్నాడని తెలిపింది. తన భర్త మరణించిన తర్వాత తనకు ఈ బా ధలు మొదలయ్యాయని, తన కుమారుడు ఓ వృద్ధాశ్రమంలో చేర్పిం చాడని, తనకు వచ్చే పింఛన్ డబ్బుల కోసం వచ్చి న న్ను తీసుకెళ్ళి తన వద్ద డబ్బులు తీసుకొని ఇలా రోడ్లపై వదిలిపెట్టి వెళ్తాడని కన్నీళ్ళు పెట్టుకొంది. సమా చారం అం దుకున్న మేడిపల్లి పోలీసులు నడవలేని స్థితిలో ఉన్న వృద్ధు రాలిని బోడుప్పల్‌లోని ఓ అనాథశ్రమంలో చేర్పించారు.

ప్రతిసారీ ఇదే తంతూ....

సదరు వృద్ధురాలు ఆశ్రయం ఉంటున్న వృద్ధాశ్రమం నిర్వహకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ బూధ మ్మ గత కొన్ని సంవత్సరాల నుండి తమ ఆశ్రమంలో ఉంటుందని, అమె కుమారుడు అమెకు వచ్చే పింఛన్ డబ్బులు చేతిలో పడగానే అమెను ఎక్కడో ఒక రోడ్డుపై వదిలేయడం ప్రతి సారీ జరుగుతుందని, మేం అనేక సార్లు హెచ్చరించిన అత నిలోమార్పురావాడం లేదని, ఈసారి అతను ఆశ్రమం పరిస రాల్లోకి వస్తే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపింది.

తుల్జా భవాని శక్తిపీట్ ఆలయాన్ని దర్శించిన ఉప్పల శ్రీనివాస్ గుప్త దంపతులు





నవతెలంగాణ- నాగోల్
సోమవారం మహారాష్ట్ర రాష్ట్రం, తుల్జాపూర్‌లోని తుల్జా భవాని శక్తిపీట్ ఆలయంలో అమ్మవారిని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఉప్పల ఫౌండేషన్ చైర్మన్ ఐవీఎఫ్ జాతీయ కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త, స్వప్న దంపతులు సకుటుంబ సమేతంగా దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టూరిజం పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ రాష్ట్రంలో బం గారు తెలం గాణ కోసం బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో సుఖ సంతో షాలతో జీవించాలని, దేశ ప్రజలు, రాష్ట్ర ప్రజలు అంతా సు ఖ సంతోషాలతో ఉండాలని రైతులు అంతా పాడి పంటలతో విలసిల్లాలని,ప్రజలందరూ ఆనందంగా వుండాలని అమ్మ వారిని కోరుకున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధం గా రైతుబంధు, దళితబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, బీసీలు, ఎస్సీలు, ఎస్టీల కోసం ఓబీసీ ల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాలకు సమాన న్యాయం చేస్తున్నారని పేర్కొన్నారు.

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను రక్షించాలి

- రెవిన్యూ అధికారుల అవినీతిని అరికట్టాలి
- దళిత బహుజన ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా



నవతెలంగాణ-హయత్ నగర్
హయత్‌నగర్ మండలంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను రక్షించాలని, రెవిన్యూ అధికారుల అవినీతిని అరికట్టాలని, దళిత బహు జన ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాల యం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీ ల్దార్ సంధ్యారాణికి మెమోరాండం అందజేశారు. ఈ సంద ర్భంగా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పారంద స్వామి, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు ఏర్పుల నరసింహలు మాట్లాడుతూ హయత్ నగర్ మండలంలో జీవో నెంబర్, 58,59,118 ఆధారం చేసుకుని రియల్ ఎస్టేట్ మాఫియాతో రెవిన్యూ అధికారులు కుమ్మక్కై మండలంలో 70 ఎకరాలు దాదాపు 300 కోట్ల విలువైన ప్రభుత్వ భూ ములను, కబ్జా చేసి దొంగ నోటరీ డాక్యు మెంట్ సృష్టించి, రెగ్యులరైజేషన్ కోసం, ఆన్లైన్ దరఖాస్తులు పెట్టికున్నారని, రెవెన్యూ అధికారులు, ఒక్క డాక్యుమెం ట్ దారుల దగ్గర, రెండు లక్షల నుండి రూ.5 లక్షల వరకు డిమాండ్ చేస్తూ తీసుకుంటున్నారన్నారు. ఎవరైనా డబ్బులు ఇవ్వక పోతే వారి ఇళ్లలను కూల్చివేసి భయభ్రాంతులకు గురి చేసి డబ్బులు వసూలు చేస్తున్నారని, సాహెబ్ నగర్ కలాన్ సర్వే నెంబర్ 71/1లో రెవెన్యూ అధికారులే 11 ఇల్లు కట్టుకు న్నారని భారీ ప్రచారంలో ఉంది. సర్వేనెంబర్, 71/2,71/3 భూమిలో 118 జీవోను ఆధారం చేసుకుని, సర్వేనెంబర్ 71/1 బదు లు, సర్వేనెంబర్ 71/2,71/3తో వస్పరి జంగయ్య పేరుతో దొంగ నోటరీ సర్టిఫికెట్లు సృ ష్టించి, ఇల్లు కట్టుకొని ఆన్లైన్ దరఖాస్తు పెట్టుకున్నారన్నారు, దాదాపుగా 5ఎకరాలు ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు అమ్ముకుంటున్నారు, బాగ్ హయత్ నగర్, సర్వేనెంబర్ 207 లో ప్రభుత్వ భూమి 15 ఎకరాలు, గతంలోనే అసైన్మెంట్ దా రుల నుండి పిఒపి కింద ఈ భూమిని ప్రభుత్వం తీసు కుందని గుర్తు చేశారు.అ భూమిలో ప్రస్తుతం, రియల్ ఏస్టేట్ వ్యాపారస్తులు విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలు చేస్తు న్న, రెవెన్యూ అధికారులు ఇది ఖరీదైన భూమి కాబట్టి ఒక్క ఫ్లాట్ దారులు దగ్గర మూడు లక్షల నుండి 5 లక్షల రూపాయలు ఇచ్చిన వారికే రెగ్యులరైజేషన్ చేస్తామని, ఎవరైనా డబ్బులు ఇవ్వకపోతే వారి దగ్గరికి వెళ్లి వారి నిర్మా ణాలను కూల్చివేసి, అదనంగా డబ్బులు వసూలు చేస్తు న్నారు. హయత్ నగర్ మండలంలో ఈ జీవో లా పేరుతో ప్రభు త్వ భూమి అంటూ లేకుండా, రెవిన్యూ అధికారులు ప్రజా ప్రతినిధులు స్థానిక ఎమ్మెల్యే తో పాటు కుమ్మక్కై విచ్చలవిడిగా లక్షల కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూ ములను, కబ్జాలు చేసి ఇల్లు నిర్మిం చుకుంటున్నారని, కావున సాహెబ్ నగర్ కలాన్, సర్వే నెంబర్ 71/2,71/3 లో జీవో నెంబర్ 118 పేరుతో పెట్టు కుంటున్న ఆన్‌లైన్ దరఖాస్తులను, పరిశీలించి, ఆ భూమిని సర్వే చేసి ప్రభుత్వ భూమిని బయటికి తీసేంతవరకు వారి రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల ప్రజా ఉద్యమాలు చేసి దీనికి కారణమైన అధికా రులను సస్పెండ్ చేసేంతవరకు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరి ంచారు. కేవీపీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్య క్షులు కనకయ్య, ప్రభాకర్, దళిత నాయ కులు వైఎస్ఆర్పీ నాయకులు బోడ శ్రావణ్ కుమార్, చుక్క రవి, గుండె శివ కుమార్, రసూల్, సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి



- ఎల్బీనగర్ బీఆర్ఎస్ అరాచకాలను రూపుమాపాలి
- కాంగ్రెస్ కార్పొరేటర్‌పై భౌతికదాడి చేసిన నిందితులను అదుపులోకి తీసుకోవాలి
- వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ముందు కాంగ్రెస్ శ్రేణులు బైఠాయించి ధర్నా

నవతెలంగాణ-వనస్థలిపురం
ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అరా చకాలను రూపుమాపాలని, భౌతిక దాడులకు పూనుకుంటు న్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అనుచరులను వెంటనే అరె స్టు చేసి, ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలని సోమవారం వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ముందు పెద్ద ఎత్తున కా ంగ్రెస్ శ్రేణులు బైఠాయించి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. మ న్సురాబాద్ ఎంఈరెడ్డి గార్డెన్‌లో విద్యుత్‌శాఖ నిర్వహించి న దశాబ్ది ఉత్సవాలలో ఎమ్మెల్యే ప్రసంగం అనంతరం కాంగ్రెస్ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి మైక్ అడగడంతో ఇవ్వ కుండా గొడవ దారితీసింది. దీంతో ఎమ్మెల్యే అనుచ రు లు కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డిపై కాకుండా అతని అను చరు డు ప్రవీణ్‌రెడ్డిపై దాడికి పూనుకున్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణు లు వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌కి చేరుకుని జరిగిన సంఘటన లిఖితపూర్వకంగా రాసి వనస్థలిపురం సీఐ జలం ధర్‌రెడ్డికి అందజేశారు. వెంటనే ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి ఎమ్మెల్యే అనుచరులను అదుపులోకి తీసుకో వాలని వనస్థలిపురం పోలీస్ స్టేషన్ ముందు ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మల్‌రెడ్డి రామిరెడ్డి నేతృత్వంలో బైఠాయించి ధర్నా చేశారు. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీ ఇచ్చేంతవరకు ధర్నా విరమించేది లేదని పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించారు. దీంతో బీజేపీ కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వరరెడ్డి, లచ్చిరెడ్డి, వంగ మధు సూదన్ రెడ్డి, కళ్లెం నవజీవన్ రెడ్డిలు మద్దతు పలికారు. పోలీస్ స్టేషన్ ముందు సుమారు నాలుగు గంటల పాటు ధర్నా కొనసాగింది. ఈ ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డి, రమేష్ రెడ్డి, రామ కృష్ణా రెడ్డి, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు ఎగ్జామ్ రద్దు చేయాలి



నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్

ఆశా వర్కర్ల ఎగ్జామ్ రద్దు చేయాలని ,కనీస వేతనం రూ. 18 వేలు చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కీసర పీహెచ్‌సీ వద్ద యూనియన్ జిల్లా నాయకురాలు జయప్రద ఆధ్వర్యంలో ఆశా వర్కర్‌ల ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆశాల ఎగ్జామ్స్ రద్దు చేయాలని ,ఆశాలను కార్మికులుగా గుర్తించి ,రూ 18000 వేతనం చెల్లించాలన్నారు. అలాగే ఆశాలపై వేధింపులు అరికట్టాలని, వారికి ఇన్సూరెన్స్ కల్పించాలని, ఆశా కార్యకర్తలను వర్క్ పేరు మీద వేధిస్తున్నారని వెంటనే అది ఆపాలని డిమాండ్ చేశారు. వారికి ఇచ్చే వేతనం మొత్తం ఇవ్వకుండా మాన్యువల్‌లో లేని పనులు కూడా చేయిస్తున్నారని, ఇది వెంటనే మానుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ కోశాధికారి ఉన్ని కృష్ణ మాట్లాడుతూ ఆశాలకు ఇన్సూరెన్స్ కల్పించాలని, ఈ.ఎస్.ఐ .పి ఎఫ్., ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాధా మంగమ్మ , కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్వాల్ పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్ల ధర్నా



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ఆశా వర్కర్ల ఎగ్జామ్ రద్దు చేయాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా కమిటీ కోశాధికారి కె.ఉన్ని కృష్ణన్ డిమాండ్ చేశారు. సోమవారం నేరెడ్‌మెట్, అల్వాల్ పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లు నిర్వహించిన ధర్నా లో ఆయన పాల్గొన్నారు. యూని యన్ జిల్లా అధ్యక్షురాలు ఏ. హేమలత అధ్యక్షతన జరిగిన ఈ ధర్నా నుద్దేశించి కె.ఉన్ని కృష్ణన్ మాట్లాడుతూ...ఆశాల ఎగ్జామ్స్ రద్దు చేయాలని, ఆశాలను కార్మికులుగా గుర్తించి వారికి నెలకు రూ. 18000 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్. శ్రీనివాస్, సుమలత, వాసంతి, రాధ, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఒకే గొడుగు కిందకు సేవలు

- వివిధ శాఖల సమన్వయంతో జలమండలి ముందడుగు
- ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసిన జలమండలి అధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ నగర వాసుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం త్వరలో వార్డు వ్యవస్థను అందుబాటులోకి తీసుకొస్తున్న విషయం తెలిసిందే. ప్రతీ 50 వేల మంది జనాభాకు ఒక వార్డు ఏర్పాటు కానుంది. అన్ని శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను ప్రజలు ఒకే చోట ఇచ్చేందుకు దీన్ని తీసుకొస్తుంది. ఇందులో భాగంగా తాగునీటి సరఫరా, మురుగునీటి నిర్వహణకు సంబంధించి జలమండలి నుంచి ఒక వార్డు అసిస్టెంట్‌ను ఎంపిక చేశారు. వార్డు అసిస్టెంట్‌లు బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యను అక్కడికక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోనున్నారు. ఎప్పటికప్పుడు పై అధికారులకు రిపోర్టు చేయనున్నారు. ఇప్పటికే వార్డు అసిస్టెంట్ల విధి విధానాలు, చేయాల్సిన పనులు తదితర 8 అంశాలతో కూడిన ప్రణాళికలకు సిద్ధం చేశారు. వార్డు అసిస్టెంట్లు చేసే పనితీరుతో జలమండలి నగర వాసులకు మరింత చేరువయ్యే అవకాశముంది.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం, సమర్థవంతమైన ప్రజా పరిపాలన అందించాలని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ ఆలోచన మేరకు వార్డ్ ఆఫీసుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జలమండలి అధికారులు సైతం అప్రమత్తమయ్యారు. తీసుకోవాల్సిన చర్యలను చేపట్టారు. ముఖ్యంగా ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించేవిధంగా, వార్డు కార్యాలయాల్లో మిగితా అధికారులతో సమన్వయంతో ముందుకెళ్లేవిధంగా జలమండలి ఎండీ దానకిషోర్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా తాగునీటి సరఫరాతోపాటు సీవరేజీ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా 8 అంశాలతోకూడిన ప్రణాళికలను వార్డు అసిస్టెంట్లకు అప్పగించారు. ఇప్పటికే వివిధ వార్డుల్లో పని చేయడానికి ఎంపిక చేసిన అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ అందించారు. ఈడీ డా.ఎం.సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబుతో పాటు సీజీఎంలు, డైరెక్టర్ల సమక్షంలో వివిధ అంశాలపై వార్డు అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. వార్డు కార్యాలయాల్లో వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యంగా వార్డు అసిస్టెంట్లు పనిచేసే విధంగా వారిని సిద్ధం చేశారు. జలమండలికి ఇప్పటికే కస్టమర్ కేర్ సెంటర్, ఆన్‌లైన్‌లో, ట్విటర్‌తో పాటు తదితర సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదు అందుతున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సిబ్బంది కృషి చేస్తోంది. అయినా ప్రజల్లో కాస్త అసంతృప్తి నెలకొంది. అయితే తాజాగా వార్డు కార్యాలయాలు అందుబాటులోకి వస్తుండడంతో అందుకు తగ్గట్టుగా జలమండలి ఆధ్వర్యంలో నగర వాసులకు మరింత సేవలందించే విధంగా అన్ని చర్యలు తీసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత సెక్షన్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లడంతోపాటు ఫిర్యాదులను ఎంసీసీలో నమోదు చేసి, ఆ సమస్య పరిష్కారం అయ్యేంత వరకు ఎప్పటి కప్పుడు ఫిర్యాదుదారులకు సమాచారం అందించనున్నారు. ముఖ్యంగా వార్డు స్థాయిలో నమోదయ్యే తాగునీటి, సీవరేజీ సమస్యలపై క్షేత్ర స్థాయిలో ఇతర శాఖల సమన్వయం చేసుకుంటూ త్వరితగతిని పరిష్కరించడానికి కృషి చేయనున్నారు.

వార్డు అసిస్టెంట్లు చేయాల్సిన విధానాలు

- వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులు స్వీకరించాలి.
- వాటిని కంప్యూటర్ లో నమోదు చేయాలి.
- ఆ ఫిర్యాదులను సంబంధిత మేనేజర్ దష్టికి తీసుకెళ్లాలి.
- తరువాత వాటిని ఫాలో అప్ చేసుకోవాలి.
- మేనేజర్ నుంచి యాక్షన్ టేకెన్ రిపోర్టు తీసుకోవాలి.
- ఆ రిపోర్టును కంప్యూటర్ లో నమోదు చేయాలి.
- ఫిర్యాదు పరిష్కారం గురించి సంబంధిత వినియోగదారులకు సమాచారం అందజేయాలి
- ఫిర్యాదు పరిష్కారానికి సంబంధించి సమ్మరీ షీట్ తయారు చేసి మేనేజర్, వార్డు అధికారికి అందజేయాలి

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులతో డైరెక్టర్ చర్చలు సఫలం

- పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తున్నట్టు ప్రకటించిన నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ)



నవతెలంగాణ-బంజారాహిల్స్

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు గతంలో నిమ్స్ యాజమాన్యం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఏప్రిల్ 17వ తేదీ నుంచి నిరవధికంగా పోరాటం కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. అయితే సోమవారం నిమ్స్ యాజమాన్య హామీతో నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికుల పోరాటాన్ని తాత్కాలికంగా విరమించారు. ముందుగా నిమ్స్ యాజమాన్యం మొండివైఖరికి నిరసనగా నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం చలో ప్రగతి భవన్‌కు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో యూనియన్ నాయకత్వాన్ని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప చర్చలకు పిలిచారు. యాజమాన్యం తరపున డిప్యూటీ సూపరింటెండెంట్ లక్ష్మీ భాస్కర్, పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ హరిచంద్ర రెడ్డిలు చర్చల్లో భాగస్వాములై ప్రస్తుతం ప్రధాన సమస్యల గురించి చర్చించారు.రిటైర్డ్ అయిన కార్మికులకు ఉచితంగా వైద్య సౌకర్యం నిమ్స్ హాస్పటల్‌లో అందించడం అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే 2023 ఏప్రిల్ నుంచి పెరిగిన 74 వీడీఏ పాయింట్లు అమలు చేయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నయన్నారు. కొంత సమయం కావాలని అడిగారు. వీరితో పాటు సెమీ స్కిల్డ్ ఉద్యోగులకు కూడా వేతనాలు పెంచడం కోసం ప్రయత్నాలు జరుగుతు న్నాయని తెలిపారు. కార్మికులకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాలను లక్ష్మీ భాస్కర్ కార్మికుల సమక్షంలో జనరల్ బాడీ సమావేశంలో ప్రకటించారు.

అనంతరం నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అధ్యక్షులు ఎం వెంకటేష్ మాట్లాడుతూ ప్రస్తుతం చేస్తున్న పోరాటాన్ని నిమ్స్ డైరెక్టర్ హామీ మేరకు తాత్కాలికంగా విరమిస్తున్నామని ప్రకటించారు. గతంలో ఇచ్చిన హామీని అమలు చేయని కారణంగానే కార్మికులందరూ పోరాటబాట పట్టారని తెలిపారు. మరోసారి కార్మికులను మోసం చేయాలని చూస్తే పోరాటం మరింత ఉధృతం అవుతుందని హెచ్చరించారు. నిమ్స్ హాస్పిటల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ హౌస్ కీపింగ్ కార్మికులలో చదువుకున్న అర్హత కలిగిన వారికి సెమీ స్కిల్డ్ ఉద్యోగులుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు జె. కుమారస్వామి మాట్లాడుతూ నిమ్స్ డైరెక్టర్ ఇచ్చిన హామీలను అమలు చేయించు కోవడం కోసం ఎలాంటి పోరాటానికైనా కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపుని చ్చారు. సీఐటీయూ పోరాటాల వల్లనే ఈ పాటి హక్కులు సాధించుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర నాయకులు కె.అజయ్ బాబు, సీ మల్లేష్, ఆర్. వాణి, పి.మల్లేష్, పి పుల్లారావు,ప్రధాన కార్యదర్శి ఈ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం ఏర్పడితే అంధకారంలో ఉండాలని ఎగతాళి చేశారు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మల్టి పర్పస్ ఫంక్షన్ హాల్‌లో సికింద్రాబాద్ సర్కిల్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రగతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా విద్యుత్ ఉద్యోగులు మంత్రికి బతుకమ్మ లతో స్వాగతం పలికారు. సమావేశానికి ముందుగా రాష్ట్ర ఆవిర్భావంకు ముందు విద్యుత్ పరిస్థితి, రాష్ట్రం ఏర్పడిన తర్వాత సాధించిన ప్రగతిని వివరించే ప్రత్యేక డాక్యుమెంటరీని విద్యుత్ అధికారులు ప్రదర్శించారు ప్రదర్శించారు. అనంతరం మంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆలోచనా, విధానాలతో దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే వివిధ రంగాలకు 24 గంటల పాటు విద్యుత్ సరఫరా జరుగుతుందని అన్నారు. వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రజకులకు సబ్సిడీ పై విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. విద్యుత్ శాఖలోని ఉద్యోగులు, సిబ్బంది కృషి తోనే ఇది సాధ్యమైందని మంత్రి వారిని ప్రశంసించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే అంధకారంలో ఉండాలని ఎగతాళి చేశారని, వాటిని కొట్టి పారేస్తూ అనేక వ్యయ ప్రయాసలకోర్చి విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయడం జరిగిందని వివరించారు సౌర విద్యుదుత్పత్తిలో తెలంగాణ దేశంలో అగ్రభాగాన నిలిచిందన్నారు. సంస్థలో నష్టాలను నివారించుకోవడం, అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టడం, విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడం వంటివి ముఖ్యమంత్రి ఆదేశాలతో అనుసరించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవడం జరిగిందని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలు విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసే విషయాన్ని పట్టించుకోలేదని, కనీసం ఆలోచన కూడా చేయలేదని విమర్శించారు. దాంతో పవర్ హాలిడే ప్రకటించారని, గుర్తుచేశారు. ఏదైనా చేయాలనే సంకల్పం, పట్టుదల ఉండాలని ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ ఉందని 9 సంవత్సరాలలో జరిగిన అనేక అభివృద్ధి కార్యక్రమాలే నిదర్శనం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మెన్‌లు గజ్జెల నగేష్, మన్నె క్రిశాంక్, సికింద్రాబాద్, సనత్ నగర్, కంటోన్మెంట్ ప్రాంతాలకు చెందిన విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షల్లో జవహర్ నగర్ ఆర్చిడ్స్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-జవహర్‌నగర్



పి. వాసవి



ఎస్. రాణి ప్రసన్న

జవహర్ నగర్‌లోని ఆర్చిడ్స్ కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం కొనసాగించారని ప్రిన్సిపాల్ కర్నాటి కవిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 66 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పి. వాసవి 10/10. ఎస్. రాణి ప్రసన్న 9.8 జీపీఏ సాధించగా 11 మంది విద్యార్థులు 9.0. పైన జీపీఏ, సాధించారని తెలిపారు. క్రమశిక్షణకు మారు పేరుగా, ఉత్తమ విలువలతో చక్కటి విద్యాబోధన అందిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించాలని కరెస్పాండెంట్ కర్నాటి మధు ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ ఓ వరం

- కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్



సీఎంఆర్ఎఫ్ పేదలకు ఓ వరమని నేరేడ్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ శ్రీ కాలనీకి చెందిన చంద్రశేఖర్‌కు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ రూ 1. 50,000 పత్రాన్ని సోమవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ అందచేశారు. మల్కాజిగిరి సర్కిల్ వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్ రెడ్డి, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం

- ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి

నవతెలంగాణ-కాప్రా



తెలంగాణ వచ్చిన తర్వాత మిగులు విద్యుత్‌తో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గ విద్యుత్ ప్రగతి పై మల్లాపూర్ నోమ కల్యాణ వేదిక ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిని వివరించారు. నాడు తెలంగాణ రాక ముందుకు కరెంటు లేక పవర్ హాలిడేస్ ప్రకటించే దష్టికి ఉండేదని.. నేడు తెలంగాణ వచ్చిన తర్వాత మిగులు విద్యుత్‌తో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, కంపెనీలకు కావలసినంత విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ రాములు, డి. ఈ . సాయి ప్రసాద్, సూర్య నారాయణ, సుభాష్, బాలకష్ణ, వీర రెడ్డి, కాప్రా డిప్యూటీ కమిషనర్ శంకర్, నాచారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నందీశ్వర రెడ్డి, కార్పొరేటర్లు జేరిపోతుల ప్రభుదాస్, పన్నల దేవేందర్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, సుడుగు మహేందర్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్, ఐప్సో ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్, ఐప్సో ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కమలానగర్ కాన్ఫరెన్స్ హాల్లో పర్యావరణం రక్షణ తక్షణ కర్తవ్యం అనే అంశంపై చర్చ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి శ్రీమన్నారాయణ అధ్యక్షత వహించారు. ప్రపంచవ్యాప్తంగా కార్బన్ ఉద్గారాలు అధికమై ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తుందని చెప్పారు. అడవుల వినాశనం, పెట్రోలియం ఉత్పత్తులు పెంచడం, అందులో ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు అనేకం ఉత్పత్తి చేసి పర్యావరణానికి వినాశనం కల్పిస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా అమెరికా, పాశ్చాత్య దేశాలు తమ ప్రయోజనాల కోసం హానికర పద్ధతులు అవలంబిస్తున్నారని దానివలన సమతుల్యత లోపించి ప్రపంచవ్యాప్తంగా అనేక అనర్థాలకి దారితీస్తు ందని చెప్పారు. పర్యావరణాన్ని సమతుల్యతను కాపాడుకుంటూ ముందుకు వెళ్లాలని కోరారు. గొడుగు యాదగిరి రావు, గోపి, శారద, రాజమల్లు, కేసీఆర్ దాసు, శ్రీనివాసరావు, పి.బి చారి, గగన్ కుమార్‌లు పర్యావరణాన్ని రక్షించుకోవడానికి చెట్లను పెంచాలని, ప్లాస్టిక్ వ్యర్థాలను వ్యతిరేకంగా ప్రచారం చేయాలని, పాలకులు తమ ప్రయోజనాల కోసం కాక ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని కోరారు. హరితహారం పేర ప్రభుత్వాలు అనేక చెట్లను నాటుతున్నారని కానీ వాటికి పోషణ బాధ్యత తీసుకోకపోవడం వల్ల అనేక చెట్లు చనిపోతున్నాయని అన్నారు. ఎవరి చెట్లు నాటినట్టే వారే బాధ్యతగా వాటిని పెంచాలని కోరారు. అనంతరం పర్యావరణం రక్షణకు ప్రతిజ్ఞ చేసి కార్యక్రమం ముగించారు.



జలమండలికి మరో అవార్డు

- ప్రత్యేకంగా అభినందించిన ఎండీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఈ ఏడాది ఇప్పటికే రెండు అవార్డులు గెలుచుకోగా, తాజాగా మరో అవార్డు లభించింది. మురుగు శుద్ధిలో ఉత్తమ పనితీరు కనబరుస్తున్నందుకు, వంద శాతం మురుగు శుద్ధి కోసం ఎస్టీపీలను వేగంగా నిర్మిస్తున్నందుకు గానూ జలమండలికి పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అవార్డు లభించింది. ప్రభుత్వం రాష్ట్ర అవతరణ వేడుకల్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ అవార్డు ఇచ్చారు. సనత్ నగర్‌లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయంలో 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా సోమవారం జరిగిన కార్యక్రమంలో మంత్రులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ కలిసి జలమండలి ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబుకు అవార్డుతో పాటు ప్రశంసా పత్రాన్ని అందించారు. అనంతరం డైరెక్టర్ శ్రీధర్ బాబు ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ దానకిశోర్‌ను అధికార బందంతో కలిసి అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎండీ శ్రీధర్‌బాబును ప్రత్యేకంగా అభినందించారు. జలమండలికి మరో అవార్డు రావడంపై ఎండీ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని సూచించారు.

వైన్ షాపుతో మహిళలు, విద్యార్థినిలకు ఇబ్బందులు

- కాంగ్రెస్ నేత హెచ్ఆర్ మోహన్

నవతెలంగాణ-నాచారం



మల్లాపూర్ శివ హోటల్ బస్టాండ్ వద్ద ఉన్న స్వర్ణ వైన్స్‌తో మహిళలు,విద్యార్థినులు ఇబ్బందులు గురవుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు హెచ్ ఆర్ మోహన్ తెలిపారు. సోమవారం ఉప్పల్ అబ్కారీ శాఖ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బస్ స్టాప్ పక్కనే స్వర్ణ వైన్ షాప్ ఉండడం వల్ల మహిళలు, ఆ పక్కనే ఉన్న సెయింట్ ఆన్స్ ఉమెన్స్ కాలేజ్ విద్యార్థినిలు మందు బాబుల వెకిలి చేష్టలతో బస్ స్టాప్‌లో నిలబడడానికి ఇబ్బంది పడవలసి వస్తుందని పేర్కొన్నారు. తాగుబోతులు బస్ స్టాప్‌లో కూర్చొని మద్యం సేవిస్తూ బస్ స్టాప్‌ను వైన్స్ సిట్టింగ్‌గా మార్చారని ఎక్సైజ్ అధికారులకు వివరించారు. తక్షణమే బస్టాప్ పక్కనే ఉన్న వైన్స్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మహిళా ప్రయాణికులు, విద్యార్థులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. తక్షణమే అబ్కారి శాఖ అధికారులు స్పందించి స్వర్ణ వైన్స్ పై చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నాయకులు పాల్గొన్నారు.

మొదలైన ప్రవేశాలు

- ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లు
- ప్రభుత్వ కాలేజీల్లో 3వేలకుపైనే సీట్ల భర్తీ
- వచ్చేనెల వరకు గడువు



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. 2023-24 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్‌లో చేరేందుకు ఈనెల ఒకటో తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఇప్పటికీ ప్రారంభమైన తొలి విడుత అడ్మిషన్ల ప్రక్రియ వచ్చే నెల చివరి వరకు కొనసాగనుంది. ప్రస్తుతం హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, ట్రైబల్, బీసీ రెసిడెన్షియల్, మైనార్టీ, రైల్వే కళాశాలల్లో అడ్మిషన్లు కొనసాగుతున్నాయి. ఇదే అంశంపై ఇటీవల డీఐఈవో అధ్యక్షతన అకాడమిక్ రివ్యూ సమావేశాన్ని ప్రభుత్వ కాలేజీల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన విషయం తెలిసిందే. జిల్లాలో పదో తరగతి పాసైన విద్యార్థులకు అవగాహన కల్పించి.. ఈ ఏడాది గవర్నమెంట్ కాలేజీల్లో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని వారికి దిశానిర్దేశం చేశారు. దీంతో అధ్యాపకులు తమ పరిధిలో ప్రచారం చేయడంతో పాటు ప్రభుత్వ కాలేజీల్లో కోర్సులు, మౌలిక వసతులు తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

హైదరాబాద్ జిల్లావ్యాప్తంగా 22 గవర్నమెంట్ కాలేజీలు, 14 ఎయిడెడ్, ఒకటి ట్రైబల్, నాలుగు బీసీ రెసిడెన్షియల్, 26 మైనార్టీ, ఒక రైల్వే కళాశాలతోపాటు 250 ప్రయివేటు కాలేజీలున్నాయి. వీటిలో ఆయా గ్రూపుల్లో కలిపి దాదాపు 60-70వేలకుపైగా సీట్లు ఉన్నాయి. ఇటీవల విడుదలైన పది పరీక్ష ఫలితాల్లో నగర వ్యాప్తంగా 54,971 మంది విద్యార్థులు పాసయ్యారు. వీరంతా ఇక్కడి కళాశాలల్లో చదవనున్నారు. కాగా జిల్లాలోని ప్రభుత్వ కాలేజీల్లో సుమారు 8వేల సీట్లు ఉండగా.. ఇప్పటి వరకు 3,170 మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. అంతేగాక ఫస్టియర్‌లో అడ్మిషన్ పొందిన ఈ విద్యార్థులతో పాటు సెకండియర్ స్టూడెంట్స్‌కు ఇప్పటికే క్లాసులు ప్రారంభించారు.

అడ్మిషన్ పొందడం ఇలా..

ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పొందే విద్యార్థులు నేరుగా కాలేజీలకు వెళ్లి తమ పదో తరగతి పాస్ ఆన్‌లైన్ మెమో, ఆధార్ కార్డు నంబర్ ఆధారంగా అప్లికేషన్ సమర్పించాల్సి ఉంటుంది. అలా కుదరని పక్షంలో ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకోని ప్రవేశం పొందవచ్చు.

అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది...

ఇంటర్ బోర్డు నిర్ణయం మేరకు ప్రస్తుతం ఆన్‌లైన్, నేరుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటివరకు ప్రభుత్వ కాలేజీలకు సంబంధించి వివిధ కోర్సుల్లో 3వేలకుపైగా విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ఇంటర్ బోర్డు అనుమతి, గుర్తింపు పొందిన కళాశాలల్లో మాత్రమే విద్యార్థులు ప్రవేశాలు పొందాలి. గవర్నమెంట్ కళాశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నాం. స్టాఫ్ కొరత లేదు. పుస్తకాలతో పాటు నాణ్య మైన విద్య అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

- దాసరి ఒడ్డెన్న, డీఐఈవో, హైదరాబాద్

కథా తిలకం గ్రంథావిష్కరణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సాహితీ భారతికి నుదుట దిద్దిన తిల కంలా కథా తిలకం గ్రంథం ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. సుల్తాన్ బజార్ లోని శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో నవ్య సాహితీ సమితి నిర్వహణలో జరిగిన ప్రముఖ రచయిత కుంతిపురం కౌడిన్య తిలక్ రచించిన కథా తిలకం గ్రంథావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా కేవీ రమణాచారి హాజరై గ్రంథాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. కథా తిలకం గ్రంథంలో గాఢిత, సాంద్రత వస్తు వైవిధ్యంతో పాటు రచయిత కథా కథనం చాలా గొప్పగా ఉందన్నారు. డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, నవోదయ విద్యాలయాల సంస్థల డిప్యూటీ కమిషనర్ గోపాల కృష్ణ, దత్తాత్రేయ శర్మ, జానకి, శైలజ, విజయ్కు మార్, లక్ష్మీమానస, హరినాథబాబు పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ డివిజన్ సాయి చిత్ర నగర్ రవీంద్ర నగర్‌లో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో జరుగుతున్న మంచినీటి పైపులైను, రోడ్డు పనులు సాయిచిత్ర నగర్‌లోని వరదనీటి కాలువను పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పనులను త్వరగా పూర్తి చేయాలనీ, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలనీ, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ ఆసిఫ్ అలీ, జీహెచ్‌ఎంసీ ఏఈ సాయి కిరణ్, బీజేపీ సీనియర్ నాయకులు సంజయ్ పటేల్, వేములకొండ వెంకన్న గౌడ్, స్థానికులు పాల్గొన్నారు.

ఇన్సెంటివ్ ఇస్తలేరు

- పాడి రైతుల ఆందోళన



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులు, పాల ఉత్పత్తిదారులపై వివక్ష చూపుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా అవతరణ దినోత్సవం జరుపుకుంటున్న వేళ పాడి రైతులు ధర్నాకు దిగటం శోచనీయం. రాష్ట్ర ప్రభుత్వం ఇన్ సెంటివ్ కొన్నేండ్లుగా చెల్లించక పోవడంతో గత్యంతరం లేక ధర్నా చేపట్టామని పాడి రైతులు చెబుతున్నారు. రాష్ట్రంలో సుమారు 25.82 లక్షల కుటుంబాలు విజయ డెయిరీపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. గతంతో పోలిస్తే మార్కెట్‌లో ధరలు పెరిగాయి. పశుపోషణ, దాణా ఖర్చులు విపరీతంగా పెరిగాయి. దీంతో విజయ డెయిరీకి పాలు సరఫరా చేస్తున్న పాడి రైతులకు పెట్టుబడి పెద్ద సమస్యగా మారింది.

ఇన్ సెంటివ్స్ లేదు

మారిన పరిస్థితుల నేపథ్యంలో తాము సరఫరా చేస్తున్న పాలపై ప్రోత్సహకాలను పెంచాలని రైతులు ఆందోళనలు చేపట్టగా లీటరు పాలపై రూ.4 ఇన్సెంటివ్ ఇస్తామని 2014లో సీఎం కేసీఆర్ ప్రకటించారు. ఇది కేవలం రెండేళ్ల వరకు అనగా 2016 వరకు మాత్రమే కొనసాగింది. 2016 వరకు విజయ డెయిరీ ప్రతి 15 రోజులకోసారి పాల బిల్లుతో కలిపి రైతులకు చెల్లించింది. తర్వాత నెలకోసారి రైతులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్న విజయ డెయిరీ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రోత్సాహకాలు నిలిచిపోయాయి. దీనిపై పాడి రైతులు పలుమార్లు అధికారులను విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనకు స్పందించిన అధికారులు 2016 నుంచి 2020 డిసెంబరు వరకు కొద్ది మంది రైతుల ఖాతాల్లో మాత్రమే ఇన్సెంటివ్ డబ్బులు జమచేశారు. ఇన్సెంటివ్ డబ్బులు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కాని రైతులు ఆయా జిల్లాల్లోని విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రాలకు ఫిర్యాదు చేశారు. పాల కేంద్రాల వద్దకు వెళ్లి అడిగితే బ్యాంకు ఖాతాలో ఇన్సెంటివ్ డబ్బులు జమ అయ్యాయని అధికారులు చెబుతూ రైతులను తిరిగి పంపించేశారు. అధికారుల చుట్టూ నెలల తరబడి ప్రదక్షిణలు చేసినా ఫలితం రాలేదు. ఎవరెవరికి ఎన్ని డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారనే సమాచారంతో కూడిన జాబితాను ఇవ్వాలని అధికారులను కోరినా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2021 జనవరి నుంచి ఇప్పటి వరకు రైతులకు ఇన్సెంటివ్ చెల్లించడం లేదు. దీంతో చాలా మంది రైతులు గత్యంతరం ప్రయివేటు డెయిరీలను ఆశ్రయిస్తున్నట్టు చెప్పారు. ప్రయివేటు డెయిరీలతో పోలిస్తే ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు తక్కువే అని రైతులు చెబుతున్నారు. విజయ డెయిరీ పాడి రైతులకు లీటరుపై రూ.4 ఇన్సెంటివ్ ఇస్తుంటే అదే ప్రయివేటు డెయిరీలు రూ.7 ఇన్సెంటివ్ చెల్లిస్తున్నాయి. ప్రయివేటు డెయిరీలు గేదెలు, ఆవులను కొనుగోలు చేసేందుకు అవసరమైన రుణ సదుపాయాలు కల్పిస్తుండగా, విజయ డెయిరీలో మాత్రం ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటున్నారు. పాడి రైతులకు ప్రయివేటు డెయిరీలలో రూ.10లక్షల బీమా సదుపాయం ఉంటే ఇక్కడ మాత్రం ఆ సదుపాయాల్లేవని రైతులు చెబుతున్నారు. తమకు కూడా "రైతుబీమా" సౌకర్యంతో పాటు" ప్రమాద బీమాకు రూ.10 లక్షల సౌకర్యం" ఎక్కువగా పాలు పోసే రైతులకు బోనస్ కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అవసరం ఉన్నచోట పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పాడి రైతులు కోరుతున్నారు. వీటితో పాటు పశువుల ఆరోగ్య సమస్యల తక్షణ పరిష్కారానికి వెటర్నరీ అంబులెన్స్, డాక్టర్స్ సేవలను కల్పించాలని కోరారు. ఈ సౌకర్యాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామనీ, సుదూర ప్రాంతాలకు వైద్యం కోసం వెళ్తున్నట్టు రైతులు చెబుతున్నారు.

ఇన్‌సెంటివ్ వెంటనే విడుదల చేయాలి



2020 డిసెంబరు నుంచి మాకు రావాల్సిన ఇన్‌సెంటివ్ ఇవ్వడం లేదు. పశువులు, పాడి రైతులకు ఇన్స్యూరెన్స్ సౌకర్యం, పాడిరైతు బీమా కల్పించాలి. **వి.రాజయ్య, మంచిర్యాల జిల్లా, రామకృష్ణాపురం, పాడి రైతు**

ప్రభుత్వం స్పదించకకుంటే ఉద్యమిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం ఇక జాప్యం చేయకుండా వెంటనే పాడి రైతులకు రావాల్సిన ఇన్‌సెంటివ్స్ ఇవ్వాలి. పశువులకు 50శాతం సబ్సిడీతో పాటు పాడి రైతులకు సబ్సిడీలు ఇవ్వాలి. తగిన సంఖ్యలో పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. పెండింగ్‌లో ఉన్న బిల్స్ వెంటనే విడుదల చేయకుంటే ఉద్యమిస్తాం.
తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్

కాలేజీ బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజుల స్కీం పునరుద్ధరించాలి



- ఫీజు బకాయిలు రూ.5 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలి
- కార్పొరేట్ కాలేజీలను నిషేధించాలి
- బీసీ కాలేజీ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలి
- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్

నవతెలంగాణ-అంబర్‌పేట

ఇంజినీరింగ్, మెడిసిన్, పీజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంను పునరుద్ధించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం కాచిగూడలో విద్యార్థి సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రెండేండ్లుగా ఫీజుల బకాయిలు రూ.5 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలనీ, కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల ఫీజు స్కీంను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. 2008లో బీసీ సంక్షేమ సంఘం పోరాడి ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కీంను ప్రవేశపెట్టినప్పుడు కాలేజీ కోర్సుల మొత్తం ఫీజును మంజూరు చేసే విధంగా ప్రభుత్వం జీఓ నెం.18 జారీ చేశారని ఆయన గుర్తు చేశారు. 2013 వరకు పూర్తి ఫీజులు మంజూరు చేశారనీ, ఇంజినీరింగ్, మెడిసిన్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ, డిగ్రీ తదితర కోర్సుల మొత్తం ట్యూషన్, స్పెషల్ ఫీజులు ప్రభుత్వం భరించేదనీ, 2014లో ప్రభుత్వం పూర్తి ఫీజు స్కీముకు పరిమితులు విధిస్తూ ఇంజినీరింగ్ కు రూ.35 వేలు మాత్రమే మంజూరు చేస్తామనీ, ఇతర కోర్సులకు పరిమితి విధిస్తూ జీఓలో మార్పులు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో రూ.35 వేల కంటే ఎక్కువ, పీజీకి రూ.20 వేల కంటే ఎక్కువ, డిగ్రీకి రూ.10 వేల కంటే ఎక్కువ ఫీజు పెంచారని తెలిపారు. పెంచిన ఫీజు చెల్లించలేక బీసీ విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్‌లో రూ.35 వేల కంటే ఎక్కువ ఉన్న ఫీజును చెల్లించే ఆర్థిక స్తోమత లేక, అప్పులు పుట్టక వేలాది మంది బీసీ విద్యార్థులు చదువు మానుకుంటున్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పూర్తి ఫీజు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందనీ, మైనార్టీ ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఫీజు మంజూరు చేస్తూ జీఓ జారీ చేశారని గుర్తు చేశారు. బీసీలు ఉద్యమాలు చేస్తుంటే బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు మంజూరు చేయడానికి ప్రభుత్వం ముందుకు రావడం లేదనీ, పూర్తి ఫీజు మంజూరు చేస్తే అదనంగా రూ.150 కోట్ల కంటే ఎక్కువ ఖర్చు రాదన్నారు. ఇతర కులాలకు పూర్తి ఫీజు మంజూరు చేస్తూ కేవలం బీసీ విద్యార్థులకు మంజూరు చేయకపోవడం అన్యాయం అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ, సంఘం నాయకులు జి.అంజి, సతీష్, సుధాకర్, మోడీ రాందేవ్, నరసింహ, నిఖిల్, నరేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మేలు చేయాలనే ఆలోచన ఉంటే ఏదైనా సాధ్యమే

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-అంబర్‌పేట

ప్రజలకు మేలు చేయాలనే ఆలోచన పాలకులకు ఉంటే ఏదైనా సాధ్యమేననీ, ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ రుజువు చేశారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలోని క్రౌన్ ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆమోస్ కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సమావేశానికి ముందు ఆదివారం ఒడిస్సాలో జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి సంతాప సూచకంగా 2 నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యుత్ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ పరిష్కరించాలనే ఆలోచన చేయలేదన్నారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఒక విజన్‌తో అనేక చర్యలను చేపట్టి రాష్ట్ర అవసరాలకు సరిపడా విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ రాష్ట్రంలో విద్యుత్ సమస్య లేకుండా చేసినట్టు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రం, దేశంలో వనరులు ఉన్నప్పటికీ 65 ఏండ్ల కాలంలో ఉన్న పాలకులకు ప్రజా సమస్యలపై కనీస అవగాహన, పట్టింపు లేని కారణంగానే ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. వృథాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోనేందుకే దేశంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాళేశ్వరంను నిర్మించినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌తో లక్షలాది ఎకరాల భూమి సాగులోకి వచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు విజయ్ కుమార్ గౌడ్, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, ఆర్డిఓ వెంకటేశ్వర్లు, ట్రాన్స్ కో సీజీఎం నరసింహ స్వామి, ఎస్ఈ బ్రహ్మం, డీఈ కమల్ కుమార్, ఏడీ శ్రీనివాస్, ఏఈలు సంతోష్, శ్రీనివాస్, స్థానిక నాయకులు పులిజాల గెల్వయ్య, మొర శ్రీరాములు ముదిరాజ్, నరసింహారెడ్డి, కనివేట నర్సింగ్ రావు, రమేష్ నాయక్, మహేష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కోసం ఎదురు చూపులు



నవతెలంగాణ-ధూల్‌పేట్

నెల ప్రారంభమై 5 రోజులు కావస్తున్నా రేషన్ దుకాణాల తెరుచుకోవడం లేదు. రేషన్ బియ్యంపై ఆధారపడే వారు రేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. రోజూ రేషన్ దుకాణం తీరుస్తారెమోనని వినియోగదారులు దుకాణాల చుట్టూ ప్రదర్శణలు చేస్తున్నారు. రేషన్ డీలర్లకు అడిగితే స్ట్రైక్‌లో ఉన్నామని చెబుతున్నారు. ప్రభుత్వం రేషన్ డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సమ్మె చేస్తున్నట్టు పలువురు డీలర్లు పేర్కొంటున్నారు. రేషన్ సరఫరా ఆన్‌లైన్‌లో సరఫరా చేస్తున్నా ప్రభుత్వం డీలర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ప్రకటించి నేటికీ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా డీలర్లు ఏకమై గత నెలలో తమ సమస్యలు పరిష్కరించకపోతే జూన్ లో సమ్మెకు వెళ్తామని సమ్మె పత్రాన్ని ప్రభుత్వానికి అందజేసినట్టు డీలర్లు పేర్కొంటున్నారు. డీలర్ల సమ్మెతో రేషన్ వినియోదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే రేషన్ సరుకులు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినియోదారులు కోరుతున్నారు.

'డయాబెటీస్ కేర్ ఎట్ హెూమ్ ప్రారంభించడం హర్షనీయం'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

మధుమేహం ఉన్న వ్యక్తుల కోసం ఐడియా క్లినిక్స్ డయాబెటీస్ కేర్ ఎట్ హెూమ్‌ను ప్రారంభించడం శుభ హర్షనీయం అని మాజీ ఎమ్మెల్యే, లోక్ సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. సోమవారం ఇనిస్టిట్యూట్ ఫర్ డయాబెటిక్ ఎండోక్రెనాలజీ అండ్ అడిపోసిటీ (ఐడిఇఎ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. హైదరాబాద్ నగరంలో ఐడియా క్లినిక్స్ వైద్యుల ఈ వినూత్న విధానంతో మధుమేహ సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం శుభ పరిణామం అన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి వల్ల దేశంలో చాలా మంది రోగులకు ఆరోగ్య సంరక్షణ అంతు చిక్కనిదిగా మారుతోందన్నారు. ఐడియా ప్రతినిధులు మాట్లాడుతూ భారత్‌లో చాలా మంది మధ్య తరగతి ప్రభుత్వ హాస్పిటళ్లను వదిలి వేస్తున్నప్పటికీ, ప్రైవేట్ హాస్పిటల్ కేర్ ఎక్కువ మంది ఆరోగ్య బీమా లేకుండా తక్కువ ఖర్చుతో కూడుకుందన్నారు. ఐడియా క్లినిక్స్ వైద్యుల గృహ సంరక్షణ బృందం ఖచ్చితమైన రోగ నిర్ధారణలను అందిస్తుందన్నారు. మందులను సూచించి, నిపుణులైన వైద్య సలహాలను అందజేస్తుందన్నారు. మధుమేహం, హైపర్‌టెన్షన్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు, జ్వరాలు, గ్యాస్ట్రో ఎంటిరైటీస్, ఆర్థరైటిస్, పోస్ట్-ఆపరేటివ్, పాలియేటివ్ కేర్‌తో సహా ఇతర బాధాకరమైన పరిస్థితులను పరిష్కరించేందుకు వైద్య బృందం సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ రామాంజనేయులు, ప్రొఫెసర్ డాక్టర్ రాకేష్ సహాయ, డాక్టర్ శ్యామ్ కలవలపల్లి పాల్గొన్నారు.

మాలలకు జరుగుతున్న అన్యాయంపై 8న నిరసనలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రంలోని మాల సామాజిక వర్గానికి జరుగుతున్న అన్యాయాలపై ఈ నెల 8వ తేదీన ఇందిరాపార్క్ వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు మాల సంఘాల జేఏసీ చైర్మెన్ చెన్నయ్య తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాల ప్రజాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య, వర్కింగ్ చైర్మన్లు బూరుగుల వెంకటేశ్వర్లు, మంచాల లింగస్వామి, కరణం కిషన్, గ్రద్ద శ్రీనివాస్, అనంత రాములు, పేరోజు మహేశ్వర్, కె.ఇందిరా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధులో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 98 శాతం ఇతర వర్గానికే ప్రాధాన్యత ఇస్తూ తమ వర్గానికి నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నగర శివారులలో మాల భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయిస్తూ నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ రెండు డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వానికి ఈనెల 8 తేది రాత్రి 12 వరకు అవకాశం ఇస్తున్నామనీ, లేని పక్షంలో 8న ఇందిరాపార్క్ వద్ద వేలాది మందితో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేక వెంకన్న, జంగ శ్రీనివాస్, గాజుల నాగరాజు, మన్నె శ్రీధర్ రావు, బైండ్ల శ్రీనివాస్, కపాకర్, బింగి ఆనందరావు, శశికాంత్, గోకుల కళ్యాణ్, శివకుమార్, రామాంజనేయులు, కమల్, నరేష్ పాల్గొన్నారు.



మొక్కలు నాటి సంరక్షించాలి : ఎంపీ

నవతెలంగాణ-బంజారాహిల్స్

మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అవసరం ఎంతైనా ఉందని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకులు ఎంపీ సంతోష్ కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలోని సోమాజిగూడ డివిజన్ పరిధిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ సెంటర్‌లో సోమవారం ఎంపీ జోగిన పల్లి సంతోష్, స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, డైరెక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ శవయాత్ర



నవతెలంగాణ-ముషీరాబాద్

బీజేపీ బ్రిజ్ భూషణ్ శరన్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ శవ యాత్ర నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శనిగారపు రజనీకాంత్ మాట్లాడుతూ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడుతూ మహిళా క్రీడాకారులను అగౌరవపరుస్తున్నారని ప్రధానమంత్రి మోడీకి క్రీడాకారులు విన్నవించుకున్నా కనీస చర్యలు తీసుకోవట్లేదని మండిపడ్డారు. బ్రిజ్ భూషణ్ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేసి ఆయనపై కఠిన చర్యలు తీసుకొని, ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటం చేస్తున్న క్రీడాకారులకు రక్షణ కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కే అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు తారా సింగ్, భరత్, వెంకటేష్, ఆది, సతీష్, లెనిన్ రమేష్, నాయకులు రమాదేవి, మమత, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఐఎఎస్, ఎన్ఐ ఆర్‌డీ డైరెక్టర్ జి.నరేందర్ కుమార్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో సోమవారం పర్యావరణంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతి సుధామాలో వేల రకాల ఔషధ మొక్కలు ఉన్నాయన్నారు. అక్కడ రకరకాల ఔషధ మొక్కలు ఉండటం వల్ల ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందన్నారు. అలాంటిది కూడా హైదరాబాద్‌లో చేస్తే చాలా బాగుంటుందన్నారు. వృక్షో రక్షతి రక్షిత్ర తల్లి ఆకలి తీర్చును.. చెట్టు అలసట తీర్చును అన్నారు. పద్మశ్రీ డాక్టర్ కార్తికేయన్ మాట్లాడుతూ పచ్చని చెట్టును నాటుదాం ప్రాణ వాయువును పొందుదామన్నారు. వనాలు మానవాళికి వరాలని తెలిపారు. రోజు రోజుకూ పెరిగిపోతున్న భూతాపాన్ని అరికట్టాలంటే విరివిగా మొక్కలు నాటాల్సిన అవశ్యకత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వృక్ష సంరక్షణే ఈ పుడమిని కాపాడుతుందని చెప్పారు. పర్యావరణాన్ని కాపాడాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పుడమి తల్లిని కాపాడుకోవాలంటే హరిత రాష్ట్రాన్ని నిర్మించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి గ్రూప్ ఆఫ్ చైర్మెన్ జీబీకే రావు, డాక్టర్ ఖాదర్ వల్లి, పద్మశ్రీ వనజీవి రామయ్య శ్యాంప్రసాద్, గేర్త్ వెన్ని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మార్పు కోరుకుంటున్న ప్రవాస భారతీయులు

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా.కోట నీలిమ



నవతెలంగాణ-అంబర్‌పేట

విభజన రాజకీయాలు, మత విద్వేషాలతో నిరంకుశంగా పాలనా కొనసాగిస్తూ కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం శాంతి, సామరస్య దేశంగా ఉన్న భారత్ ప్రతిష్టను దెబ్బతీస్తుందనీ, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి, మార్పు తీసుకవచ్చి "నిజమైన ప్రజాస్వామ్యాన్ని" పునరుద్ధరించాలని అమెరికాలోని ప్రవాస భారతీయులు కోరుకుంటున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా.కోట నీలిమ ఒక ప్రకటనలో తెలిపారు. స్వేచ్ఛపై దృష్టి సారించి నిజమైన ప్రజాస్వామ్యం భాగస్వామ్య విలువలు, దృక్పథాన్ని ప్రోత్సహించడానికి కాంగ్రెస్ అగ్ర నేత, మాజీ ఎంపీ రాహుల్ గాంధీ తోపాటు అమెరికాలో పర్యటిస్తున్న డా.కోట నీలిమ అమెరికన్ చట్టసభ సభ్యులను, భారతీయ ప్రవాసులతో సహా వివిధ వ్యక్తులు, సంస్థలు, మీడియాతో సమావేశమయ్యారు. అమెరికాలోని వివిధ నగరాలకు చేరుకున్నప్పుడు రాహుల్ గాంధీకి ప్రవాస భారతీయులు ఘన స్వాగతం పలికారనీ, ప్రతి సమావేశంలో వేలాదిమంది హాజరై ఓపికతో అయన ప్రసంగాలను విన్నారని ఆమె తెలిపారు. న్యూ యార్క్‌లో రాహుల్ గాంధీతో కలసి ఆదివారం కొంతమంది ప్రవాస భారతీయులతో ప్రత్యేకంగా సమావేశమైన అనంతరం డా.కోట నీలిమ మాట్లాడుతూ కులం, జాతి, మతం, భాష లేదా ప్రాంతంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ఆర్థిక ఎదుగుదలకు, శాంతియుత సహజీవనానికి రాజకీయ, సామాజిక స్థిరత్వం తప్పనిసరి అనీ, అది కాంగ్రెస్‌తోనే సాధ్యమౌతుందని ప్రవాస భారతీయులు అభిప్రాయపడ్డారని వెల్లడించారు. దేశంలో రోజురోజుకూ పెరుగుతున్న మత హింస, అణిచివేతలు, హక్కుల ఉల్లంఘనలు, అశాంతిపై ప్రవాస భారతీయులు ఆందోళన చెందుతున్నారని ఆమె చెప్పారు. స్వేచ్ఛ, న్యాయం, శాంతి, మెరుగైన జీవన స్థితిగతులు కల్పించడం కోసం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని అమెరికన్ భారతీయులు ఆకాంక్షించారని తెలిపారు.



ఓయూలో పర్యావరణ అవగాహన రన్

నవతెలంగాణ-ఓయూ

పర్యావరణ పరిరక్షణలో అందరూ చురుగ్గా పాల్గొనాలనీ, రీ సైక్లింగ్ పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ప్లాస్టిక్ ఉత్పత్తులను తిరిగి వినియోగించుకోవాలని ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.పప్పుల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఒకేసారి వినియోగించే ప్లాస్టిక్ ఉత్పత్తులకు దూరంగా వినియోగదారులు దూరంగా ఉండాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ రీసైక్లింగ్ సహా అనుబంధ విభాగాల్లో రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని గుర్తు చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఓయూలో ఏర్పాటు చేసిన రన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆర్ట్స్ కళాశాల నుంచి ఇంజినీరింగ్ కళాశాల వరకు పర్యావరణ అవగాహన రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, డైరెక్టర్లు, అంబేద్కర్, బద్రుకా, ఆర్జీ కేడియా డిగ్రీ కళాశాలల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాం వెంకటేశ్, ఓయూ మౌళిక వసతుల డైరెక్టర్ ప్రొ.నవీన్ కుమార్ ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. యునెస్కో ప్రపంచ మిల్లెట్స్ ఏడాదిగా గుర్తించినందున ఈ కార్యక్రమంలో పాల్గొన్న 400 మందికి మిల్లెట్ అల్పాహారం అందించిన నయా మిల్లెట్స్ సంస్థ యజమాని అమర్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్ పంపిణీలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్



నవతెలంగాణ-ముషీరాబాద్

నాణ్యమైన విద్యుత్ పంపిణీలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. సోమవారం ముషీరాబాద్ నియోజకవర్గం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతినా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. వృత్తినే ఉపాధిగా చేసుకుని జీవనం కొనసాగిస్తున్న వారికి ప్రతి నెలా 250 యూనిట్లు ఫ్రీ కరెంట్ అందిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదే అని కొనియాడారు. వ్యవసాయ రంగానికి 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సర ఫరాను అందిస్తూ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితిలో ఉండేదని గుర్తు చేశారు. అప్పుడు కరెంటు ఉంటే వార్త నేడు కరెంటు పోతే వార్త అన్నట్టుగా ఉందన్నారు. కార్యక్రమంలో డీఈ వెం కట్రావు, ఏడీఈలు పాపయ్య, మక్బుద్, ట్రాన్స్ కో ఏడీఈ రజిత, ముషీరాబాద్ ఎమ్మార్వో అయ్యప్ప, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియ నవీన్ గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు జై సింహ, మోజస్, దామోదర్‌రెడ్డి, మురళి, పెంటరెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు తమను రెగ్యులర్ చేయాలని సోమవారం ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి ఎన్సీసీ గేట్ వరకు ఓయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు బైకు ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్లను డిగ్రీ కాలేజ్ లెక్చరర్‌లను పాలిటెక్నిక్ లెక్చర్లను పర్మినెంట్ చేసే విధంగానే తమను కూడా పర్మినెంట్ చేయాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. తమకు యూజీసీ నిబంధనల ప్రకారం అన్ని అర్హతలు ఉంటే వెంటనే రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సూచించారు. తాము ఏండ్లుగా యూనివర్సిటీకి బోధన పరిశోధన పరిపాలన రంగాల్లో పని చేస్తూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో సుమారు 1500 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌గా సేవలు అందిస్తున్నామనీ, ఇప్పటికైనా తమ సర్వీసును గుర్తించి రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జేఏసీ చైర్మన్ డా.డి.ధర్మతేజ, ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ నేతలు డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ డి.తిరుపతి, డాక్టర్ కల్వపల్లి వెంకటేష్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ ప్రేమయ్య, డాక్టర్ విజయేందర్ రెడ్డి, డాక్టర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



నవతెలంగాణ-అంబర్‌పేట

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ బీసీ జాగృతి మహిళా నాయకురాలు రాధ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్‌ని పూర్తిగా నిషేధించాలనీ, ప్లాస్టిక్ వస్తువులను వాడరాదన్నారు. ప్లాస్టిక్ వాడకం వల్ల వన్యప్రాణులు భూగర్భ జలాలు తగ్గిపోతాయని తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం 129 డివిజన్ పరిధిలోని టీఎస్ఐఐసీ కాలనీలో రూ. 32 లక్షలతో నూతనంగా చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... పనులు సకలంలో నాణ్యతతో చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం డివిజన్‌ల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తుందని చెప్పారు. ఈ మేరకు నిధులు మంజూరు చేస్తూ రోడ్లు, డ్రయినేజీల నిర్మాణం చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ చెక్క సురేష్, కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

గీతం గ్లోబల్ స్కూల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పరిధిలోని పద్మనగర్ ఫేస్ - 2 లో నూతనంగా ఏర్పాటు చేసిన " గీతం గ్లోబల్ స్కూల్" ను సోమవారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా పాల్గొని మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వర రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ యజమాన్యంకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలి యజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సూర్యప్రభ, నియోజకవర్గం బీఆర్ఎస్ యూత్ ప్రెసిడెంట్ సోమేశ్ యాదవ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి సత్తిరెడ్డి ,స్థానిక బీఆర్ఎస్ నాయకులు, యాజమాన్యం పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ పోలీస్ నెంబర్ వన్

- క్రైమ్ రేటును పూర్తిగా తగ్గించేందుకే నూతన పోలీస్ స్టేషన్‌లు : మంత్రి మల్లారెడ్డి
- పేట్ బషీరాబాద్ లో మేడ్చల్ ట్రాఫిక్ జోన్ కాంప్లెక్స్, సూరారం పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్ లో నూతనంగా ఏర్పాటు చేసిన "మేడ్చల్ ట్రాఫిక్ జోన్ కాంప్లెక్స్" సూరారంలో నూతనంగా ఏర్పాటు చేసిన" సూరారం పోలీస్ స్టేషన్ " ను సోమవారం మంత్రి మల్లారెడ్డి , ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు.

అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలో కొత్తగా 9 పోలీస్ స్టేషన్ లు, 2 డీసీపీ ఆఫీసులు , 3 ఏసీపీ ఆఫీసులు ఇచ్చినందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ , హెూంమంత్రి మహమ్మద్ అలీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం ఏర్పడక ముందు కేవలం 60 -70 పోలీస్ స్టేషన్ లు మాత్రమే ఉన్నాయని, తెలంగాణ వచ్చిన తర్వాత కొత్తగా 70 పోలీస్ స్టేషన్ లను ఇచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నూతన పోలీస్ స్టేషన్ లను ప్రారంభించుకుంటున్నమన్నారు. క్రైమ్ రేట్ తగ్గించేందుకే నూతన పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేసుకుంటున్నమన్నారు. సూరారం పోలీస్ స్టేషన్ ఏర్పాటుతో ఈ పరిధిలో పూర్తిగా క్రైమ్ రేటును కంట్రోల్ చేసి నేర నియంత్రణలో పోలీస్ వ్యవస్థను కట్టుదిట్టం చేయాలని అన్నారు. సైబరాబాద్ లోనే ఈ నూతన పోలీస్ స్టేషన్ ఉత్తమ పోలీస్ స్టేషన్ గా ఎదగాలని ఎమ్మెల్యే అన్నారు. తెలంగాణ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో దేశంలోనే టాప్ లో ఉన్నారని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ శాఖకు పెద్దపీట వేస్తూ పోలీస్ యంత్రాంగానికి నూతన సదుపాయాలను సమకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ టాపిక్ జోన్ డీసీపీ డీవి శ్రీనివాస్ రావు , మేడ్చల్ డీసీపీ సందీప్ , ఏసీపీలు వెంకటరెడ్డి , రామలింగరాజు, చంద్రశేఖర్ రెడ్డి, సూరారం ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర రావు , ప్రజా ప్రతినిధులు , మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్వరాష్ట్రంలో నిరంతరం వెలుగులు

- సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యలతో విద్యుత్ రంగంలో గుణాత్మక మార్పులు
- తెలంగాణ విద్యుత్ విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో సోమవారం షాపూర్‌నగర్‌లోని ఎం.జె గార్డెన్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యుత్ విజయోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ వేడుకలలో వినియోగదారులు, రైతులు , విద్యుత్ ఉద్యోగులు పాల్గొనగా గడిచిన తొమ్మిదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ రంగంలో సాధించిన గుణాత్మక మార్పులు విజయాలను ప్రత్యేక ఏవీ ద్వారా వీక్షించారు. నాయి బ్రాహ్మణులు, రజకులు, ఇండస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులు, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ రంగంలో తీసుకొచ్చిన మార్పులు ద్వారా తమకు జరిగిన మేలును వివరిస్తూ... సీఎం కేసీఆర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ రంగంలో తెలంగాణ అనేక విజయాలను సాధించింది అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు ఎప్పుడు వస్తుందో..? ఎప్పుడు పోతుందో...? తెలియని దుస్థితి ఉండేదన్నారు. గత ప్రభుత్వాల హయాంలో కరెంటు ఇవ్వలేని దౌర్భాగ్య పరిస్థితులలో.. ఇటు పంటలు ఎండిపోయి రైతులు, అటు పరిశ్రమలు మూతబడి పారిశ్రామిక వేతనాల బతుకు ఆగమైందన్నారు. కానీ స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ తీసుకున్న చర్యలతో రాష్ట్ర విద్యుత్ రంగంలో సరికొత్త విప్లవం మొదలైంది అన్నారు. ఎండ్ల నాటి అంధకారాన్ని దూరం చేసుకుని వెలుగులోనికి వచ్చామన్నారు. గత ప్రభుత్వాల హయాంలో ఎండాకాలం వచ్చిందంటే చాలు కరెంట్ కోతలు, వాన కాలంలో వరదలు వస్తే కోతలు ఇలా ప్రజలంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొనే వారిని కానీ బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని స్పష్టం చేశారు. చివరగా జూనియర్ లైన్ మెన్ గా విశిష్ట సేవలు అందిస్తున్న శిరీషను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీఈలు నర్సింహ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, విద్యుత్ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు నాయకులు తదితరుల పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్ పల్లి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా, సోమవారం కూకట్‌పల్లి ఎన్‌కేఎన్ఆర్ గార్డెన్‌లో విద్యుత్ ప్రగతి పై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ, తెలంగాణ రాకముందు విద్యుత్ పంపిణీ విషయంలో, ముఖ్యమంత్రి కేసీఆర్ మాట లను ఎవరూ నమ్మలేదన్నాడు. కానీ నేడు ఆ పరిస్థితి లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ ముందు చూపుతో 24 గంట లు విద్యుత్ సరఫరా చేసే రాష్ట్రంగా తెలంగాణ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని అన్నారు. అలాగే విద్యుత్ శాఖ ఉద్యోగులు అందరూ కూడా నిరంతరం ఎంతో చక్కగా పని చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని అభినందించారు. నేడు మాలాంటి నాయకులు ప్రజల ముందు ధైర్యంగా నిలబడి తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందింది అని చెప్పడానికి ఉద్యోగులే ప్రధాన కారణమని ఈ సందర్భంగా తెలియజేశారు.

దేశానికే దిక్సూచి సీఎం కేసీఆర్



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సోమవారం రూ. 1కోటి 25 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన నిర్వహించారు. ఇందులో ప్రధానంగా సీసీ రోడ్డు నిర్మాణ పనులకు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ గత పదేండ్ల కాలం నుంచి కూకట్‌పల్లి నియో జకవర్గంను వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామన్నారు. 60 ఏండ్లుగా చేపట్టని పనులు నేడు పూర్తి చేసుకున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్న వేళ ,రాష్ట్ర ప్రగ తిని ఆవిష్కరించే విధంగా వేడుకలు జరుపుతూ ప్రజలకు తెలియజేస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్ది దేశమంతా తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలు అమలయ్యే విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శకులు అయ్యారని అన్నారు.

క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలి

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఒడిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మెరుగైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్య దర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి డిమాండ్ చేశారు .ఈ మేరకు ఆయన గాజుల రామారం పుర వీధుల్లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహి ంచారు. అనంతరం మృతి చెందిన కుటుం బాలకు రెండు నిమిషాల మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటు వంటి ఘటన చాలా బాధాకరమైనది అన్నారు. అదేవిధంగా రైలు ప్రమాదం వల్ల దేశ ప్రజలందరూ దిగ్భ్రాంతికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.



సామాజిక సేవలకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం మంచిది

బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



సామాజిక సేవలు అందించడం కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం మంచిదని బీఆర్ఎస్ రంగారెడ్డి నగర్ డివిజన్ అధ్యక్షులు ఏర్వ శంకరయ్య అన్నారు. డివిజన్ పరిధి ఏపీహెచ్బీ కాలనీ పార్క్ 2 లో సమావేశం నిర్వహించిన అనంతరం సామాజిక వేత్త ,గ్లోబల్ ప్రతినిధి శ్రీరామ్ రెడ్డి(దాత) ఆధ్వర్యంలో కాలనీవాసులకు ఇంటింటికి తిరుగుతూ సుమారు 500 బ్యాగులు ఏర్వ శంకరయ్య తో కలిసి ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమిష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సాయిబాబా, కోశాధికారి శ్రీను భాష, రేణుక ఎల్లమ్మ, ఆలయ చైర్మన్ శ్రీనివాసు రెడ్డి ,రత్నయ్య, సలహాదారులు రామచందర్, వెంకట్ రెడ్డి, రవీందర్, జగన్మోహన్, నీవాసులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ, బీఆర్ ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణను నియో జకవర్గ పరిధిలోని ప్రజలు సోమవారం శంభీపూర్ లోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఆశి మల్లేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మేయర్ దంపతులు

నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని, సీనియర్ నాయ కులు బీఆర్ ఎస్ ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఆశి మల్లేష్ తన పుట్టిన రోజు సంద ర్భంగా సోమవారం మర్యాద పూర్వ కంగా కలిశారు. ఈ సందర్భంగా మేయర్ దంపతులు ఆయనని శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 10వ డివి జన్ బీఆర్ఎస్ ప్రెసిడెంట్ బైండ్ల నగేష్, సీనియర్ నాయకులు బక్క మల్లేష్, యాదయ్య, దుర్గయ్య, శ్రీనివాస్, జగన్, గణేష్ గౌడ్, జమీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థించే పెదవులు కన్నా సహాయం చేసే చేతులు మిన్న



టీఎస్‌టీఎస్ చైర్మెన్ పాటిమీది జగన్ మోహన్

నవతెలంగాణ-కూకట్ పల్లి

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని,శుభాకాంక్షలు తెలిపారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో, టీఎస్‌టీఎస్ చైర్మెన్ పాటిమీద జగన్మోహన్ రావు. రామన్న మదిలో మెదిలిన ఆలోచన కనుగుణంగా రామన్న జన్మదిన సందర్భంగా చేపట్టిన బృహత్ కార్యక్రమం గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా సోమవారం కూకట్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త కే. రాజు కుమార్తె చరితశ్రీకి ల్యాప్‌టాప్‌ను బహుకరించారు.ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ కేసీఆర్ ఆలోచనలతో, తెలంగాణ రోజు రోజుకు సంక్షేమం అభివృద్ధి, కార్యక్రమాలలో దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. రామన్న పిలుపుతో విద్యార్థులకు నాకు తోచిన సహాయం చేస్తున్నానని తెలియజేశారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే



- యువ నేస్తం ఫౌండేషన్ అధ్యక్షులు కేపీ విశాల్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ 131 డివిజన్ పరిధిలోని పద్మ నగర్ ఫేస్ - 2 లో నూతనంగా ఏర్పాటు చేసిన " గీతం గ్లోబల్ స్కూల్ " ను సోమవారం యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కే.పీ. విశాల్ గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ... నూతనంగా ఏర్పాటు చేసిన గీతం గ్లోబల్ స్కూల్ యజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. ఈ కార్యక్రమంలో కోటయ్య, స్కూల్ కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రామాంజనేయులు, స్కూల్ డైరెక్టర్లు శ్రీనివాస్ , రాజేందర్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- సీసీపీ దేవేందర్ రెడ్డి
- జీహెచ్ఎంసీలో అధికారుల ప్రతిజ్ఞ



నవతెలంగాణ-సిటీబ్యూరో

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని సీసీపీ దేవేందర్ రెడ్డి తెలిపారు. జూన్ 5 పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'మేరీ లైఫ్ మేర స్వేచ్ఛ షెహర్' పేరిట పర్యావరణాన్ని కాపాడటానికి ప్రతి ఒక్కరూ కృషి చేసే విధంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయా విభాగాల హెచ్.ఓ.డిలు అధికారులు సిబ్బంది అందరూ కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీసీపీ మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించడానికి సామాజికంగా వ్యక్తిగతంగా ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. నగరం ఎన్విరాన్మెంటల్ ఫ్రెండ్లీగా 2028 సంవత్సరానికి రూపాంతరం చెందేందుకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. స్వచ్ఛత దైనందిన జీవనశైలిలో అలవర్చుకున్న అలవాటు వ్యర్థాలు పనికిరాని వస్తువులు పునర్వినియోగం, రీసైకిల్ చేసుకునే అవకాశం కలదన్నారు. రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్, మేరీ లైఫ్, మేరా స్వచ్ఛ్ షెహర్ నినాదంతో ముందుకు పోవాలని ప్రతి ఒక్కరూ ఈ చారిత్రాత్మక ఉద్యమంలో భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం అడిషనల్ సీసీపీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ ప్రజలు ఉపయోగించని వస్తువులు, పాత పుస్తకాలు, బట్టలు, బొమ్మలు మొదలైనవాటిని స్వచ్ఛందంగా నగరంలో ఏర్పాటు చేసిన 'త్రిబుల్ ఆర్' కేంద్రాల్లో ఇవ్వచ్చన్నారు. ఈ వస్తువులు తిరిగి పునర్నిర్మించి పునర్వినియోగం ఉపయోగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ వి. కృష్ణ, జయరాజ్ కెన్నెడీ, సీ.ఎం, అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, సీ.ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, సీపీఆర్ఓ మొహమ్మద్ ముర్తుజా, అకౌంట్ చీఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర రెడ్డి, జాయింట్ కమిషనర్‌లు ఉమ ప్రకాష్, వెంకట్ రెడ్డి శశికళ, యస్.బి.ఎమ్ భారత్, ఆయా విభాగాల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. తదనంతరం అందరూ కలిసి పర్యావరణ పరిరక్షణకు స్లోగన్‌లతో ర్యాలీ నీ నిర్వహించారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం

రీసైక్లింగ్‌పై ప్రజల్లో అవగాహన

10శాతం తక్కువ ధరకు స్వీట్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

రీసైక్లింగ్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రీసస్టైనబిలిటీ, దాదూస్ స్వీట్స్ చేతులు కలిపాయి. ఇందులో భాగంగా ప్రతి దాదూ స్టోర్ ముందు కియోస్కలను ఏర్పాటు చేశారు. స్వీట్ బాక్స్‌లు, వ్యర్థా లను బయటపడేయకుండా బాక్స్‌లో వేసేవిధంగా అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి దాదూ స్టోర్ ముందు 'గీవ్ యూవర్ బాక్స్ ఏ గ్రీన్ ట్రాన్స్ఫరేషన్' పేరుతో కియోస్కలను ఏర్పాటు చేశారు. పర్యావరణ బాధ్యత ప్రతి ఒక్కరిదనే తీరులో అవగాహన కల్పిస్తున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం స్ఫూర్తితో కార్యక్రమాన్ని చేపట్టారు. 'కుచ్ మిథా హెూ జాయే' అనే భారతీయ భావజాలంతో హైదరాబాద్, పూణే అంతటా దాదూస్ అవుట్‌లెట్‌ల ముందు చిన్న కియోస్కలు ఏర్పాటు చేశారు. రీసైక్లింగ్ కేంద్రాలకు పంపబడే స్వీట్ బాక్స్‌లను వినియోగదారుల నుండి సేకరించేందుకు ఈ కియోస్కలు ఏర్పాటు చేశారు. ఈ బాక్స్‌లు అందించిన కస్టమర్‌లకు దాదూస్ నుంచి 10శాతం తగ్గింపుతో స్వీట్స్ అందిస్తారు. రాబోయే తరాలకు పచ్చని, మరింత సుస్థిరమైన భవిష్యత్తును అందించేందకు చేపట్టిన ప్రచారంలో తాము భాగ స్వాములు కావడం ఎంతో సంతోషకరమైన విషయ మని రీ సస్టైనబిలిటీ సీఈఓ మసూద్ మల్లిక్ అన్నారు. నగరంలో తమ స్టోర్స్ వద్ద ఏర్పాటు చేయబడిన కియోస్కలను వాడాలని దాదూస్ స్వీట్స్ మేనేజింగ్ డైరెక్టర్,శ్రీ రాజేష్ దాదు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.



ఎమ్మెల్సీ పుట్టిన రోజు సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



- గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు చేదోడుగా అనిల్ రెడ్డి

నవతెలంగాణ-కూకట్ పల్లి

ఎమ్మెల్సీ నవీన్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత నిచ్చారు ఓ బీఆర్ఎస్ నాయకుడు. పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 మంది విద్యార్థులకు బీఆర్ఎస్ ఆల్విన్ కాలనీ డివిజన్ గౌరవ అధ్యక్షుడు అనిల్ రెడ్డి ఆర్థిక సహాయం అందించి తన అభిమానాన్ని చాటు కున్నాడు. ఎమ్మెల్సీ పుట్టినరోజు సందర్భంగా గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా, పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి పది వేల రూపాయల చొప్పున ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అనిల్ రెడ్డి మాట్లాడుతూ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ పుట్టినరోజు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు ఆర్థిక సహాయం అందిం చేందుకు నిర్ణయించుకున్నారని తెలిపారు. పేద విద్యార్థులు చదువుకు దూరం కావద్దన్న సంక ల్పంతోనే, పది పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉన్నత చదువులకు తోడ్పాటు అందిస్తుంన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, విద్యార్థి విభాగం నాయకుడు ప్రదీప్ రెడ్డిలు పాల్గొన్నారు.

తెలుగు టాలన్స్ జెర్సీ ఆవిష్కరణ



హైదరాబాద్ : ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్ (పిహెచ్‌ఎల్) తొలి సీజన్‌కు తెలుగు టాలన్స్ ఉత్సాహంగా సన్నద్ధమవుతుంది. జూన్ 8న జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో ఆరంభం కానున్న పిహెచ్‌ఎల్‌లో తెలుగు టాలన్స్ తెలుగు రాష్ట్రాలకు ప్రాతినిథ్యం వహిస్తుంది. సోమవారం జెఎన్‌టియుహెచ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో టాలన్స్ జెర్సీ ఆవిష్కరణతో పాటు కెప్టెన్ పేరును ప్రకటించారు. ఆకుపచ్చ, పసుపు రంగుతో కూడిన జెర్సీని జెఎన్‌టియుహెచ్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె. నరసింహా రెడ్డితో కలిసి ఐటీ మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్‌లు ఆవిష్కరించారు. హర్యానా స్టార్ ఆటగాడు, జాతీయ స్థాయిలో మూడు కాంస్య పతకాలు సాధించిన జట్టులో సభ్యుడు, ఫెడరేషన్ కప్ నెగ్గిన జట్టులో సభ్యుడు శుభమ్ షియోరాన్ తెలుగు టాలన్స్ జట్టుకు కెప్టెన్సీ వహించనున్నాడు. ఈ మేరకు తెలుగు టాలన్స్ యజమాని అభిషేక్ రెడ్డి తెలిపారు. జెఎన్‌టియుహెచ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ క్రీడాకారులు, విద్యార్థులు, తెలుగు టాలన్స్ కోచ్ ఫెర్నాండో, సహాయక కోచ్ సచిన్ పాల్గొన్నారు.

కొడితే రికార్డే!

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్. రెండేండ్ల పాటు ద్వైపాక్షిక పోరులో ఇంట, బయట విజయం కోసం చెమటోడ్చేది ఈ అంతిమ సమరంలో ఢీకొట్టేందుకే!. టీమ్ ఇండియా వరుసగా రెండోసారి ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు చేరుకుంది. తొలి ప్రయత్నంలో న్యూజిలాండ్‌కు తలొగ్గిన భారత్.. ఇప్పుడు ఆస్ట్రేలియాతో అమీతుమీ తేల్చుకునేందుకు సిద్ధమైంది. బుధవారం నుంచి షురూ కానున్న టెస్టు క్రికెట్ అంతిమ సమరంలో.. గద గెల్చుకుని ఐసీసీ నాలుగు టైటిళ్లు సాధించిన ఏకైక జట్టుగా చరిత్ర సృష్టించేందుకు భారత్, ఆస్ట్రేలియా రంగం సిద్ధం చేసుకున్నాయి!.



- ఊరిస్తున్న ఐసీసీ టెస్టు గద
- వరుసగా రెండో ఫైనల్లో భారత్
- ఓవల్‌లో ఇక ఆసీస్‌తో అమీతుమీ

నవతెలంగాణ-లండన్



ఎవరు నెగ్గినా చరిత్రే

భారత్, ఆస్ట్రేలియా అరుదైన రికార్డు ముంగిట నిలిచాయి. ఐసీసీ 2023 ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో తాడోపేడో తేల్చుకునేందుకు సై అంటున్న ఈ రెండు జట్లు.. ది ఓవల్‌లో టెస్టు చాంపియన్‌షిప్ గద సాధించిన జట్టు అరుదైన రికార్డు సాధించనుంది. ఐసీసీ వన్డే వరల్డ్‌కప్, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ, ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లను సాధించిన జట్లలో భారత్, ఆస్ట్రేలియాలు ఉన్నాయి. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ తొలి విజేతగా న్యూజిలాండ్ నిలిచింది. కానీ ఆ జట్టుకు మిగతా మూడు ఐసీసీ టైటిళ్లు లేవు. దీంతో తాజా ఫైనల్లో విజేతగా నిలిచే జట్టు ఐసీసీ నాలుగు టైటిళ్లు సాధించిన జట్టుగా నిలువనుంది. రెండోసారి ఫైనల్స్‌కు చేరుకున్న టీమ్ ఇండియా ఆ ఘనత సాధిస్తుందా.. అనుకూల పరిస్థితుల్లో ఆస్ట్రేలియానే రికార్డు సొంతం చేసుకుంటుందా? ఆసక్తికరం.

మిడిల్ ముఖ్యం

ప్రతిష్టాత్మక టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో ఇరు జట్లకు మిడిల్ ఆర్డర్ కీలకం. ఇంగ్లాండ్ పరిస్థితుల్లో, ప్రత్యేకించి తాజా డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఓపెనర్లకు ఇక్కడ మంచి రికార్డు లేదు. కానీ లండన్‌లో ఓపెనర్లకు ఫర్వాలేదు. 2023 డబ్ల్యూటీసీలో ఇంగ్లాండ్‌లో 11 టెస్టులు ఆడగా.. అందులో ఓపెనర్ల సగటు 28.06. ఈ 11 టెస్టుల్లో ఓపెనర్ల నుంచి రెండు శతకాలు నమోదు కాగా.. అవి కూడా భారత బ్యాటర్లు కెఎల్ రాహుల్ (129, లార్డ్స్), రోహిత్ శర్మ (127, ది ఓవల్) సాధించారు. టాప్ ఆర్డర్‌కు మెరుగైన రికార్డు లేకపోవటంతో సహజంగానే మిడిల్ ఆర్డర్‌దే బాధ్యత. చతేశ్వర్ పుజార, విరాట్ కోహ్లి, అజింక్య రహానె భారత మిడిల్ ఆర్డర్ భారం మోస్తున్నారు. ఆస్ట్రేలియాపై పుజారకు తిరుగులేని రికార్డుంది. కంగారూలపై 24 టెస్టుల్లోనే 2033 పరుగులు బాదిన పుజార.. ఐదు శతకాలు సైతం బాదాడు. భారత్, ఆసీస్ పరిస్థితులకు వ్యత్యాసం లేకుండా పుజార కంగారూలపై పరుగుల వరద పారించాడు. ఆసీస్ పరిస్థితులను తలపించే ది ఓవల్‌లో, ఇంగ్లీష్ కౌంటీ క్రికెట్ అనుభవంతో పుజార మరో స్పెషల్ ఇన్నింగ్స్ కోసం ఎదురు చూస్తున్నాడు. పుజారను నిలువరించటం ఆస్ట్రేలియా బౌలర్ల ముందున్న ప్రధాన సవాల్. ఇక విరాట్ కోహ్లి ఆసీస్‌పై చివరి టెస్టులో శతక మోత మోగించాడు. ఐపీఎల్‌లో వరుస సెంచరీలతో ఊపందుకున్నాడు. కెరీర్ ఉత్తమ ఫామ్‌ను తిరిగి అందుకున్న కోహ్లిని అడ్డుకోవటం కంగారూలకు తలనొప్పిగా మారనుంది. ఇక పునరాగమన ఉత్సాహంలో ఉన్న అజింక్య రహానె విదేశీ పిచ్‌లపై సహజంగానే అత్యంత భిన్నమైన బ్యాటర్. పేస్‌కు అనుకూలించే పిచ్‌లు అనగానే రహానె పరుగుల ప్రవాహం పారిస్తాడు. పుజార, కోహ్లి, రహానె త్రయం ప్రదర్శన భారత్ విజయావకాశాలను నిర్దేశించనుంది. ఆస్ట్రేలియా తరఫున మిడిల్ ఆర్డర్‌లో మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్, కామెరూన్ గ్రీన్ ఆ పాత్రను పోషించనున్నారు. టాప్ ఆర్డర్‌లో డెవిడ్ వార్నర్, ఉస్మాన్ ఖవాజాలు మంచి ఫామ్‌లో ఉన్నారు.

ఆ ఇద్దరి లోటు పేడ్చేదెలా?

టెస్టు క్రికెట్‌లో రిషబ్ పంత్ పూడ్చలేని లోటు. అతడి స్థానాన్ని భర్తీ చేయలేని పరిస్థితి. 2020 డిసెంబర్ 1 నుంచి ఆడిన 20 టెస్టుల్లో (34 ఇన్నింగ్స్‌లు) పంత్ ఏకంగా 1457 పరుగులు చేశాడు. సగటు 47 కాగా, స్ట్రయిక్‌రేట్ 76.80. ఇందులో మూడు సెంచరీలు, తొమ్మిది అర్థ శతకాలు ఉన్నాయి. లోయర్ ఆర్డర్‌లో ఇన్నింగ్స్‌తో మ్యాచ్ ఫలితాన్ని శాసించేవాడు పంత్. ఇప్పుడు అతడు ప్రమాదంలో గాయపడి జట్టుకు దూరమయ్యాడు. లోయర్ ఆర్డర్ అతడి స్థానాన్ని పూడ్చటం భారత జట్టు ముందున్న అతిపెద్ద సవాల్. వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ఓ ప్రత్యామ్నాయం. సూర్యకుమార్ యాదవ్ సైతం రేసులోనే ఉన్నాడు. కానీ రవీంద్ర జడేజాతో జట్టు పంత్ స్థానాన్ని భర్తీ చేసే ఆలోచనలో ఉంది. ఇక పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ సమస్యతో ఫైనల్‌కు అందుబాటులో లేడు. బుమ్రా లేని భారత పేస్ దళం.. ఆసీస్ పేస్ విభాగంతో సమవుజ్జీ కాలేదు. ఆసీస్ పేసర్లకు తలదన్నే ప్రదర్శన చేయాలంటే.. అందుకు ఒక్కటే మార్గం. మహ్మద్ షమి అత్యుత్తమ ప్రదర్శన చేయాల్సిందే. ఇంగ్లాండ్ పిచ్‌లు షమి బౌలింగ్‌కు సరిగ్గా సరిపోతాయి. ఇక్కడి పిచ్‌లపై మంచి రికార్డు సైతం ఉంది. కొత్త, పాత బంతితో జోరుమీదున్న షమిని ఎదుర్కోవటం అంత సులువు కాదు. మహ్మద్ సిరాజ్, ఉమేశ్ యాదవ్ తోడుగా మహ్మద్ షమి ఉత్తమ ప్రదర్శన చేయగలిగితే.. బుమ్రా లేకపోయినా పేస్ విభాగం సూపర్ హిట్టే!.





బ్యాటింగ్‌కు ఇంగ్లాండ్ పరిస్థితులు అత్యంత సవాల్‌తో కూడుకున్నవిగా నా అభిప్రాయం. క్రీజులో నిలిచేందుకు సరైన ఫోకస్‌తో సన్నద్ధమైతే కొంతమేర సక్సెస్ సాధించవచ్చు. ఇంగ్లాండ్‌లో గత రెండేండ్లలో బ్యాటింగ్ చేసిన అనుభవంతో చెబుతున్నాను.. ఇక్కడ పిచ్‌లపై ఎంత సేపు నిలిచినా కుదురుకున్నట్టే ఉండదు. వాతావరణం మారుతూనే ఉంటుంది. దీంతో స్పెల్స్, సెషన్ల పాటు ఏకాగ్రత, సహనంతో ఉండాలి. టెస్టు క్రికెట్ సంధించే అందమైన సవాల్ ఇదే. బౌలర్లపై ఎదురుదాడి చేయాల్సిన సమయం ఇదేనని బ్యాటర్‌కు అనిపిస్తుంది. ఆ సమయం కోసం ఎదురుచూసి సిద్ధంగా ఉండాలి. అంతకుమించి, ఆ సమయం వరకు క్రీజులో నిలిచేందుకు ప్రయత్నించాలి.

- రోహిత్ శర్మ, భారత కెప్టెన్

బీట్రిజ్ మైయా మాయ

- క్వార్టర్‌ఫైనల్లో బ్రెజిల్ అమ్మాయి
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



పారిస్ (ఫ్రాన్స్) : బ్రెజిల్ క్రీడాకారిణి బీట్రిజ్ హద్దాద్ మైయా మ్యాజిక్ చేసింది. సోమవారం జరిగిన మహిళల సింగిల్స్ నాల్గో రౌండ్లో స్పెయిన్ అమ్మాయి సారా సోరిబెస్ టార్మోపై గెలుపొందిన మైయా.. 1968 తర్వాత ఫ్రెంచ్ ఓపెన్ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్న తొలి బ్రెజిల్ క్రీడాకారిణిగా చరిత్ర సృష్టించింది. మూడు సెట్ల పోరులో చెమటోడ్చిన మైయా.. 6-7(3-7), 6-3, 7-5తో మెరుపు విజయం సాధించింది. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో కోల్పోయిన మైయా.. వరుసగా చివరి రెండు సెట్లను సొంతం చేసుకుంది. ఏకంగా తొమ్మిది బ్రేక్ పాయింట్లు సాధించిన మైయా.. పాయింట్ల పరంగా 127-120తో ఆధిక్యం సాధించింది. సారా 15 గేములు నెగ్గగా.. మైయా 19 గేముల్లో పైచేయి సాధించి క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లింది. మరో ప్రీ క్వార్టర్స్ మ్యాచ్‌లో ట్యూనిషియా అమ్మాయి ఓన్స్ జెబ్యూర్ మెరిసింది. అమెరికా క్రీడాకారిణి బెర్నార్డ పెరాపై 6-3, 6-1తో వరుస సెట్లలో గెలుపొందిన జెబ్యూర్ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. ఎనిమిది బ్రేక్ పాయింట్లు సాధించిన ట్యూనిషియా స్టార్.. పాయింట్ల పరంగా 62-41 తిరుగులేని పట్టు సాధించింది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో బీట్రిజ్ హద్దాద్ మైయాతో ఓన్స్ జెబ్యూర్ తలపడనుంది.

పురుషుల సింగిల్స్‌లో నాల్గో సీడ్, నార్వే ఆటగాడు కాస్పర్ రూడ్ క్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. చిలీ ఆటగాడు నికోలస్ జార్రీపై 7-6(7-3), 7-5, 7-5తో ఉత్కంఠ మ్యాచ్‌లో గెలుపొందిన రూడ్.. టైటిల్ దిశగా మరో అడుగు ముందుకేశాడు. ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన రూడ్.. తొలి సెట్‌ను టైబ్రేకర్‌లో సొంతం చేసుకున్నాడు. తర్వాతి రెండు సెట్లు సైతం ఉత్కంఠగా సాగినా.. టైబ్రేకర్ అవసరం లేకుండానే రూడ్ ముగించాడు.

సాయి హర్ష ముందంజ

- జాతీయ టేబుల్ టెన్నిస్ టోర్నీ



హైదరాబాద్ : జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో తెలంగాణ ఆటగాడు సాయి హర్ష ముందంజ వేశాడు. సోమవారం మొయినాబాద్‌లోని ఫైర్‌ఫాక్స్ స్పోర్ట్స్ అండ్ రిసార్ట్స్ వేదికగా జరిగిన అండర్-15 బాయ్స్ పోటీల్లో సయాన్ చౌదరిపై సాయి హర్ష 3-1తో మెరుపు విజయం నమోదు చేశాడు. నాలుగు సెట్ల మ్యాచ్‌లో హర్ష అలవోకగా గెలుపొందాడు. దుల్యన్ వత్సల్ (హర్యానా) 3-1తో సావంత్ మయూరిశ్ (మహారాష్ట్ర)పై గెలుపొందగా.. ఇషాన్ కుమార్ 3-0తో చందన్ (గోవా)పై విజయం సాధించాడు. అండర్-15 గర్ల్స్ విభాగంలో ఫిజా పవార్ 3-2తో శ్రీజ చక్రవర్తి (బెంగాల్)పై, అన్వీ గుప్త (మహారాష్ట్ర) 3-2తో సుమేధ (కర్ణాటక), మౌబోని చటర్జీ (గుజరాత్) 3-0తో ఈషా సంజన పోకల (ఏపీ)పై విజయాలు సాధించారు.

ఫన్..అన్ లిమిటెడ్



డైమండ్ రత్నబాబు

రచయిత డైమండ్ రత్నబాబు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్ స్టాపబుల్'. 'అన్ లిమిటెడ్ ఫన్' అనేది ఉపశీర్షిక. విజె సన్నీ, సప్తగిరి హీరోలుగా నటించిన ఈ చిత్రంలో నక్షత్ర, అక్సాఖాన్ హీరోయిన్లు. ఎ2 బి ఇండియా ప్రొడక్షన్‌లో రజిత్‌రావు నిర్మించిన ఈ చిత్రం ఈనెల 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో దర్శకుడు డైమండ్ రత్నబాబు మీడియాతో మాట్లాడుతూ, 'రచయితగా నేను రాసిన 'పిల్లా నువ్వులేని జీవితం, సీమ శాస్త్రి, ఈడోరకం ఆడోరకం' లాంటి నవ్వించిన సినిమాలే నాకు పేరు తీసుకొచ్చాయి. దర్శకుడిగా మారిన తర్వాత ప్రయోగాలు చేశాను. ఫలితాలు ఆశించినట్టు రాలేదు. ఇకపై నవ్వించే సినిమాలే నా నుంచి వస్తాయి. ఒకవేళ ప్రయోగాలు చేయాలనుకుంటే ఓటీటీలో చేస్తాను. ఇందులో సన్నీ, సప్తగిరి.. ఒకరు మచ్చా.. మరొకరు చిచ్చా. వీరిద్దరూ కలసి చేసే రచ్చని థియేటర్‌లో అందరూ ఎంజాయ్ చేస్తారు. ఇందులో సన్నీ మాస్ క్యారెక్టర్‌లో కనిపిస్తే, సినిమాకి మరో ప్రధాన బలంగా జిలానీ రాందాస్‌గా సప్తగిరి కనిపిస్తారు. సినిమాని మోసుకెళ్ళే పాత్ర ఆయనది. చాలా అద్భుతంగా చేశారు. సినిమా మంచి స్వీట్‌లా ఉంటుంది. ఇందులో మంచి కాన్సెప్ట్ ఉంది. అది ఏమిటనేది ఇప్పుడే చెప్పకూడదు. ఈ సినిమా చూసిన తర్వాత మంచి స్క్రీన్‌ప్లే ఉందని అందరూ అభినందిస్తారు. ఇక ఈ సినిమాకి టైటిల్ పెట్టడానికి బాలకృష్ణ చేసిన 'అన్ స్టాపబుల్' షోనే కారణం. మా సినిమాని బాలకృష్ణ బర్త్‌డేకి చిన్న చిరు కానుకగా ఈనెల 9న విడుదల చేస్తున్నాం. ఈ సినిమా చూస్తున్నంత సేపూ ప్రేక్షకులు నవ్వుతూనే ఉంటారు' అని చెప్పారు.

స్వచ్ఛమైన ప్రేమకథ

జీవిత బడుగు సమర్పణలో ఏకరీ ఫిలిమ్స్ పతాకంపై రఘు రామ్ హీరోగా, శృతి శెట్టి, నైనా పాఠక్ హీరోయిన్స్‌గా నటిస్తున్న చిత్రం 'ఓహ్!'. సత్యనారాయణ ఏకరీ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కులుమునాలిలోని అందమైన లొకేషన్స్‌లో మొదటి షెడ్యూల్‌ను, ఆగ్రాలో రెండవ షెడ్యూల్‌ను, హైదరాబాద్‌లో మూడవ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈనెల 10 నుండి రెండు ఫైట్స్ వరంగల్‌లో, 17 నుండి గోవాలో మరో పాట చిత్రీకరించనున్నారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాత సత్యనారాయణ ఏకరి మాట్లాడుతూ, 'కులుమనాలి బ్యాక్ డ్రాప్‌లో వస్తున్న ప్యూర్ లవ్ స్టోరీ ఇది. ఇందులో ఐదు పాటలు, మూడు ఫైట్స్‌తో ప్రేక్షకులను మెప్పించే ఓ కొత్త ప్రేమ కథను తెరకెక్కిస్తున్నాం. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, సెప్టెంబర్ 29న థియేటర్లలో విడుదల చేస్తాం' అని తెలిపారు.



రఘురామ్, శృతిశెట్టి

ఆ రాత్రి ఏం జరిగింది?



సుప్రితా రాజ్

ధన్విక్ క్రియేషన్స్ సమర్పణలో స్నేహాలయం క్రియేషన్స్ పతాకంపై ఆర్.కె.గాంధీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఆగస్ట్ 6 రాత్రి'. బి.సుధాకర్, కంభం దినేష్ కుమార్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం రెండో షెడ్యూల్ విజయవంతంగా పూర్తి చేసుకుంది. అజయ్ రాహుల్, దుర్గాప్రియ, పవన్ వర్మ, సుప్రితా రాజ్, నాగమహేశ్, ధీరజ అప్పాజి, మునిచంద్ర, పద్మారెడ్డి, బక్తరపల్లి రవి, రాయదుర్గం రాజేశ్, మణి సాయి తేజ, ఆనంద్ మట్ట, శ్రీని రావ్, వినోద్ కుమార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రం క్రైం థ్రిల్లర్‌తో కూడిన లవ్ స్టోరీగా కొనసాగుతుంది. కర్నాటకలోని హొసకోట సమీపంలో భక్తరపల్లి పరిసరాల్లో మూడు రోజులపాటు షూటింగ్ జరుపుకున్న ఈ చిత్రం ఆఖరి షెడ్యూల్ హైదరాబాద్‌లో జరగనుంది. బెంగళూరు, నెల్లూరు, అనంతపురం, హైదరాబాద్‌లో కేవలం 6 రోజుల్లో ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేసుకుని రికార్డు సాధించాలి అని ధ్యేయంతో చేస్తుండటం విశేషం.సందర్భంగా దర్శకుడు ఆర్.కె.గాంధీ మాట్లాడుతూ, 'ఇప్పటికి 5 రోజులు షూటింగ్ పూర్తి చేశాం. ఉదయభాను, సుమన్, నాగమహేశ్, మునిచంద్ర కాంబినేషన్ సీన్లు చేస్తే సినిమా పూర్తవుతుంది' అని అన్నారు.

అంచనాలకు మించి టక్కర్



సిద్దార్థ్, దివ్యాంశ కౌశిక్

హీరో సిద్దార్థ్ నటించిన లేటెస్ట్ మూవీ 'టక్కర్'. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, పాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. వివేక్ కూచిభొట్ల సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమాలో దివ్యాంశ కౌశిక్ కథానాయికగా నటించారు. ఈనెల 9న తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం విడుదల కానుంది. ఇందులో భాగంగా ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ ఈవెంట్‌లో దర్శకులు బొమ్మరిల్లు భాస్కర్, తరుణ్ భాస్కర్, వెంకటేష్, నిర్మాత సురేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు కార్తీక్ జి. క్రిష్ మాట్లాడుతూ, 'ఈ కాలానికి ఈ సినిమా ఒక ట్రెండ్ సెట్టర్ అవుతుంది. అలాగే అంచనాలకు మించి ఉంటుంది' అని తెలిపారు. 'ఈ సినిమా ఈనెల 9న రిలీజ్ అవుతుంది. మీరు థియేటర్‌లో ఈ సినిమాను ఎక్స్‌పీరియన్స్ చేయండి' అని హీరోయిన్ దివ్యాంశ కౌశిక్ అన్నారు. నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ, 'సినిమాలు డీవిడిలో చూడటం దగ్గరనుంచి థియేటర్‌లో నేను చూసిన మొదటి సినిమా 'బొమ్మరిల్లు'. ఇప్పుడు అంతా పాన్ ఇండియా ఎరా నడుస్తోంది. ఈ సినిమా అందర్నీ కచ్చితంగా మెప్పిస్తుంది' అని చెప్పారు. 'మేము ఈ సినిమాతో అసోసియేట్ అయినందుకు చాలా హ్యాపీగా ఉంది. ఈ సినిమా మంచి హిట్ అవుతుందని ఆశిస్తున్నాను' అని మరో నిర్మాత అభిషేక్ అగర్వాల్ అన్నారు. హీరో సిద్దార్థ్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను మంచి స్కేల్‌లో తీశారు. ఇదొక యాక్షన్ ఫిల్మ్. ఈ యాక్షన్ స్టోరీ మధ్యలో ఒక న్యూ ఏజ్ లవ్ స్టోరీను దర్శకుడు కార్తీక్ చూపించారు. అలాగే లవర్ బాయ్ రగ్గడ్‌గా ఉంటే ఎలా ఉంటుందో ఈ సినిమాలో చూపించారు. ఈ సినిమా మిమ్మల్ని ఖచ్చితంగా 100% అలరిస్తుంది. దివ్యాంశకి ఈ సినిమా తర్వాత ఒక ప్రత్యేకమైన గుర్తింపు వస్తుంది. అవుట్ అండ్ అవుట్ కమర్షియల్ సిద్దు ఎప్పుడు చేస్తారు అనే ప్రశ్నకు సమాధానమే ఈ సినిమా అన్నారు.

తెలంగాణ త్యాగధనులు



నాగబాల సురేష్‌కుమార్

2 వేల సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన తెలంగాణ ప్రాంతం భారతదేశంలోని 28 రాష్ట్రాలలో ఒకటి. 2014 జూన్ 2న కొత్త రాష్ట్రంగా అవతరించింది. తెలంగాణ కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన త్యాగధనులు కూడా ఎందరో వున్నారు. వారిలో కొందరి జీవిత చరిత్ర ఆధారంగా 'తెలంగాణ త్యాగధనులు' పేరిట వెబ్ సిరీస్ రూపుదిద్దుకోనుంది. ఆదివారం సాయంత్రం ఈ వెబ్‌సిరీస్ ప్రారంభోత్సవం, గీతావిష్కరణ ప్రసాద్ లాబ్స్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డిసి చైర్మన్ కూర్మాచలం, దర్శకులు రేలంగి నరసింహారావు, నటి రోజారమణి, నిర్మాత రాజ్ కందుకూరి, వకుళా భరణం కృష్ణ మోహన్, తుమ్మలపల్లి రామసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. విజన్ వివికె ఫిలిమ్స్ పతాకంపై ప్రొడక్షన్ నెం1గా రూపుదిద్దుకుంటోన్న ఈ పీరియాడికల్ వెబ్ సిరీస్‌కి నాగబాల సురేష్ కుమార్ దర్శకత్వం వహిస్తుండగా, వ్యాపారవేత్త శ్రీ విజన్ వివికె హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అధినేత వి.విజయ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ ప్రారంభోత్సవంతో పాటు ఈ వెబ్ సిరీస్‌లోని 'వందనం వందనం తెలంగాణ త్యాగధనులకు ఇదే వందనం' అనే గీతాన్ని సీనియర్ నటి రోజా రమణి విడుదల చేసారు. ఎఫ్ డి సి చైర్మన్ కూర్మాచలం చేతులమీదుగా నిర్మాత వి విజయ్ కుమార్‌కు క్లాప్ అందించడంతో షూటింగ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా వి.విజయ్ కుమార్ మాట్లాడుతూ, 'చరిత్రలో నిలిచిపోయే సబ్జెక్టులు కొన్నే ఉంటాయి అలాంటి గుర్తుండి పోయే సిరీస్ 'తెలంగాణ త్యాగధనులు" అని తెలిపారు. 'ఇవి 10 సీజన్లో 50 ఏపిసోడ్స్ అవుతాయో? లేక 100 సీజన్లో 500 ఏపిసోడ్స్ అనేది ఇప్పుడు చెప్పలేము. తెలంగాణ చరిత్ర కేవలం ఒక ప్రాంతానికి తెలియాల్సిన చరిత్ర కాదు జాతీయ స్థాయిలో తెలియాల్సి సిరీస్ ఇది' అని చెప్పారు.ఇదే వేడుకలో నిర్మాత విజయ్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు.

నవచిత్రం

రెట్టింపు వినోదం



సిద్ధు జొన్నలగడ్డ

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై నిర్మాతలు నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'డీజే టిల్లు' చిత్రంతో ఘన విజయాన్ని అందుకున్న సిద్ధు దీని సీక్వెల్ 'టిల్లు స్క్వేర్'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. అలాగే ఈసారి రెట్టింపు వినోదాన్ని పంచడానికి నటి అనుపమ పరమేశ్వరన్ తోడయ్యారు.ఈ సినిమాని సెప్టెంబర్ 15న విడుదల చేస్తున్నట్టు సోమవారం చిత్ర బృందం ప్రకటిస్తూ సిద్ధు-అనుపమ పరమేశ్వరన్‌ల రొమాంటిక్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి అని చిత్ర యూనిట్ తెలిపింది. ఈచిత్రానికి దర్శకత్వం: మల్లిక్ రామ్, డీఓపీ: సాయి ప్రకాష్ ఉమ్మడిసింగు, ఎడిటర్: నవీన్ నూలి, సంగీతం: రామ్ మిరియాల, శ్రీ చరణ్ పాకాల, ఆర్ట్: ఏఎస్ ప్రకాష్.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బస్సుయాత్రలో అందరూ భాగస్వాములు కావాలి

- అనుబంధ సంఘాలతో టీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్



నవతెలంగాణ-హైదరాబాద్

టీడీపీ ఆధ్వర్యంలో త్వరలో జరగబోయే బస్సుయాత్రలో అందరూ పాల్గొనాలని ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. పార్టీ ప్రతిష్ఠకోసం కృషి చేయాలని కోరారు. సోమవారం ఎన్టీఆర్ ట్రస్ట్‌భవన్‌లో పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ అనుబంధ సంఘాల అధ్యక్షులు పూర్తి స్థాయిలో కమిటీల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అనుబంధ సంఘాలు పార్టీకి వెన్నెముక లాంటివనీ, అవి ఎంత బలంగా పనిచేస్తే పార్టీ అంత బలోపేతమవుతుందని అభిప్రాయపడ్డారు. అనుబంధ సంఘాలు రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై పోరాటం చేయాలని ఆయన కోరారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం తీవ్ర కృషిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షులు సామ భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జక్కలి ఐలయ్య యాదవ్, బీసీ సెల్ అధ్యక్షులు శ్రీపతి సతీష్, తెలుగు మహిళా అధ్యక్షురాలు షకీలారెడ్డి, తెలుగు యువత అధ్యక్షులు పొగాకు జయరాం, ఎస్సీ సెల్ అధ్యక్షులు పి. అశోక్, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు పి. రవీందర్, ఎస్టీ సెల్ అధ్యక్షులు కె. గోపి, టీఎన్టీయూసీ అధ్యక్షులు ఎం.కె. బోస్, సాంస్కృతిక విభాగం అధ్యక్షులు చంద్రహాస్, లీగల్ సెల్ అధ్యక్షులు రఘు వర్ధన్ ప్రతాప్, గీత కార్మిక సంఘం అధ్యక్షులు గజేంద్రగౌడ్, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు ముంజ వెంకటరాజం గౌడ్ పాల్గొన్నారు.

నేడు ట్రస్ట్‌భవన్‌కు చంద్రబాబు

టీడీపీ అధినేత ఎన్.చంద్రబాబునాయుడు మంగళవారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రానున్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ తెలంగాణ శాఖ కార్యక్రమాల సమీక్ష, ఇతర అంతర్గత అంశాలపై చర్చించనున్నారని తెలిసింది. త్వరలో చేపట్టనున్న బస్సుయాత్రకు సంబంధించి కూడా మాట్లాడనున్నారు. ఈ మేరకు టీటీడీపీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ఏర్పాట్లు చేశారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిసర ఫౌండేషన్ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నగరాల్లోని పర్యావరణ సవాళ్లపై పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థలకు ప్రజలు సహకరించాలని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ కోరారు. సోమవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో గ్రేటర్ హైదరాబాద్ పరిసర ఫౌండేషన్‌ను ఆయన ప్రారంభించారు. హైదరాబాద్‌లోనూ పర్యావరణ సమస్య ఉందని తెలిపారు. ఉస్మానియా యూనివర్శిటీ క్యాంపస్‌లోని రెండడుగుల బావి పునరుద్ధరణకు 360 లైఫ్ అనే సంస్థ ముందుకు రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత రెండేండ్లుగా నగరంలో 20 మెట్ల బావులను పునరుద్ధరించారని తెలిపారు.

సింగరేణి థర్మల్‌కు పర్యావరణ అవార్డు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ)లో చేపట్టిన పర్యావరణహిత చర్యలకు రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారంనాడిక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఈ అవార్డును సింగరేణి యాజమాన్యానికి అందచేశారు. ఎస్టీపీపీలో చేపట్టిన కాలుష్య నివారణ, నీటి, ఇంధన పొదుపు చర్యలు, వ్యర్థాల నిర్వహణ, పచ్చదనం పెంపునకు చేస్తున్న కృషిని గుర్తిస్తూ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసింది. మంత్రుల చేతులమీదుగా ఎస్టీపీపీ చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథ రాజు ఈ అవార్డును అందుకున్నారు. ప్లాస్టిక్ రహిత, పర్యావరణహిత వస్తువుల ప్రదర్శనను మంత్రులు సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ చర్యలు తీసుకుంటున్న వివిధ శాఖల అధికారులు, సంస్థలు, విద్యార్థులకు ప్రోత్సాహకాలు, బహుమతులు అందజేశారు.

సింగరేణి కార్మికులకు గొప్ప ఫలితాలు : ఎమ్మెల్సీ కే కవిత

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలకు వ్యతిరేకంగా అనేక మంది ప్రయత్నాలు చేసినా, సీఎం కేసీఆర్ పట్టుబట్టి వారసత్వ ఉద్యోగాలు అందిస్తున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చెప్పారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి సంబరాలు జరుపుకుంటున్న బొగ్గు గని కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. సంస్థలో ఇప్పటివరకు దాదాపు 15 వేల వారసత్వ ఉద్యోగాలు ఇచ్చినట్టు చెప్పారు. పురుషులకే కాకుండా, కూతుళ్లు, కోడళ్లకు సైతం అవకాశం ఇవ్వడం ద్వారా మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిరూపితమైందన్నారు. ఈ సందర్భంగా సంస్థలో అమలవుతున్న పలు కార్మిక సంక్షేమ కార్యక్రమాలను ఆమె ప్రస్తావించారు.

ఉత్తమ గ్రామపంచాయతీ పర్లపల్లి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో ఉత్తమ గ్రామ పంచాయతీగా పర్లపల్లి ఎంపికైంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ఈ పంచాయతీకి అవార్డు అందచేశారు. ప్లాస్టిక్ ఘన వ్యర్థాల నిర్వహణ, పరిశుభ్రత, పచ్చదనం విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పర్లపల్లి గ్రామం రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయితీ అవార్డు కు ఎంపికైంది. సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్యనియంత్రణ మండలిలో జరిగిన కార్యక్రమంలో మంత్రులు అల్లోళ్ల ఇంద్రకరణ్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ చేతుల మీదుగా పర్లపల్లి గ్రామ సర్పంచ్ శ్రీమతి మాదాడి భారతినర్సింహారెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

రెండవ రన్నర్‌గా నిలిచిన లాస్య ప్రియ

- అభినందించిన మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఇండియన్ ఐడల్ సంగీత పోటీల్లో ద్వితీయ రన్నరప్‌గా సిద్దిపేటకు చెందిన లాస్యప్రియ నిలవడాన్ని ఆర్థికశాఖ మంత్రి టీ హరీశ్‌రావు ప్రసంసించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదిక ద్వారా లాస్యప్రియను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. సిద్దిపేటకు చెందిన గుమ్మన గారి లాస్యప్రియ ఆహ యాప్‌లో జరిగిన ఇండియన్ ఐడల్ సీజన్ 2 లో రెండవ రన్నర్‌గా నిలిచి తన సత్తా చాటారు. మొదటి నుండి పట్టుదలతో తన సంగీత ప్రదర్శనతో ఆమె ప్రేక్షకులను అలరింపజేశారు. ఈ ప్రోగ్రాం జరుగుతున్న క్రమంలో మంత్రి హరీష్ రావు లాస్య ప్రియకు ఆశీస్సులు అందిచారు.

11న 'దశాబ్ది' సాహిత్య దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 11న తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలంగాణ సాహిత్య అకాడమీ ఛైర్మెన్ జూలూరు గౌరీశంకర్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కవులు, రచయితలు పోషించారన్నారు. పట్టణ, గ్రామీణ ప్రగతిని ప్రపంచానికి చాటిచెబుతూ కవితలు, పద్యాలు రాసి రాష్ట్రవ్యాప్తంగా కవి సమ్మేళనాలను నిర్వహించుకుంటున్నామన్నారు. 33 జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కవిసమ్మేళనాలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కవులు రాసిన కవితలు, పద్యాలను దశాబ్ది ఉత్సవాలకు గుర్తుగా తెలంగాణ సాహిత్య అకాడమీ సంకలనంగా తీసుకువస్తుందన్నారు.

ఆశావర్కర్లకు నిర్వహించే పరీక్షను రద్దుచేయాలి



కనీసవేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలంటూ..

- ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ధర్నాలు

నవతెలంగాణ-విలేకరులు

ఆశా వర్కర్లకు కొత్తగా పరీక్ష పెట్టి అర్హత సాధిస్తేనే వారిని కొనసాగిస్తామని ప్రభుత్వం కొత్తగా నిబంధన పెట్టడాన్ని నిరసిస్తూ తెలంగాణ ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా సోమవారం ధర్నాలు నిర్వహించారు. వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పలుచోట్ల నోడల్ ఆఫీసర్లు, వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పానగల్లు, మాన్యం చల్క, లైన్ వాడ, రాములబండ పీహెచ్సీల ఎదుట ధర్నాలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్లు, ఆశా నోడల్ ఆఫీసర్లకు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు చిన్నపాక లక్ష్మీనారాయణ, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ఆధ్వర్యంలో వినతి పత్రాలు అందజేశారు. నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ వైద్యులు సయ్యద్ ఇక్బాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. మునుగోడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. దామరచర్ల ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అర్బన్ హెల్త్ సూపరింటెండెంట్‌కు, బొల్లపల్లిలోని పీహెచ్‌సీ వైద్యునికి వినతిపత్రాలు అందజేశారు. భూదాన్‌పోచంపల్లిలోని పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు.

కొమరం భీమ్ జిల్లా కాగజ్‌నగర్‌లోని సీహెచ్‌సీ, నజ్రుల్‌నగర్ పీహెచ్‌సీల ముందు ఆశా వర్కర్లు ధర్నా చేపట్టి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ సీతారాం, వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. కౌటాలలో పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేపట్టారు. ఆసిఫాబాద్ మండలంలోని అడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఆశా కార్యకర్తలు ధర్నా నిర్వహించి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సిర్పూర్(టి) మండలంలోని లోనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ధర్నా నిర్వహించి వైద్యాధికారి కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ మణి విక్టోరియాకు ఆశా కార్యకర్తలు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండల పరిధిలోని పెద్ద షాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆశావర్కర్లు ధర్నా చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ సీహెచ్ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు, అశ్వాపురం, పాల్వంచ మండలాల్లో సీఐటీయూ ఆధ్వర్యంలో మండల వైద్యాధికారులకు వినతి పత్రం అందజేశారు. చర్లలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మచారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. సమస్యలు పరిష్కరించని యెడల ఈనెల 12న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని ఆయన హెచ్చరించారు. నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించిన ఆశా కార్యకర్తలు.. అనంతరం డాక్టర్ మానసికి వినతిపత్రాన్ని అందజేశారు. తాడూరు మండల కేంద్రంలోని పీహెచ్ ఎదుట ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం తిప్పడం పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ధర్నా చేశారు. కొత్తకోట మదనపురంలో ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించి డాక్టర్ భవాని రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు.

మనది వెలుగుల తెలంగాణ

- రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా
- దశాబ్ద కాలంలో రెట్టింపైన విద్యుదుత్పత్తి
- తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రం ఏర్పడిన దశాబ్ద కాలంలో ఎన్నో విద్యుత్ సంస్కరణలను తెలంగాణ సర్కార్ తీసుకొచ్చిందని తెలంగాణ ఫుడ్స్ చైర్మెన్ మేడే రాజీవ్ సాగర్ తెలిపారు. సీఎం ముందుచూపు, విద్యుత్ సంస్థ ఉద్యోగుల సహకారంతోనే ఇది సాధ్యమైందని వివరించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కరెంటుకు కోసం ధర్నాలు చేస్తే రైతులను కాల్చి చంపిన చరిత్ర గత ప్రభుత్వాలదైతే... రైతుకు 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్న ఘన చరిత్ర తెలంగాణ సర్కార్‌దని వివరించారు. గతంలో పరిశ్రమలకు పవర్ హాలీడే ప్రకటించేవారని.. ప్రస్తుతం డిమాండ్‌కు మించి ఏడాది పొడవునా అన్నిరంగాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. తెలంగాణ ఏర్పాటుకు నాటికి విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్లు కాగా సీఎం కేసీఆర్ కృషితో 18,453 మెగావాట్లకు చేరుకుందని తెలిపారు. 26.96 లక్షల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని వివరించారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని గొప్పలు చెప్పుకునే గుజరాత్‌లో సైతం నేటికి పరిశ్రమలకు పవర్ హాలీడేలు ప్రకటిస్తున్నారని.. అలాగే రైతులకు 24 గంటలు ఉచిత కరెంట్ సైతం అక్కడ అందుబాటులో లేదని విమర్శించారు. తెలంగాణలో యాదాద్రి పవర్ ప్లాంట్ ద్వారా 4 వేల మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి, భద్రాద్రి పవర్ ప్లాంట్ ద్వారా 1,080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్ర సర్కార్ శ్రీకారం చుట్టిందని తెలిపారు.

మస్తు కష్టపడ్డాం...వెలుగులు తెచ్చాం

తెలంగాణ విద్యుత్ విజయోత్సవంలో టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో నిరంతర విద్యుత్ వెలుగులు విరజిమ్మించడం కోసం విద్యుత్ ఉద్యోగులు చాలా కష్టపడ్డారనీ, దాని ఫలితాలను ఇప్పుడు రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్నారని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ జీ రఘుమారెడ్డి అన్నారు. సోమవారం నాడిక్కడి సంస్థ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ విద్యుత్ విజయోత్సవ సంబురాలు ఆయన అధ్యక్షతన ఘనంగా జరిగాయి. గౌరవ ముఖ్య అతిధులుగా ట్రాన్స్‌కో అండ్ జెన్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు, ఖైరతాబాద్ నియోజకవర్గ శాసన సభ్యులు దానం నాగేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భముగా రఘుమారెడ్డి మాట్లాడుతూ గడచిన తొమ్మిదేండ్లలో సంస్థ పరిధిలో పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చడం కోసం రూ.14,063 కోట్లు ఖర్చుచేసినట్టు తెలిపారు. అన్ని రంగాల వారికీ నిరంతర నాణ్యమైన విద్యుత్ సరవరా అందిస్తున్నామన్నారు. సంస్థలో పని చేసే ప్రతి ఉద్యోగి వినియోగదారుల సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని చెప్పారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ దిశా నిర్దేశం ఫలితంగా అన్ని రంగాల వారికీ నిరంతర విద్యుత్ సరఫరా అందిస్తున్నామని తెలిపారు. దీనివల్ల పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ ఉద్యోగుల కృషిని కొనియాడారు. సీఎండీ డీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ తొమ్మిదేండ్లలో విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థల పటిష్ఠత కోసం రూ.97,321 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఈ విజయం వెనుక ప్రతి విద్యుత్ ఉద్యోగి కృషి, పట్టుదల ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు టి శ్రీనివాస్, జె శ్రీనివాస్ రెడ్డి, కె రాములు, జి పర్వతం, సీహెచ్ మదన్‌మోహన్‌రావు, ఎస్ స్వామిరెడ్డి, పి నరసింహ రావు, జి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ను రద్దు చేసిన తర్వాతే పరీక్షలు..

- టీఎస్పీఎస్సీని ముట్టడించిన బీఎస్పీ నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ను రద్దు చేసిన తర్వాతే గ్రూప్ -1 తోపాటు ఇతర పరీక్షలు నిర్వహించాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) హైదరాబాద్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు చాట్ల చిరంజీవి, రుద్రవరం సునీల్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి లింగం డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని టీఎస్పీఎస్సీ కార్యాలయాన్ని బీఎస్పీ కార్యకర్తలతో కలిసి వారు ముట్టడించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ జనార్ధన్ రెడ్డి నేతృత్వంలో జరిగిన 16 పరీక్షా పేపర్లు లీక్ అయ్యాయని వివరించారు. ఈ విషయం సిట్, ఈడీ విచారణలో వెలుగు చూసినా కేసీఆర్ ప్రభుత్వం కమిషన్ చైర్మెన్ పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. పేపర్ లీకేజీలో ఆరోపణలు ఎదుర్కొంటున్న చైర్మెన్ గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు జూన్ -11 న రీషెడ్యూల్ విడుదల చేయడం అప్రజాస్వామికమని వారు విమర్శించారు.

సామాజిక అసమానతలు పెంచుతున్న పాలకులు



రైల్వే ప్రమాదంపై ప్రధాని మోడీ పూర్తి బాధ్యత వహించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ
- రాష్ట్ర సామాజిక శిక్షణా తరగతులు ప్రారంభం

నవతెలంగాణ- కల్వకుర్తి

రాష్ట్రంలో సామాజిక అసమానతలు పెంచేందుకు పాలకులు కుట్రలు చేస్తున్నారని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ అన్నారు. సోమవారం నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్‌లో కేవీపీఎస్ రాష్ట్ర సామాజిక శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేండ్ల కిందట అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా సామాజిక అసమానతలు పెంచుతూ ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రజాస్వామ్యవాదులు విశాల ఉద్యమాలను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఒడిశాలో జరిగిన రైల్వే ప్రమాదంపై ప్రధాని మోడీ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైల్వే శాఖలో దాదాపు రెండు లక్షల పైగా ఉద్యోగాలు ఖాళీ ఉంటే మోడీ ప్రభుత్వం ప్రయివేటు పరం పేరుతో రైల్వే వ్యవస్థను నిర్వీర్యం చేశారని, అందుకే ఈ ప్రమాదం జరిగిందన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రాజకీయాలపై దృష్టి పెట్టింది తప్ప ప్రజల రక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని మండిపడ్డారు. రైల్వే ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు, ఉపాధ్యక్షులు కురుమయ్య, నాయకులు రాధాకృష్ణ, గోపి, మంద సంపత్, పరుశరాములు, రామ్మూర్తి, రాధిక, ప్రకాష్, దేవేందర్, ముంతటికాశన్న, బాలపీరు, గంగాధర్, మోహన్, నవీన్, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులివ్వాలి

- 19న తహశీల్దార్ కార్యాలయాల ముట్టడి : పీవైఎల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులను ప్రజలకు పంపిణీ చేయాలని పీవైఎల్ డిమాండ్ చేసింది. ఇదే అంశంపై ఈనెల 19న రాష్ట్రవ్యాప్తంగా పీవోడబ్ల్యూతో కలిసి తహశీల్దార్ కార్యాయాలను ముట్టడించనున్నట్టు పిలుపునిచ్చింది. ఈ మేరకు పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కాశీనాథ్, కెఎస్ ప్రదీప్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత పాలకులు చౌక ధరలకే నిత్యావసర సరుకులు పేదలకు అందించారని గుర్తు చేశారు. ఇప్పుడు వాటిని రద్దుచేసి ధరలు విపరీతంగా పెంచేలా చేశారని విమర్శించారు. దీంతో రెక్కల కష్టం మీద ఆధారపడిన పేదలు దిన దిన గండంగా బతుకుతున్నారని తెలిపారు. రేషన్ షాపులో సన్న బియ్యం కూడా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ధరలు రూ.1,200 వరకు పెంచారని, దీంతో పేదలకు గ్యాస్ వాడడం ఆర్థిక భారంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల సగం సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కోరారు. రేషన్ డీలర్ల సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. వారికి గౌరవ వేతనం ఇవ్వాలని, తరుగు వచ్చే విషయంపై అధికారులు స్పందించాలని కోరారు. కరోనా కాలంలో మరణించిన డీలర్ల కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు.

వేసవిలోనే పూర్తిస్థాయిలో నిండిన మూసీ ప్రాజెక్ట్

- దిగువకు నీటిని విడుదల చేసిన అధికారులు



నవతెలంగాణ-కేతేపల్లి

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండో పెద్ద ప్రాజెక్ట్ అయిన మూసీ రిజర్వాయర్ వేసవిలోనే పూర్తిస్థాయిలో నిండి.. గరిష్ట నీటిమట్టం 645 అడుగులకు చేరుకున్నదని అధికారులు తెలిపారు. దాంతో అప్రమత్తమైన అధికారులు సోమవారం 3వ నెంబర్ క్రస్ట్ గేట్ అరఫీట్ మేర పైకి ఎత్తి 330 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. మూసీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెప్పారు. కాగా, ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో 243.16 క్యూసెక్కులు, అవుట్ ఫ్లో 88.17 క్యూసెక్కులు నీటి ప్రవాహం ఉన్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. పూర్తి స్థాయి నీటిమట్టం 645 ఫీట్లు కాగా, ప్రస్తుత నీటిమట్టం 644.60 ఫీట్లు వద్ద స్థిరంగా ఉంది. పూర్తి స్థాయి సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 4.36 టీఎంసీలుగా నమోదైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఆయకట్టు రైతులు వానాకాలం సాగుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కార్యక్రమంలో డీఈ చంద్రశేఖర్, ఏఈలు ఉదయ్ కుమార్, మమత, స్వప్న పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వ దురాగతాలను ప్రజల్లో ఎండగడతాం

- బీఆర్ఎస్ ఏపీ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఏపీలో వైసీపీ ప్రభుత్వ దురాగతాలను ప్రజల్లో ఎండగతామని భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ తోట చంద్రశేఖర్ విమర్శించారు. సోమవారం హైదారాబాద్‌లోని బీఆర్ఎస్ ఏపీక్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. వైసీపీ సర్కార్ పాలనలో అన్ని రంగాలు నిర్వీర్యమయ్యాయని దుయ్యబట్టారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజానీకాన్ని మోసగిస్తున్నదని విమర్శించారు. గడప గడపకు మన ప్రభుత్వం పేరుతో చేపట్టిన కార్యక్యమంలో ప్రజల నుండి ప్రజాప్రతినిధులకు ఎదురౌతున్న చీత్కారాలే వైసీపీ పాలనకు నిదర్శనమన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన టీడీపీ ప్రభుత్వానికి పట్టిన గతే జగన్ ప్రభుత్వానికి పడుతుందని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వాన్ని ఏపీ ప్రజలు ఆహ్వానిస్తున్నారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తలారి సురేష్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లాకు చెందిన యూత్ కాంగ్రెస్ కార్యదర్శి పి.సత్యనారాయణ తోట సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు . ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గిద్దా శ్రీనివాస్‌నాయుడు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన కోలేటి దామోదర్, డీజీపీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పర్యావరణ దినోత్సవం సందర్భంగా రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన 'గ్రీన్ ఇండియా ఛాలెంజ్' స్ఫూర్తితో రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మెన్ కోలేటి దామోదర్, డీజీపీ అంజనీకుమార్ కలిసి డీజీపీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ రాజీవ్‌రతన్, అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) సంజయ్‌కుమార్ జైన్, డీఐజీ(పీఅండ్ఎల్) ఎం.రమేష్, ఐజీ(పర్సనల్) కమలాహాసన్‌రెడ్డి, ఐటీ(ఇంటలిజెన్స్) శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌధలో 'దశాబ్ది' వెలుగులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా ప్రతిభ కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని టీఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎమ్‌డీ దేవులపల్లి ప్రభాకరరావు అన్నారు. సీఎం కేసీఆర్ ముందుచూపుతోనే ఈ విజయం సాధ్యమైందనీ, విద్యుత్ విజయం ఫలితంగా అన్నిరంగాల్లో రాష్ట్రం పురోగమిస్తున్నదనీ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఖైరతాబాద్‌లోని విద్యుత్‌సౌధలో 'విద్యుత్ విజయోత్సవం' జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. 9 ఏండ్లలో రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, పంపిణీ వ్యవస్థల ఆధునీకరణ కోసం రూ.97,321 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రికార్డు సమయంలో కొత్త విద్యుదుత్పత్తి కేంద్రాలు పూర్తిచేశామన్నారు. పారిశ్రామిక, వాణిజ్య పెట్టుబడులు పెరిగాయని చెప్పారు. తలసరి విద్యుత్ వినియోగంలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్‌సౌధను రంగురంగుల దీపాలతో అలంకరించారు. మామిడితోరణాలు కట్టి, కార్యాలయంలో పండుగ వాతావరణం కల్పించారు. ఉద్యోగులు సంబురాల్లో సంతోషంగా పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ కృషిని కొనియాడారు. కార్యక్రమంలో విద్యుత్ సంస్థల డైరెక్టర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి : గవర్నర్ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్ రాజ్‌భవన్‌లో ప్రతిజ్ఞ తీసుకున్నారు. ఒక మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సలహాదారులు ఎ.పి.వి.ఎన్.శర్మ, ఎ.కె.మొహంతీ, కార్యదర్శి జె.భవానీ శంకర్, సంయుక్త కార్యదర్శి సీ.ఎన్.రఘు ప్రసాద్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ దరఖాస్తులకు ఆహ్వానం

- టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఇంటర్‌మిడియట్ కోర్సులకు సంబంధించి మంగళవారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్) కార్యదర్శి రొనాల్డ్‌రోస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్‌ఈసీ ఒకేషనల్ గ్రూపుల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ప్రవేశం కోసం 2023-24 విద్యాసంవత్సరానికి సీఓఈ సంస్థలు నేటి నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ఝఝఝ.ంఝతీవఱం.ఖఎ.ఱఅ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థి దరఖాస్తు రుసుము కోసం రూ.100/- చెల్లించాలని తెలిపారు. ఈ చెల్లింపు క్రెడిట్ కార్డ్ / డెబిట్ కార్డ్ / నెట్ బ్యాంకింగ్ ద్వారా చేయాలని సూచించారు.

10న జాతీయ లోక్ అదాలత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల పదో తేదీన (రెండో శనివారం) జాతీయ లోక్ అదాలత్‌ను రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కోర్టు ప్రాంగణంలో నిర్వహించనున్నట్టు తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ప్రకటించింది. అన్ని రకాల సివిల్ కేసులు, రాజీ పడ దగిన క్రిమినల్ కేసులు, మోటారు ప్రమాద పరిహార కేసులు వంటి వాటి పరిష్కారం కోసం ఈ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఇందులో కేసులకు సంబంధించి సామరస్య పూర్వకమైన పరిష్కారాన్ని వేగంగా పొందడంతోపాటు చెల్లించిన కోర్టు ఫీజును తిరిగి పొందే అవకాశముంటుందని పేర్కొంది. సుప్రీం కోర్టు నుంచి కింది స్థాయి కోర్టులన్నింటిలో కేసులు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఈనెల పదో తేదీన భౌతిక లేదా వర్చువల్ పద్ధతుల ద్వారా జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో ఇరు పార్టీలకు ఆమోదయోగ్యమైన, ఖర్చు, కాలయాపన లేకుండా అప్పీలు లేని అంతిమ తీర్పును పొందొచ్చని సూచించింది.



ఎస్‌బీఐ ఐదో స్టార్టప్ బ్రాంచ్ ప్రారంభం

హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ ఎస్‌బీఐ తన ప్రత్యేకమైన ఐదవ స్టార్టప్ బ్రాంచ్‌ను హైదరాబాద్‌లో తెరిచింది. మాదాపూర్ సమీపంలో ఏర్పాటుచేసిన ఈ శాఖను సోమవారం ఎస్‌బీఐ చైర్మెన్ దినేష్ ఖారా లాంచనంగా ప్రారంభించారు. స్టార్టప్‌ల అన్ని రకాల అవసరాలను తీర్చేలా ఈ బ్రాంచీని రూపొందించామని దినేష్ ఖారా తెలిపారు. కొత్త శాఖ ఏర్పాటు సందర్భంగా స్టార్టప్ ఔత్సాహికవేత్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగాల కల్పనలో కీలక పాత్ర పోశిస్తున స్టార్టప్‌ల పట్ల తాము అంకితభావన్ని కలిగి ఉన్నామన్నారు. ఈ శాఖ స్టార్టప్ విత్త, విత్తయేతర అవసరాలను తీర్చనున్నాయని వెల్లడించారు. మరిన్ని యూనికర్న్‌ల వృద్ధికి మద్దతును అందించనుందన్నారు. ఈ సందర్భంగా కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా నాలుగు సంస్థలకు రూ.50 లక్షల చొప్పున అందించారు.

వారంలో రూ.80వేల కోట్ల డిపాజిట్లు

- బ్యాంక్‌ల్లో రూ.2వేల నోట్ల జమ

న్యూఢిల్లీ : రూ.2వేల నోట్లను ఉపసంహరించుకుంటున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించిన వారం రోజుల్లోనే రూ.80,000 కోట్ల విలువ చేసే ఈ పెద్ద నోట్లు బ్యాంక్‌ల్లో జమ అయ్యాయి. ఈ కరెన్సీ మార్పిడికి నాలుగు నెలలు సమయం ఉండటంతో రూ.3.6 లక్షల కోట్ల మొత్తం కూడా తిరిగి బ్యాంక్‌లకు రావొచ్చని ఆ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఆర్‌బీఐ గణంకాల ప్రకారం.. రూ.2వేల నోట్ల డిపాజిట్లతో మే 26 నాటికి దేశంలోని మొత్తం నగదు చెలామణి రూ.34.41 లక్షల కోట్లకు తగ్గింది. వచ్చే కొన్ని వారాల్లో మరింత తగ్గొచ్చని అంచనా. తమ వద్ద రూ.14,000 కోట్ల డిపాజిట్లు, రూ.3,000 కోట్ల విలువ చేసే రూ.2వేల నోట్ల మార్పిడి జరిగిందని ఎస్‌బీఐ చైర్మెన్ దినేష్ ఖారా ఇటీవల తెలిపారు. పెద్ద నోట్లు మొత్తం తమ వద్ద రూ.80వేల కోట్ల మేర డిపాజిటు అయ్యే అవకాశం ఉందని ఆ బ్యాంకింగ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. మొత్తం కరెన్సీలో 10-15 శాతం వరకు రూ.2వేల నోట్లు వాటా కలిగి ఉన్నాయి.

కియా సెల్టోస్ ఐదు లక్షల యూనిట్ల అమ్మకాలు

న్యూఢిల్లీ : కియా ఇండియాకు చెందిన ఎస్‌యూవీ సెల్టోస్ కేవలం 46 నెలల్లో ఐదు లక్షల యూనిట్ల అమ్మకాల మైలురాయిని చేరినట్టు వెల్లడించింది. ఆగస్ట్ 2019లో భారత్‌లో తమ ప్రయాణాన్ని ప్రారంభించినట్టు ఆ కంపెనీ తెలిపింది. స్వల్ప కాలంలోనే రికార్డ్ అమ్మకాలతో దేశంలో గర్వకారణంగా నిలిచినట్టు పేర్కొంది. ఇది వినియోగదారుల నమ్మకం, మనస్సును దోచుకుందని అభిప్రాయపడింది. మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా, మధ్య దక్షిణ అమెరికా, మెక్సికో, ఆసియా పసిఫిక్ ప్రాంతం సహా సుమారు 100 విదేశీ మార్కెట్స్‌కు ఎగుమతి చేస్తున్నట్టు తెలిపింది.

బజాజ్ ఫైనాన్స్‌తో టయోటా కిర్లోస్కర్ ఒప్పందం

బెంగళూరు : బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు టయోటా కిర్లోస్కర్ మోటార్ (టీకేఎం) వెల్లడించింది. టయోటా వాహనాన్ని కొనుగోలు చేసే ప్రక్రియను మరింత సౌకర్యవంతంగా, వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావడానికి, మెరుగైన రిటైల్ ఫైనాన్స్ ఎంపికలను అందించడానికి ఈ భాగస్వామ్యం దోహదం చేయనుందని తెలిపింది. బజాజ్ ఫినాన్స్ తమ ఖాతాదారులకు సమగ్ర ఆర్థిక పరిష్కారాలను అందించడానికి ముందుకు వచ్చిందని వెల్లడించింది. దేశంలోని 89 కీలక ప్రదేశాలలో ఫినాన్సింగ్ సేవలను అందించనుందని పేర్కొంది.

భారత్‌లో వర్జిన్ అట్లాంటిక్ విస్తరణ

బెంగళూరు : భారత్‌లో తన సేవలను విస్తరిస్తున్నట్టు విమానయాన సంస్థ వర్జిన్ అట్లాంటిక్ వెల్లడించింది. లండన్ హీత్రూ నుండి బెంగళూరుకు రోజువారీ విమానయానంతో వినియోగదారులకు గతంలో కంటే ఎక్కువ ఎంపికలను అందిస్తోన్నట్లు తెలిపింది. 2019 నుండి వర్జిన్ అట్లాంటిక్ భారత్‌లో తమ సామర్థ్యాన్ని 250 శాతం పెంచినట్టు పేర్కొంది. బ్రిటన్, భారత్ మధ్య ప్రతీ ఏడాది దాదాపు 500,000 సీట్లను అందిస్తూ.. దేశం పట్ల తమ నిబద్ధతను చాటుతున్నట్టు తెలిపింది. వర్జిన్ అట్లాంటిక్ 2023 అక్టోబర్ 28వ తేదీ నుంచి లండన్ హీత్రూ నుంచి దుబాయ్ వరకు సీజనల్ శీతాకాల సేవలను, 2024 జూన్ 3వ తేదీ నుండి మాంచెస్టర్ నుండి లాస్ వెగాస్ వరకు సీజనల్ సమ్మర్ సర్వీస్, 2022 మే 13వ తేదీ నుండి సావో పాలోకు రోజువారీ సేవలను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించింది.

స్టోన్‌లామ్ నుంచి వినూత్న ఆర్కిటెక్చరల్ ఉత్పత్తులు

హైదరాబాద్ : ఇంటీరియర్‌లలో మూడు మిల్లీమీటర్ సన్నని స్లాబ్‌ల కోసం భారతదేశంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న స్టోన్‌లామ్ ఆర్కిటెక్చరల్ మెటీరియల్స్ పరిశ్రమలో విప్లవాత్మక మార్పులను తీసుకొస్తున్నట్టు వెల్లడించింది. అత్యాధునిక మూడు మిల్లీమీటర్ల సన్నని పింగాణీ స్లాబ్‌లతో, హోటళ్ల, వాణిజ్య ప్రాంగణాలు, నివాస సముదాయాలు, హాస్పిటాలిటీ ప్రదేశాలలో సహా విస్తృత శ్రేణి భవనాలలో బాహ్య ఫసడ్స్ క్లాడింగ్ కోసం స్టోన్‌లామ్ విభిన్నమైన పరిష్కారాన్ని అందిస్తుందని స్టోనెక్స్ గ్రూప్ మార్కెటింగ్ చీఫ్ సుశాంత్ పాఠక్ తెలిపారు. ఈ స్లాబ్‌లు ఆల్గే, శిలీంధ్రాలు, మోల్డ్, బ్యాక్టీరియా పెరుగుదలకు నిరోధకతను కలిగి ఉంటయని, థర్మల్ షాక్‌కు విశేషమైన ప్రతిఘటనను ప్రదర్శిస్తాయన్నారు.

బీహార్‌లో నాలుగులైన్ల వంతెన కూల్చివేత

- అదృశ్యమైన గార్డు

న్యూఢిల్లీ : బీహార్‌లో నిర్మాణ లోపాల వల్ల నాలుగు లైన్ల వంతెనను అధికారులు ఆదివారం కూల్చిశారు. బీహార్‌లోని భగల్‌పూర్‌లో అగువానీ సుల్తాన్‌గంజ్ గంజా అనే నాలుగులైన్ల బ్రిడ్జిని ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. అయితే ఈ బ్రిడ్జి నిర్మాణ లోపాల కారణంగా.. నిన్న (ఆదివారం) సాయంత్రం అధికారులు కూల్చివేశారు. ఇప్పటివరకు ఈ బ్రిడ్జి నిర్మాణానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం 1700 కోట్లను ఖర్చుపెట్టింది. ఈ కూల్చివేత అనంతరం అధికారులు మీడియాతో మాట్లాడుతూ.. 'ఈ బ్రిడ్జి నిర్మాణంలో లోపాలున్నాయి. అందుకే ఈ బ్రిడ్జిని కూల్చేయాలని నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపారు. కాగా, ఈ ఘటనపై ఆ రాష్ట్ర డిప్యూటీ సిఎం తేజస్వి యాదవ్ మీడియాతో మాట్లాడుతూ.. 'గత సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీన ఈ బ్రిడ్జిలోని కొంత భాగం కూలిపోయింది. ఈ బ్రిడ్జి కూలిన తర్వాత నిర్మాణ విషయాల్లో అధ్యయనానికి నిపుణులైన ఐఐటీ రూర్కీని సంప్ర దించాం. దీనికి సంబంధించి తుది నివేదిక రావాల్సి ఉంది. కానీ నిర్మాణం లో తీవ్రమైన లోపాలున్నాయని నిపుణులు మాకు చెప్పారు. ఇప్పటికే హాని కలిగించే నిర్మాణ భాగాలను తొలగించాం' అని ఆయన అన్నారు.

కాగా, ఆదివారం సాయంత్ర బ్రిడ్జి కూల్చివేత అనంతరం వంతెన దగ్గర పనిచేస్తున్న గార్డు కనిపించకుండా పోయాడు. అతని కోసం ఎస్‌డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు వెతుకుతున్నాయని పర్బాట్టా సర్కిల్ ఆఫీసర్ చందన్ కుమార్ తెలిపారు. ఇక ఈ ఘటనపై భగల్‌పూర్ మాజీ ఎంపీ సయ్యద్ షానవాజ్ హుస్సేన్ నితీష్ కుమార్ ప్రభుత్వం అవినీతికి పాల్పడుతోందని విమర్శించారు. బ్రిడ్జి కూల్చివేత ఘటనపై నితీష్ ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని అయన డిమాండ్ చేశారు.

'మార్గదర్శి' నిధుల దారి మళ్లింపు కేసుపై సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ : మార్గదర్శి చిట్ ఫండ్స్ నిధుల దారి మళ్లింపు కేసుపై సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. ఈ కేసులో సంస్థ యజమానులు, ఉద్యోగులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దన్న తెలంగాణ హైకోర్టు ఉత్తర్వుల పై స్టే ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అనిరుధ్ బోస్, జస్టిస్ రాజేష్ బిందాల్ విచారణ జరిపారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వాలన్న అభ్యర్థనను పరిశీలన చేస్తామన్న సుప్రీంకోర్టు.. మార్గదర్శి చిట్‌ఫండ్స్ సహా ప్రతివాదులకు కోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూలై 18కి వాయిదా వేసింది. అంతవరకూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులన్నీ అమల్లో ఉంటాయని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది.

వచ్చే ఐదేండ్లలో...

100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

రూ. 50 వేల కోట్ల టర్నోవర్

- 4 వేల మెగావాట్ల విద్యుదుత్పత్తి
- 8 కొత్త గనులు...
- దశాబ్ది ఉత్సవాల్లో సింగరేణి లక్ష్యాలు వెల్లడించిన సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సింగరేణి కాలరీస్ సంస్థ గడచిన 9 ఏండ్లలో అద్భుత ప్రగతి సాధించిందనీ, అదే ఒరవడిని కొనసాగిస్తూ వచ్చే ఐదేండ్ల లక్ష్యాలను నిర్ధారించుకున్నామని ఆ సంస్థ సీఎమ్‌డీ ఎన్ శ్రీధర్ తెలిపారు. వచ్చే ఐదేండ్లలో వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 4 వేల మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి, 8 కొత్త గనులు ప్రారంభించి రూ. 50 వేల కోట్ల టర్నోవర్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. హైదరాబాద్ సింగరేణిభవన్‌లో సోమవారం సింగరేణి ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. తెలంగాణ అమరవీరులు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు నివాళులు అర్పించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సంస్థ సాధించిన ప్రగతిని వివరించారు. ఇతర రాష్ట్రాల్లోకీ సంస్థ విస్తరిస్తు న్నదని తెలిపారు. ఒడిశా రాష్ట్రంలో చేపట్టిన నైనీ బ్లాక్ నుంచి ఈ ఏడాది బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తున్నామనీ, వచ్చే ఏడాది నుంచి 10 మిలియన్ టన్నుల బొగ్గును అక్కడ ఉత్పత్తి చేస్తామన్నారు. వ్యాపార విస్తరణలో భాగంగా ఇప్పటికే 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్నీ, 224 మెగావాట్ల సోలార్ విద్యు త్తును కూడా రాష్ట్ర అవసరాలకు అందిస్తున్నా మన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులు, అధికారులకు సన్మానం చేశారు. ఎస్‌సీడబ్ల్యుఏ విభాగంలో డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీమతి సీహెచ్ నాగమణి, సెక్యూరిటీ గార్డు ఉబయదుల్లా, అధికారుల విభాగంలో డీజీఎం చక్రధర్‌రావు, ఎస్వోఎం కష్టాచారిలను సన్మానించారు. ఈ సందర్భంగా రూపొందించిన డాక్యుమెంటరీ, ప్రగతి పుస్తకంతో పాటు ప్రముఖ కవి, సింగరేణి ఉద్యోగి జయరాజు రాసిన గీతాన్ని సీఎమ్‌డీ ఆవిష్కరించారు.

ప్రపంచ సమస్యల పరిష్కారానికి

అంతర్జాతీయ సహకారం అవసరం

కేంద్ర మంత్రి భగవంత్ ఖుబా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆరోగ్యపరంగా ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అంతర్జాతీయ సహకారం అవసరమని కేంద్ర రసాయనాలు, ఎరువులశాఖ మంత్రి భగవంత్ ఖుబా తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మూడవ జీ 20 ఇండియా హెల్త్ వర్కింగ్ గ్రూప్ సమావేశంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. పరిశోధన - అభివద్ధి భాగస్వామ్యం కోసం అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలు, వాటాదారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని సూచించారు. అప్పుడే వనరుల కేటాయింపు సులభమవుతుందని చెప్పారు. నిధులు, వైద్య సరఫరాలు, సిబ్బంది, సమాచారం వంటి వనరులను ప్రభావవంతంగా, సమర్థవంతంగా పంపిణీ చేసేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో నిటిఅయోగ్ సభ్యులు (ఆరోగ్యం) డాక్టర్ వి.కె.పాల్, కేంద్ర ఆరోగ్య శాఖ కార్య దర్శి, ఐసీఎంఆర్ డీజీ డాక్టర్ రాజీవ్ బహల్, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సీఈవో జి.కమల వర్ధనరావు, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి లవ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలనలో పౌరభాగస్వామ్యం

అప్పుడే సత్ఫలితాలు సాధ్యం

- ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పురపాలనలో పౌరభాగస్వామ్యం పెరిగితేనే సత్ఫలితాలు సాధ్యమవుతాయని రాష్ట్ర పురపాలక, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉన్నదని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంటల్ సంస్థ తెలిపిందని వివరించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారంనాడిక్కడి అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ)లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిదేండ్ల క్రితం హైదరాబాద్ నగరం గురించి, రాష్ట్ర భవిష్యత్తు గురించి, పాలనా దక్షత గురించి అనేక అనుమానాలు వ్యక్తం అయ్యాయనీ, కానీ నేడు రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచిందని చెప్పారు. హైదరాబాద్ నగరం గ్లోబల్ సిటీగా మారాలంటే మరింత శ్రమించాల్సి ఉందన్నారు. ఆ దిశగా తమ ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. పురపాలనలో ఆస్కీ తమతో కలిసి పనిచేస్తున్నదనీ, మంచి సలహాలు, సూచనలు ఇస్తున్నదని ప్రసంసించారు. "ఇల్లు మాత్రమే నాది. నగరం నాది కాదు" అనే బాధ్యతా రాహిత్యం ప్రజల్లో ఉన్నన్ని రోజులు ఎన్ని నిధులు ఖర్చుపెట్టినా నగరం సంపూర్ణంగా మారదని మంత్రి అభిప్రాయపడ్డారు. అందుకే పురపాలనలో పౌరుల భాగస్వామ్యాన్ని తప్పనిసరి చేయాలనీ, అప్పుడే మార్పు సాధ్యమవుతుందన్నారు. రెడ్యూస్, రీసైకిల్, రీయూజ్ అనే ట్రిపుల్ ఆర్ మంత్ర ఉన్నదనీ, దాన్ని విస్తృతంగా ఆచరణలోకి తీసుకురావాలని చెప్పారు. రాష్ట్రంలో భారీ ఎత్తున మొక్కలు నాటి, వాటిని కాపాడుకునేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశామనీ, ప్రతి గ్రామానికి ఒక నర్సరీ పెట్టి, చెట్ల పెరుగుదలకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకున్నామన్నారు. పట్టణ, పంచాయతీరాజ్ చట్టంలో గ్రీన్ బడ్జెట్ ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల అవసరాల మేరకు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయలు అందుబాటులోకి వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధించడం సాధ్యమవుతుందని వివరించారు. డ్రై రిసోర్సెస్ సెంటర్ల ద్వారా మహిళా సంఘాలు గౌరవప్రదమైన ఆదాయాన్ని పొందుతున్నాయనీ, రాష్ట్రంలో ఈ సెంటర్ల ద్వారా రూ.6 కోట్లకు పైగా ఆదాయాన్ని స్వయం సహాయక సంఘాలు అర్జించాయని తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఉత్పత్తి అయ్యే వెట్ వేస్ట్ ద్వారా దాదాపు రూ.200 కోట్లకు పైగా ఆదాయం వస్తున్నదని చెప్పారు. నగరం పెరుగుతున్న కొద్దీ చెత్త సేకరణతో పాటు దాన్ని రీసైకిల్ చేసే వ్యవస్థలు మరింత పెరగాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగరంలో మరో రెండు కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్ అండ్ రీసైకిల్ ప్లాంట్లను నెలకొల్పనున్నట్టు తెలిపారు. పురపాలికల్లో చెత్త నుంచి గ్యాస్ వెలికితీసి వంటకి, వాహనాలకు ఉపయోగించే కార్యక్రమాలను త్వరలో ప్రారంభించనున్నామన్నారు. 141 పురపాలికల్లో 178 కోట్ల రూపాయలతో బయో మైనింగ్ ప్రారంభించామనీ, మానవ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. వంద శాతం వృధా నీటిని రీసైకిల్ చేస్తున్న నగరంగా త్వరలో హైదరాబాద్ నిలుస్తుందన్నారు. సోలార్ ఉత్పత్తిలో దేశంలో రెండో స్థానంలో ఉన్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆస్కీ చైర్మెన్ కే పద్మనాభయ్య, డైరెక్టర్ వీ శ్రీనివాసచారి, సీడీఎమ్ఏ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌నెట్ ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు!

- కేఎఫ్ఓఎన్ ప్రాజెక్టు ప్రారంభించిన పినరయి విజయన్
- 20 లక్షల కుటుంబాలకు ఉచిత ఇంటర్‌నెట్

తిరువనంతపురం : దేశంలో ఇంటర్‌నెట్‌ను ప్రాథమిక హక్కుగా గుర్తించిన మొట్టమొదటి రాష్ట్రం కేరళ సోమవారం ప్రతిష్టాత్మకమైన కెఎఫ్ఓఎన్ (కేరళ ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్) ప్రాజెక్టును ప్రారంభించింది. డిజిటల్‌పరంగా గల తేడాలను రూపుమాపి, రాష్ట్రం లోని దారిద్ర్య రేఖకు దిగువున గల కుటుంబాలన్నిం టికీ ఉచితంగా ఇంటర్‌నెట్ సౌకర్యాన్ని కల్పించేం దుకు ఈ ప్రాజెక్టు ఉద్దేశించబడింది. దేశంలో సామాజిక, రాజకీయ అభివృద్ధికి కేరళ రాష్ట్రం ఇప్పటికే ఒక ప్రామాణికతను నిర్దేశించింది. తాజాగా దేశ డిజిటల్ పరివర్తనలో కూడా ముఖ్యమైన మైలురాయిని చేరుకుంది. 30వేలకు పైగా ప్రభుత్వ సంస్థలకు విశ్వసనీయమైన, భద్రతతో కూడిన ఇంటర్‌నెట్ అనుసంధానతను అందించడం ఈ ప్రాజెక్టు లక్ష్యంగా వుంది. పరిమితి లేని కమ్యూని కేషన్ సౌకర్యాలు అందించడం, ఈ-ప్రభుత్వ సేవల ను మరింత సమర్ధవంతంగా అందచేయగలగడం కూడా లక్ష్యాలుగా వున్నాయి. ఇది కాకుండా అదనంగా, ఆర్థికంగా వెనుకబడిన దాదాపు 20 లక్షల కుటుంబాలకు ఉచితంగా ఇంటర్‌నెట్ సదుపా యాన్ని అందజేయడమే కాకుండా, అవసరమైన డిజిటల్ సాధనాలతో, అవకాశాలతో వారికి సాధికారతను కెఎఫ్ఓఎన్ కల్పిస్తోంది.

ప్రజల కలల సాకారం :సీఎం విజయన్

ఈ ప్రాజెక్టును ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రసంగించారు. కెఎఫ్ఓఎన్ ప్రారంభంతో ఎన్నాళ్లగానో ప్రజలు కన్న కల నెరవేరిందని, పైగా ఎల్‌డీఎఫ్ ఇచ్చిన హామీ సాకారమైందని తెలిపారు. బాధ్యతాయుతమైన పాలనకు ఇది మరొక ఉదాహరణ అని వ్యాఖ్యానిం చారు. అన్ని కుటుంబాలకు, ప్రభుత్వ కార్యాలయా లకు బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్‌నెట్ అందడమే ఈ ప్రాజెక్టు లక్ష్యమని చెప్పారు. దారిద్ర్య రేఖకు దిగువున గల 20లక్షల కుటుంబాలకు ఉచిత ఇంటర్‌నెట్ సదు పాయం అందుతుందని, మిగిలినవారికి సబ్సిడీ రేట్లకు ఇస్తామని చెప్పారు. ఇప్పటికే 17,412 ప్రభుత్వ కార్యాలయాలకు, 2105 ఇళ్లకు ఇంటర్‌నెట్ ఇచ్చారు. కోవిడ్ అనంతర కాలంలో కొత్త రకమైన పని సంస్కృతి ఆవిర్భవించిందని విజయన్ పేర్కొన్నారు. ఇంటి నుంచి పనిచేయడం, ఇంటికి సమీపంలో పని చేయడం, ఇంటికి దూరంగా పని చేయడం వంటి వర్కింగ్ పద్ధతులు సర్వసాధారణ మయ్యాయి. మన యువత ఇంటర్‌నెట్ నుండి మరిన్ని ప్రయోజనాలు పొందాలంటే దేశంలో ప్రతిచోటా మరింత మెరుగైన ఇంటర్‌నెట్ సేవలు అందాలని అన్నారు. దీనికి కేఎఫ్ఓఎన్ ప్రాజెక్టు మంచి పరిష్కారమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

విద్యుత్ విజయాలు ముఖ్యమంత్రి కేసీఆర్ సృష్టే

మంత్రి జగదీష్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విద్యుత్ విజయాలు ముఖ్యమంత్రి కేసీఆర్ సృష్టేనని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జి.జగదీష్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో విద్యుత్ విజయాలపై నిర్వహించిన విద్యుత్ ప్రగతి సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాలంలో ఉద్యమించిన వారే...నేడు హారతులు పడుతున్నారని చెప్పారు. విద్యుత్ విజయాలకు వినియోగదారులే న్యాయనిర్ణేతలని అన్నారు. తెలంగాణ ఏర్పడితే చీకట్లు కమ్ముకుంటాయన్న సీమాంధ్ర పాలకుల అపోహలను పటాపంచలు చేశారని మంత్రి గుర్తుచేశారు. కార్యక్రమంలో రెడ్కో చైర్మన్ సతీష్ రెడ్డి, ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి సునీల్ శర్మ తదితరులు మాట్లాడారు.

ప్రజాసమస్యలను

బీఆర్ఎస్ సర్కారు పక్కదారి పట్టిస్తుంది

మహిళల పట్ల నిర్లక్ష్యం

- రాజస్థాన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కృష్ణ పూనియా

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారాలతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నదని కాంగ్రెస్ నేత, రాజస్థాన్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కృష్ణ పూనియా విమర్శించారు. మహిళల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే సీతక్క, కార్పొరేటర్ విజయారెడ్డితో కలిసి ఆమె విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ ప్రజలు ఏం సంతోషంగా ఉన్నారని దశాబ్ది ఉత్సవాలు చేస్తున్నారని ప్రశ్నించారు. పేపర్ లీకేజీని పక్కదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ఏం తప్పు చేసిందని బంగాళాఖాతంలో కలపాలని కేసీఆర్ అంటున్నారో అర్థం కావడం లేదన్నారు. 2014లో ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క మహిళకు కూడా మంత్రివర్గంలో స్థానం కల్పించలేదన్నారు. మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చైన్ స్నాచింగ్, సైబర్ దాడులు ఎక్కువయ్యాయని విమర్శించారు. మద్యాన్ని నియంత్రించడంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణలో ఇప్పటి వరకు మహిళలకు కొత్త పింఛన్లు ఇవ్వలేదని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటై కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ధరణి పోర్టల్ వల్ల రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను కేసీఆర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని కోరారు. వీఆర్వో వ్యవస్థను తీసేసి కేసీఆర్ రెవెన్యూ వ్యవస్థను భ్రష్టుపట్టించారని సీతక్క విమర్శించారు. క్రీడాకారులను డబ్ల్యూఎఫ్ఐ మాజీ అధ్యక్షులు బ్రిజ్‌భూషణ్ ఇబ్బంది పెట్టినా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఒలింపిక్ గేమ్స్‌లో పతకాలు గెలిచిన క్రీడాకారులను కేంద్రం గౌరవించడం లేదని చెప్పారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ధరణి రద్దు : మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ధరణి పోర్టల్‌ను రద్దు చేస్తామని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ చెప్పారు.ధరణి తెచ్చి పెడుతున్న చిక్కులతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వడగండ్ల వానతో నష్టపోయిన రైతు లకు రూ.10వేల నష్టపరిహారాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పై సీఎం కేసీఆర్ నిర్మల్ లో చేసిన వ్యాఖ్యలను కిసాన్ కాంగ్రెస్ జాతీయ నేత కోదండ రెడ్డి ఖండించారు. మద్యం కుంభ కోణంలో కూరుకు పోయిన ఎమ్మెల్సీ కవితను రక్షించేందుకు సీఎం కేసీఆర్ కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారని పార్టీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ ఎద్దేవా చేశారు.

టీపీసీసీ లింగ్విస్టిక్ మైనార్టీ విభాగం చైర్మెన్‌గా ప్రేమలత

టీపీసీసీ అధ్యక్షులు ఎనుముల రేవంత్‌రెడ్డి అనుమతిమేరకు కాంగ్రెస్ లింగ్విస్టిక్ మైనార్టీ విభాగం చైర్మెన్‌గా ప్రేమలత అగర్వాల్‌ను నియమిం చారు. ఈమేరకు సోమవారం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షు లు మహేష్‌కుమార్‌గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు.

రక్షణ రంగంలో

పారిశ్రామిక సహకారానికి ప్రణాళిక సిద్ధం !

- వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడంపై భారత్, అమెరికా రక్షణ మంత్రుల చర్చలు

న్యూఢిల్లీ : అత్యంత ఉన్నత సాంకేతికత రంగాల్లో సహకారం దిశగా రాబోయే ఐదేండ్లలో విధానపరమైన దిశను నిర్దేశించగల రక్షణ రంగ పారిశ్రామిక సహకారానికి ఒక ప్రణాళికను భారత్, అమెరికా సోమవారం రూపొందించాయి. అలాగే కొత్త సాంకేతికతల సహ అభివృద్ధి, సహ ఉత్పత్తికి గల అవకాశాలను కూడా గుర్తించాలని నిర్ణయించాయి. ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్, రాజ్‌నాథ్ సింగ్ మధ్య జరిగిన సమావేశంలో ఈ అంశాలు చర్చకు వచ్చాయి. ఈ నెలాఖరులో ప్రధాని మోడీ అమెరికాలో పర్యటిస్తున్న నేపథ్యంలో ఆస్టిన్ పర్యటన జరుగుతోంది. సరఫరా చైన్‌లను నిర్మించడానికి గల మార్గాలను కూడా ఇరువురు మంత్రులు అన్వేషించారు. కొత్త సాంకేతికతలను కలిసి అభివృద్ధిపరచడానికి, ప్రస్తుతమున్న అలాగే కొత్త సాంకేతిక వ్యవస్థలను కలిసి ఉత్పత్తి చేయడానికి అవకాశాలను ఇరు పక్షాలు అన్వేషిస్తాయని రక్షణ మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది. ఇరు దేశాలకు చెందిన రక్షణ స్టార్టప్‌ల మధ్య సహకారాన్ని మరింత పెంచేందుకు కూడా ఆలోచిస్తున్నాయి. ఈ లక్ష్యాలను సాధించే దిశగా ఇరు పక్షాలు కలిసి రక్షణ రంగ పారిశ్రామిక సహకారానికి ఒక ప్రణాళికను ఆమోదించాయని ఆ ప్రకటన తెలిపింది. రాబోయే ఐదేళ్లలో దిశా నిర్దేశాన్ని ఈ ప్రణాళికే రూపొందిస్తుంది. ద్వైపాక్షిక రక్షణ సహకార అంశాలపై గణనీయంగా ఇరు పక్షాలు చర్చలు జరిపాయి. ముఖ్యంగా పారిశ్రామిక సహకారాన్ని బలోపేతం చేయడానికి గల మార్గాలను గుర్తించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాయి. ఆదివారం సాయంత్రం సింగపూర్ నుండి రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత్ వచ్చిన ఆస్టిన్‌కు తొలుత త్రివిధ దళాల గౌరవ వందనం లభించింది. వ్యూహాత్మక ప్రయోజాలు, విస్తృత భద్రతా సహకారంతో సహా పలు రంగాల్లో రక్షణ రంగ సహకారాన్ని పెంపొందించడంపైనే చర్చలు కేంద్రీకృతమైనట్లు రాజ్‌నాథ్ సింగ్ ట్విట్టర్‌లో తెలిపారు. స్వేచ్ఛా, పారదర్శకమైన, నిబంధనలకు కట్టుబడి వుండే ఇండో-పసిఫిక్ ప్రాంతానికి భారత్-అమెరికా భాగస్వామ్యం చాలా కీలకమని ఆయన వ్యాఖ్యానించారు. మరిన్ని రంగాల్లో అమెరికాతో మరింత కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నామని, తద్వారా తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సంఘటిత పరుచుకుంటామని చెప్పారు.

19న హరితోత్సవం

- రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలి :పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 19న ప్రత్యేక హరితోత్సవం నిర్వహిస్తున్నట్టు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చెప్పారు. సచివాలయంలో హరితోత్సవం పోస్టర్‌ను అటవీ శాఖ అధికారులతో కలిసి సోమవారం మంత్రి ఆవిష్కరించారు. తొమ్మిదేండ్లుగా హరితహారంలో భాగంగా అమలు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు, విజయాలను వివరించే రెండు పోస్టర్లను అటవీ శాఖ తయారు చేసింది. కోట్లాది మొక్కలు నాటడం, రహదారి వనాలు, పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ పార్కుల ఏర్పాటు, అటవీ పునరుద్ధరణలో భాగంగా అడవుల పెంపకం కోసం చేపట్టిన కార్యక్రమాలను పోస్టర్లలో పొందుపర్చారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి గ్రామం, పట్టణం, ప్రభుత్వ కార్యాలయాల్లో హరితహారం విజయాలను ప్రదర్శించేందుకు అటవీ శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి వివరించారు. ఈనెల 19న హరితోత్సవం సందర్భంగానే తొమ్మిదో విడత హరితహారం ప్రారంభమౌతుందన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పాటు ఎంత ప్రత్యేకమో, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు అంతే విశిష్టతను కలిగి ఉన్నాయని వివరించారు. 33 శాతం పచ్చదనం సాధన కోసం అమలు చేస్తున్న తెలంగాణకు హరితహారం జాతీయ స్థాయి ప్రశంసలు అందుకుంటున్నదని చెప్పారు. ఈ పథకానికి దక్కుతున్న ప్రతి అవార్డు, గుర్తింపులో అందరి భాగస్వామ్య ముందని అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పచ్చదనం పెంపునకు అందరూ పునరంకితం కావాలని మంత్రి పిలుపునిచ్చారు.

దరఖాస్తులలో వివరాలు సరిచేసుకోండి

- ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మెన్ విజ్ఞప్తి

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు తమ దరఖాస్తులలో ఏదైనా పొరపాటు ఉన్నా.. సరిదిద్దుకోవాలని రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మెన్ వి.వి శ్రీనివాస్‌రావు తెలిపారు. టీఎస్ఎల్‌పీఆర్‌బీకి చెందిన అధికారిక వెబ్‌సైట్‌లో అభ్యర్థుల దరఖాస్తులను పొందుపర్చటం జరిగిందనీ, ఆరో తేదీ నుంచి 8వ తేదీ వరకు అభ్యర్థులు ఏవేనీ మార్పులుంటే సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు. ఈ సమయం మించితే మరోసారి అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. అలాగే, తుది పరీక్షకు సంబంధించి కొందరు అభ్యర్థులు రీ కౌంటింగ్, రీవాల్యూయేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారనీ, ఎస్సై, కానిస్టేబుల్‌ల పోస్టులకు సంబంధించి మొత్తం 3,58,000 మంది తుది రాత పరీక్షను రాయగా అందులో 0.38 శాతం మంది అభ్యర్థులు ఇందుకోసం దరఖాస్తు చేసుకున్నారని ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన ఫలితాలను మంగళవారం (6న) తమ అధికారిక వెబ్‌సైట్‌లో ఫలితాలను వెల్లడించనున్నామని తెలిపారు. కాగా, తుది రాత పరీక్షలో అర్హత సాధించిన ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులు తమ కులధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతర అవసరమైన పత్రాలను కూడా వెరిఫికేషన్ కోసం సిద్ధం చేసుకోవాలనీ, ఈ వెరిఫికేషన్ ఎప్పుడు ప్రారంభించేది త్వరలోనే ప్రకటిస్తామని ఆయన తెలిపారు.

ఆశాల ధర్నాలు వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆశాల సమస్యల పరిష్కారానికి వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు, ఆ శాఖ ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు హామీ ఇచ్చిన నేపథ్యంలో ఈ నెల 12న కలెక్టరేట్ల ముందు తలపెట్టిన ధర్నాలను వాయిదా వేస్తున్నట్టు ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి.జయలక్ష్మి తెలిపారు. సోమవారం ఆశా డే సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీహెచ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆశాలకు ఎలాంటి పరీక్ష నిర్వహించబోమనీ, ఫిక్స్‌డ్ వేతనం, ఇతర సమస్యల పరిష్కారం కోసం వైద్యారోగ్యశాఖ మంత్రితో సమావేశం జరిపిస్తామని డీహెచ్ హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఆశాలతో సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు, పరీక్షను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారని వివరించారు. ప్రసూతి సెలవులు ఇస్తామనీ, రెస్ట్ రూమ్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నాణ్యతతో కూడిన యూనిఫారాలను ఈ నెల 10న అందజేస్తామనీ, 32 రకాల రిజిస్టర్లను ప్రింట్ చేసి ఇస్తామని చెప్పారు. జాబ్‌చార్ట్ రూపొందిస్తామంటూ కూడా మంత్రి హామీ ఇచ్చినట్టు తెలిపారు. పోరాటాలు చేసి ప్రభుత్వం నుండి హామీలు సాధించుకున్న ఆశావర్కర్లకు ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీ పక్షాన అభినందనలు తెలిపారు. రానున్న కాలంలో కూడా ఇదే స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు.

తగ్గిన సర్వీస్ పీఎంఐ

న్యూఢిల్లీ : భారత సర్వీస్ సెక్టార్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ)లో తగ్గుదల చోటు చేసుకుంది. ఈ సూచీ గడిచిన మేలో 61.2కు తగ్గింది. ఇంతక్రితం నెలలో 62.0గా చోటు చేసుకుంది. అధిక ద్రవ్యోల్బణ ఒత్తిడి డిమాండ్‌పై ప్రభావం చూపిందని ఎస్అండ్‌పీ గ్లోబల్ ఇండియా సర్వీస్ పీఎంఐ తెలిపింది. గడిచిన 12 ఏండ్లుగా ఈ సూచీ 50పైనే నమోదవుతోంది. 50కి దిగువన నమోదయితే పతనాన్ని చవి చూస్తున్నట్లుగా భావిస్తారు. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు సర్వీస్ ప్రొవైడర్లకు సవాలుగా మారుతున్నాయని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటిలిజెన్స్‌లోని ఎకనామిక్స్ అసోసియేట్ డైరెక్టర్ పొలియానా డి లిమా పేర్కొన్నారు. టూరిజం, ఆతిథ్యం, విద్యా, వైద్యం తదితర రంగాలు సర్వీస్ సెక్టార్‌లోకి వస్తాయి.